ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

జస్టిస్ వర్మ అభిశంసన ప్రక్రియ మొదలు
బంగ్లా జనపనార ఉత్పత్తులపై భారత్ నిషేధం 5

fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-8-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 193 పేజీలు: 8+16 వెల: 6.50

## వరద దిగ్బంధంలో వరంగల్లు

### ఇళ్లలోకి చేరిన వర్షం నీరు

### స్తంభించిన జనజీవనం

### అత్యధికంగా సంగెం మండలంలో 178.4 మి.మీ వర్షపాతం



మంగళవారం వరంగల్లు రైల్వేస్టేషన్లో పట్టాలపైకి భారీగా చేరిన వరద నీరు

**ప్రభాతవార్త, హన్మకొండ బ్యూరో :** ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వాన దంచికొట్టింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నగరంలోని చెరువులు, కుంటలు పొంగిపొర్లడంతో వరద నీరు

>>2



మంగళవారం చెరువును తలపిస్తున్న హనుమకొండ రహదారులు

# వాన గండం

### 72 గంటలు హై అలర్ట్

అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు

విద్యుత్, వైద్య ఆరోగ్యం, విపత్తు నిర్వహణ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

ప్రాణనష్టం లేకుండా చర్యలు

పరిస్థితికి తగినట్లుగా ఐటి, విద్యాశాఖల నిర్ణయాలు

భారీ వర్ష సూచనలున్న జిల్లాలకు ప్రత్యేకాధికారుల నియామకం

కలెక్టర్లతో వీసిలో సిఎం రేవంత్



మంగళవారం హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు12:** ఎంతటి భారీ వర్షాలు వచ్చినా ప్రాణ నష్టం వాటిల్లకుండా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు కాజ్‌వేలు, ఉధృతంగా ప్రవహించే నదులు, వాగులు, వంకలపై వంతెనలపై నుంచి రాకపోకలు లేకుండా చూడాలని సీఎం సూచించారు. పశువులు, గొర్రెలు, మేకల కాపర్లు తరచూ వాగుల్లో చిక్కుకొనిపోతున్నారని.. ఈ విషయంలో ముందస్తుగా వారిని అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. ఎక్కడైనా ప్రమాదవశాత్తూ చిక్కుకుంటే వారిని తక్షణమే బయటకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదే సమయంలో పశు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. రానున్న 72 గంటల్లో తెలంగాణవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అతి భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలు ఉన్న జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సీఎం సూచించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని... అంతా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. రెండు రోజుల్లో ఎంత వర్షపాతం వస్తుంది..ఎలా ఎదుర్కోవాలనే దానిపై మనకు

>>2



వరదనీటితో నిండిపోయిన వరంగల్‌లోని అండర్ పాస్‌వే

## మరో 3 రోజులు భారీ వర్షాలు

### పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు

### రెండు రోజులు స్కూళ్లకు సెలవులు

### లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలని సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు12:** వచ్చే మూడు రోజుల(72 గంటలు) పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. కుమురంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, ఉమ్మడి వరంగల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వానలు పడతాయని తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. దీంతో హైడ్రా, జీహెచ్ఎంసీ ముందస్తు చర్యలు చేపట్టారు. వరద నీరు ఎక్కడా నిల్వకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బుధవారం కొన్ని జిల్లాల్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, హనుమకొండ,

>>2

## 9 పార్టీలకు సిఇఒ నోటీసులు

### 25లోగా వివరణ ఇవ్వకుంటే రద్దు చర్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు12:** రాష్ట్రంలోని తొమ్మిది గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి నోటీసులు జారీ చేశారు. ఈ పార్టీలను ఎన్నికల సంఘం రిజిస్టర్ నుంచి తొలగించే అంశంపై, ఎందుకు రద్దు చేయకూడదో ఆగస్టు 25లోపు స్పష్టమైన వివరణ, ఆధారాలతో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. 2025 ఆగస్టు 12 తేదీ మెమో ప్రకారం, ఈ నోటీసులను హైదరాబాద్, మెడ్చల్-మల్కాజ్‌గిరి, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు పంపించారు. సమాధానాలు, సిఫారసులు అందిన తరువాత నివేదికలను న్యూఢిల్లీ ఎన్నికల సంఘానికి పంపనున్నారు.నోటీసులు అందుకున్న పార్టీలు: ఆల్ ఇండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ (హైదరాబాద్), ఆల్ ఇండియా బీసీ ఓబీసీ పార్టీ (మెడ్చల్-మల్కాజ్‌గిరి), బీసీ భారత దేశం పార్టీ (హైదరాబాద్), భారత లేబర్ ప్రజా పార్టీ

>>2

సినీ ఫక్కీలో జ్యుయెలరీ దుకాణంలో దోపిడి 6
హైదరాబాద్‌లో దొంగల బీభత్సం



మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్

## 'నీటిపారుదల'లో పూర్తిస్థాయి సంస్కరణలు

### ఆధునిక పరిజ్ఞానం అమలులోకి

### సెంట్రల్ డిజైన్ విభాగంపై సమీక్ష జరిపిన మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు12:** నీటిపారుదల శాఖా సెంట్రల్ డిజైన్ విభాగం పటిష్ఠతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మేడిగడ్డ ఉదంతంలో జాతీయ భద్రత సంస్థతో పాటు జస్టిస్ ఘోష్ కమిషన్ చేసిన వ్యాఖ్యలతో సి.డి.ఓ ప్రతిష్ట దెబ్బతిన్నదని ఆయన వ్యాఖ్యానించారు.అటువంటి వ్యాఖ్యాలపై సి.డి.ఓ పునఃసమీక్షించుకుని సంస్కరణలు చేపట్టడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు.అందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.మంగళవారం మధ్యాహ్నం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో నీటిపారుదల శాఖాధికారులతో ఆయన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సి.డి.ఓను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ముఖ్యంగా ప్రాజెక్టుల డిజైన్‌ల రూపకల్పనలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకరావాలన్నారు.అందుకు అవసరమైన లేటెస్ట్ సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో ముందుండాలన్నారు. సమయంలో సి.డి.ఓ లో ఖాళీగా ఉన్న ఉద్యగాల భర్తీకి తక్షణం చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు అన్నీ స్థాయిలలో ఉద్యగాల భర్తీ చేపట్టడం సంస్థను బలోపేతం చేయడంలో బాగామేనన్నారు.ఐ.ఐ.టిలు,ఎన్.ఐటిలవంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల నుండి నీటిపారుదల శాఖలో నియమితులైన ఇంజినీర్లను సి.డి.ఓ లో పోస్టింగ్ ఇవ్వబోతున్నట్లు ఆయన వెల్లడించారు.నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్నవి కావడంతో ప్రతిభావంతులైన ఇంజినీర్ల సేవలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజినీరింగ్, సృజనాత్మక అవసరమని అది అత్యుత్తమ శిక్షణ పొందిన నిపుణుల ద్వారానే సాధ్యపడుతుందన్నారు.అటువంటి నిష్ణాతులైన ఇంజినీర్లను వినియోగిస్తూ అత్యాధునిక పరిజ్ఞానం వినియోగించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసుకోవాలన్నారు.పదవీ విరమణ పొందిన అనుభవం కలిగిన అనుభవజ్ఞులైన వారి సేవలు కుడా వినియోగించుకుని అద్భుతమైన ఫలితాలు రాబట్టలని అన్నారు.

# భారీగా రోడ్ల అభివృద్ధి

### హ్యామ్ విధానంలో నిర్మాణానికి చర్యలు: డి.సిఎం భట్టి

### 6810 కి.మీ రహదార్లకు డిసెంబర్ నాటికి టెండర్లు: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన హ్యామ్ కార్యక్రమంలో పాల్గొన్న డి.సిఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు12:** రాష్ట్రంలో పెద్ద ఎత్తున రహదారులను అభివృద్ధి చేస్తామరి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌పిసిలో హ్యామ్ విధానంలో రోడ్లు నిర్మాణంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అభివృద్ధి పనుల బకాయిలు 45,000 కోట్లను వారసత్వంగా ఇచ్చి వెళ్ళిందని విమర్శించారు. తెలంగాణ రైజింగ్‌లో కాంట్రాక్టర్లు భాగస్వాములు కావాలి అని, హ్యామ్ రోడ్డు పనుల్లో చిన్న కాంట్రాక్టర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న యంగ్ స్టేట్ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే హైబ్రిడ్ యాన్యుటి మోడ్ (హ్యామ్) రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టాన్నారు. ప్రతి గ్రామాన్ని..మండల కేంద్రానికి,ప్రతి మండలాన్ని..జిల్లా కేంద్రానికి..ప్రతి జిల్లాను రాష్ట్ర రాజధానికి కలిపే విధంగా రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఆర్అండ్ బి ఆధ్వర్యంలో 17 ప్యాకేజీలో 5190కి.మీ రోడ్లు వేయబోతున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి సహకా రంతో పెద్ద ఎత్తున మంచి రోడ్లు వేసుకోబోతున్నామని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా అవసరమే కాబట్టి రోడ్లకు ప్రాధాన్యతనిస్తు న్నామన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షతన ఎన్‌పిసి లో జరిగిన హ్యామ్

>>2

## 'సృష్టి' కేసు 'సిట్'కు బదలీ

### డా.నమ్రతపై 8 కేసులు నమోదు.. 25 మంది అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ ఆదేశాల మేరకు ఈ కేసును గోపాలపురం పోలీస్‌స్టేషన్ నుంచి నగర సీసీఎస్ సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)కు అప్పగిస్తున్నట్లు నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం నార్త్‌జోన్

>>2



## 3 రాష్ట్రాల్లో నాలుగు సెమికండక్టర్ పరిశ్రమలు

### ఎపి, ఒడిశా, పంజాబ్‌లో ఏర్పాటు

### రూ.5801 కోట్లతో లక్నో మెట్రోరైల్‌ప్రాజెక్టుకు ఆమోదం

### అరుణాచల్‌ప్రదేశ్‌లో 8146.21కోట్లతో హైడ్రో విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు.. కేంద్రకేబినెట్ నిర్ణయాలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 12:** దేశంలోని మూడు రాష్ట్రాల్లో రూ.4600 కోట్లతో సెమికండక్టర్ చిప్ పరిశ్రమలు ఏర్పాటుకాబోతున్నాయి. ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాలకేబినెట్‌కమిటీ ఈమేరకు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల్లోనే ఈపరిశ్రమలు ఏర్పాటవుతాయి. సిక్‌సెమ్, కాంటినెంటల్ డివైస్ ఇండియా లిమిటెడ్, 3డి గ్లాస్ సొల్యూషన్స్ ఇంక్, అడ్వాన్స్

>>2



## మంత్రి పదవి కోసం ఎవరి కాళ్లు మొక్కలేదు..

### దిగజారి బతకడం చేతకాదు..

### పదవిరాకపోవడంతో రగులుతున్న రాజగోపాల్‌రెడ్డి

**భువనగిరి ,ఆగస్టు 12 ప్రభాతవార్త:** మంత్రి పదవి దక్కకపోవడంతో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇటీవల రాజగోపాల్ రెడ్డి వరుస కామెంట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వరసగా పరోక్ష కామెంట్లు చేస్తున్నడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆసక్తికరమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. .ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి తానే పదేళ్ళ పాటు

>>2

## 'శత్రు ఆస్తుల'పై సర్వే జరపండి

### అధికారులకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశం

### వచ్చేనెల 'సెపీ' కార్యాలయాలు సందర్శించాలని నిర్ణయం

### 'ఎనిమీ ప్రాపర్టీస్' వేలం ద్వారా సర్కార్‌కు రూ. 107 కోట్ల ఆదాయం



**హైదరాబాద్, ఆగస్టు 12 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ కేసులను ఈనెలాఖరు అంటే ఆగస్టు 31లోపు పరిష్కరించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. దీంతోపాటు దేశవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న శత్రు ఆస్తుల (ఎనిమీ ప్రాపర్టీస్) సమస్యలను పరిష్కరించేందుకు సర్వేను వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటి వరకు ఎనిమీ ప్రాపర్టీస్ విక్రయాల ద్వారా ప్రభుత్వానికి రూ.107 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్ లోని తన కార్యాలయంలో కేంద్ర బండి సంజయ్ స్వాతంత్ర్య సమరయోధులు, పునరావాస విభాగం (ఎఫ్ఎఫ్ఆర్) సీనియర్ అధికారులు, ఇండియాలో శత్రు ఆస్తుల సంరక్షక (సిఈపిఐ) అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్లు, శత్రు ఆస్తుల ఆర్థికీకరణ, శరణార్థుల పునరావాసంపై అధికారులు కేంద్ర మంత్రికి సమగ్ర నివేదిక అందజేశారు. స్వాతంత్ర్య సైనిక్ సత్కార యోజన (ఎస్ఎస్ఎస్‌వై) కింద పెండింగ్‌లో ఉన్న స్వాతంత్ర్య సమరయోధులు, వారిపై ఆధారపడ్డ జీవిత భాగస్వాములు/కుమార్తెల పెన్షన్ కేసుల పరిష్కారంలో సాధించిన పురోగతి వివరాలను సైతం వివరించారు. స్వాతంత్ర్య సైనిక్ సత్కార యోజన (ఎస్ఎస్ఎస్‌వై)కు సంబంధించి హోంమంత్రిత్వ శాఖవద్ద 26 వేల 623 మంది ఫైళ్లు పెండింగ్ లో ఉండగా, ఇప్పటి వరకు 13 వేల మందికిపైగా పరిష్కరించినట్లు తెలిపారు. దాదాపు 12212 మందికి లబ్ధి చేకూరినట్లు పేర్కొన్నారు. అట్లాగే స్వాతంత్ర్య సమర యోధుల పెన్షన్లకు సంబంధించి 8829 ఫైళ్లు పెండింగ్‌లో ఉండగా, ఇప్పటి

>>2

## గట్టు వామన రావు దంపతుల హత్య కేసు సిబిఐకి

### సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు



వామన్ రావు దంపతులు (ఫైల్)

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన న్యాయవాద దంపతులు గట్టు వామన్ రావు, ఆయన సతీమణి నాగమణిల హ త్య కేసును సిబిఐకి బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు మంగళవారం నాడు ఆదేశాలు జారీ చేసింది. 2021 ఫిబ్రవరి 17వ తేదీన మంథని కోర్టుకు హాజరై కారులో హైదరాబాద్ వస్తున్న వామన్ రావు దంపతులను పెద్దపల్లి జిల్లా కల్వచర్ల వద్ద కారులో వచ్చిన దుండ గులు మొదట వామన్ రావు దంపతుల కారును అడ్డగించారు. దీని తరువాత వామన్ రావును కారు నుంచి బయటకు లాగి కత్తులతో దారుణంగా పొడిచి

>>2



మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన తిరంగా బైక్ ర్యాలీలో పాల్గొన్న పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తదితరులు

# 'సృష్టి'కేసు 'సిట్'కుబదలీ

>>కార్యాలయంలో డీసీపీ రష్మీపెరుమాళ్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డా.నమ్రత చేసిన అక్రమ సరోగసీ, చైల్డ్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై లోతైన విచారణ జరిపేందుకు ఈ కేసును సిట్‌కు బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు.

**వెలుగులోకి డా.నమ్రత అరాచకాలు..**

రాజస్థాన్‌కు చెందిన దంపతుల ఫిర్యాదు మేరకు జులై 27న కేసు నమోదు చేసుకున్న గోపాలపురం పోలీసులు దర్యాప్తు ప్రారంభించి ఇప్పటివరకు డాక్టర్ నమ్రతపై మొత్తం 8 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, కేసుతో సంబంధమున్న 25 మంది నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో డాక్టర్ నమ్రతతో పాటు ఆమె కుమారుడు అడ్వకేట్ జయంత్‌కృష్ణ, గాంధీ ఆసుపత్రి అనస్థీషియా వైద్యుడు నార్గుల సదానందం, విశాఖపట్నంకు చెందిన డాక్టర్లు విద్యులత, ఉషాదేవి, వాసుపల్లి రవితో సహా ఏజెంట్లు, సబ్ ఏజెంట్లు, ఏఎన్ఎంలు, శిశువులను విక్రయించిన తల్లిదండ్రులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం వీరందరూ చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారని చెప్పారు. అలాగే, డాక్టర్ నమ్రత చాలా ఏళ్లుగా హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతూ అక్రమ సరోగసీ తతంగాన్ని నడుపుతున్నారని తెలిపారు. ఫెర్టిలిటీ సెంటర్ నిర్వహణ కోసం వేరే డాక్టర్ వద్ద ఉన్న లైసెన్స్ అక్రమంగా వాడుకున్నారు. ముఖ్యంగా చట్టంలో ఉన్న లొసుగులను వాడుకుని అమాయకుల నుంచి భారీ ఎత్తున డబ్బులు దండుకున్నారని వివరించారు. సంతానం కలగని దంపతులకు ముందుగా సికింద్రాబాద్‌లో గల యూనివర్సల్ సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌లో కౌన్సిలింగ్ నిర్వహించి, వారికి సరోగసీ అవసరమని నమ్మించి అనంతరం వారికి విశాఖపట్నం కేంద్రంలో సరోగసీ ట్రీట్‌మెంట్ ఇచ్చేవారని తెలిపారు. నకిలీ స్కానింగ్ రిపోర్టులు పంపిస్తూ, ఆయా దంపతుల వద్ద రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసింది. తొమ్మిది నెలల సమయంలో కాన్పుకు సిద్ధంగా ఉన్న నిరుపేద మహిళలకు డబ్బు ఆశ చూపించి వారికి పుట్టిన శిశువులను అతి తక్కు ధరకు కొనుగోలు చేసి, సరోగసీ కోసం వచ్చిన దంపతులకు అప్పగించేది. ఇందుకు సహకరించిన ఏజెంట్లకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు డబ్బులు అందజేసేది. ఇలా అక్రమార్జనే ధ్యేయంగా డా.నమ్రత ఈ తతంగాన్ని నడిపినట్లు విచారణలో అంగీకరించినట్లు పేర్కొన్నారు.కేసులో కీలక విషయాలను వెలుగులోకి తెచ్చేందుకు కేసును గోపాలపురంపోలీసుల నుంచి సీసీఎస్ సిట్‌కుఅప్పగిస్తున్నామని అన్నారు. ఇలాంటి అనుమతులు లేనిఫెర్టిలిటీ సెంటర్లను నమ్మిప్రజలు మోసపోవద్దని డీసీపీ సూచించారు.

# హత్య కేసు సిబిఐకి

>> చం పారు. దీంతో పాటు కారులో వున్న ఆయన భార్య నాగమణిని కూడా కత్తులతో పొడిచి చంపారు. పట్టపగలు నడిరోడ్డుపై అందరు చూస్తుండగా జరిగిన ఈ జంట హత్యలు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపాయి. కాగా ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులు కుంట శ్రీను, చిరంజీవి, కుమార్‌లను పది రోజుల వ్యవధిలోనే పోలీసులు అరెస్టుచేసి రిమాండుకు తరలించారు. గ్రామంలోని తగాదాల కారణంగానే వామన్‌రావు దంపతుల హత్య జరిగిందని పోలీసులు తేల్చారు. ఇదే సమయంలో కోర్టులో నిందితులపై ఛార్జిషీట్ కూడా దాఖలు చేశారు. ఈ కేసు విచారణ కోర్టులో కొనసాగుతోంది. అయితే వామన్‌రావు తండ్రి కిషన్‌రావు మాత్రం తన కుమారుడు, కోడలి హత్యలపై సిబిఐ చేత విచారణకు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన సు ప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దీనిపై సుప్రీం ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి గత ఏప్రిల్ నెలలో నోటీసులు జారీ చేసింది. వామన్ రావు దంపతుల హత్య కేసును సిబిఐకి ఇస్తే మీకేమైన అభ్యంతరం వుందా...? అని ప్రశ్నించగా తమకెలాంటి ఇబ్బంది లేదని సర్కారు తెలిపింది. దీని తరువాత వామన్ రావు దంపతుల హత్య కేసుకు సంబంధించిన ఆధారాలు, చనిపోయే ముందు వామన్ రావు పోలీసులకు వెల్లడించిన వీడియో సా క్ష్యం కూడా సుప్రీం కోర్టు తెప్పించుకుంది. చనిపోయే ముందు వామన్ రావు తనను, తన భార్యపై కత్తులతో దాడిచేసిన వ్యక్తి కుంట శ్రీను అనే వ్య క్తి అని చెప్పిన వీడియో అసలైనదేనని ఎఫ్ఎస్ఎల్ నిర్ధారించుకుంది. వీటన్నింటి నేపథ్యంలో వామన్ రావు దంపతుల హత్య కేసును సిబిఐకి సుప్రీం అప్పగించింది. దీంతో పాటు ఈ కేసులో ఫిర్యాదిదారుడైన వామన్ రావు తండ్రి కిషన్ రావుకు సర్కారు భద్రత కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించి ంది. కాగా తన కుమారుడు, కోడలి హత్య కేసును సిబిఐకి సుప్రీం కోర్టు అప్పగించడం పట్ల పిర్యాదిదారుడు కిషన్ రావు సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ తన కుమారుడు, కోడలిని దుండగులు అత్యంత పాశవికంగా చంపారని, దీనిపై సిబిఐ అన్ని కోణాల్లో విచారించి, అసలు విషయాలను నిగ్గుతేల్చి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తుందని తాను నమ్ముతున్నట్లు ఆయన తెలిపారు.

# 'శత్రు ఆస్తుల'పై సర్వే జరపండి

>> వరకు 6700 ఫైళ్లను క్లియర్ చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు 2103 మందికి లబ్ది చేకూరినట్లు తెలిపారు. ఎనిమి ప్రాపర్టీస్ (శత్రు ఆస్తులు) విషయానికొస్తే... దేశవ్యాప్తంగా 12800 శత్రు ఆస్తులున్నాయని సంబంధిత విభాగం అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. వీటిలో 1427 ప్రాపర్టీస్ కు సంబంధించిన వివాదాలను పరిష్కరించి ఆయా ఆస్తులను ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చినట్లు తెలిపారు. 1300కుపైగా ప్రాపర్టీస్ యూపీకి సంబంధించినవేనని వివరించారు. మరో 616 ఎనిమీ ప్రాపర్టీస్ లో వేలం వేయగా, వాటిలో 313 ఆస్తుల వేలం ప్రక్రియ పూర్తయిందన్నారు. వాటిద్వారా రూ.107 కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూరినట్లు పేర్కొన్నారు. ఎనిమీ ప్రాపర్టీస్ కు సంబంధించి 3,300కుపైగా కేసులు న్యాయస్థానాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో 440 ఆస్తులకు సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తయ్యిందని వివరించారు.ఈ సందర్భంగా ఫ్రీడం ఫైటర్స్, ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పరిష్కారంలో అధికారులు తీసుకున్న చర్యలను కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు. పెండింగ్ లో ఉన్న మిగిలిన పెన్షన్ దరఖాస్తులను సైతం వేగవంతం చేసి ఆగస్టు 31వ తేది లోపు పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వాల నుండి అవసరమైన పత్రాలు అందకపోవడం వల్ల పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొనడంతో వెంటనే ఈ విషయంపై రాష్ట్రాలకు లేఖలు పంపాలని స్వాతంత్ర సమరయోధులు, పునరావాస విభాగం జాయింట్ సెక్రటరీని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వాలనుండి పత్రాలనుసేకరించి, పెన్షన్ మంజూరును వేగవంతం చేయడానికి ప్రత్యేక బృందాలను రాష్ట్రాలకు పంపాలని కోరారు.

# సిఇఒ నోటీసులు

>> (భద్రాద్రి- కొత్తగూడెం), లోక్‌సత్తా పార్టీ (హైదరాబాద్), మహాజన మండలి పార్టీ (హైదరాబాద్), నవభారత్ నేషనల్ పార్టీ (మెద్చల్-మల్కాజ్‌గిరి), తెలంగాణ ప్రగతి సమితి (మెద్చల్-మల్కాజ్‌గిరి), తెలంగాణ ఇండిపెండెంట్ పార్టీ (మెద్చల్-మల్కాజ్‌గిరి). పార్టీ పేర్లను జాతీయ,స్థానిక పత్రికల్లో ప్రచురించడంతో పాటు, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం ఇవ్వాలని సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో ఆదేశాలు జారీ చేశారు.

# మంత్రి పదవి కోసం ఎవరి కాళ్లు మొక్కలేదు..

>> ముఖ్యమంత్రిగా కొనసాగుతానని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కౌంటర్ ఇచ్చాను మాట తక్కువచేసి పని ఎక్కువ చేయాలంటూ సీఎం ఉద్దేశించి మాట్లాడిన కామెంట్స్ జిల్లాలో ఆ టాపిక్ గా మారాయి. నన్ను పార్టీలకు తీసుకున్నప్పుడు మేము అన్నదమ్ముల ఉన్న మాట తెలియదా, నాకు ఐ కమాండ్ మంత్రి పదవి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ముఖ్య నేతనే కావాలని అడ్డుకుంటున్నారని ,పరోక్షంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కామెంట్లు చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం సాగుతుంది. ప్రతిపక్షాలను తిట్టడం సీఎం రేవంత్ రెడ్డి మానేసి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సమయం కేటాయించాలని మునుగోడు ఎమ్మెల్యే ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఒక మీడియా ఛానల్ ఇంటర్వ్యూలో రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సైతం రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని, సమీకరణలతోనే మంత్రి పదవి ఇవ్వలేకపోయామని కుండ బద్దలు కొడుతూ స్పష్టమైన ప్రకటన చేయడంతో రాజగోపాల్ రెడ్డి డిమాండ్ కు కొండంత బలం చేకూరినట్లు అయింది. మాట ఇచ్చి తప్పరంటూ అసహనంలో ఉన్న రాజగోపాల్ రెడ్డి ఆవేదన, తన అక్రోసాన్ని రోజుకో రూపంలో వెళ్లగక్కుతుండడంతో ప్రస్తుతం జిల్లాలో సంచలనం సృష్టిస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రజల ఆకాంక్ష నెరవేరేలా పాలన సాగాలని, ప్రజల్లో అసంతృప్తి పెరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి పై ఉందన్నారు.

## వారం - వర్జ్యం

13-08-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
చవితి ఉ.6.36, పంచమి తె.4.24
ఉత్తరభాద్ర ఉ.10.32
వర్జ్యం : రా.9.48-11.19
దు.ఉ.11.48-12.39
శుభసమయం: ఉ.6.45-7.30, సా.6.30-7.10
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి.

**వృషభం :** వివాహ, ఉద్యోగ యత్నాలు సాగిస్తారు. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:** కుటుంబ సభ్యులందరి ప్రోత్సాహం లభిస్తుంది, ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :** శుభకార్యాలలో బంధు, మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తు లాభం.

**సింహం:** నూతన గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**కన్య :** ఆర్థికపరమైన లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**తుల :** సంఘంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి. అపురూపమైన వస్తువులు సేకరిస్తారు.

**వృశ్చికం:** ఇంటియందు శుభకార్యాల ప్రసాత్వన వుంటుంది. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఓర్పు, నేర్పులతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు.

**మకరం:** భూములు, స్థలాలు కొనుగోలు చేస్తారు. బంధువ నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**కుంభం:** రావలసిన పాతబాకీలు వసూలవుతాయి. నూతన పెటుబ్బడులకు అనుకూలమైన కాలం.

**మీనం :** సన్నిహితులనుండి శుభవార్తలు అందుకుంటారు. నూతన కాంట్రాక్టులు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వాన గండం

>> మాన్యువల్స్ ఉన్నాయని... కానీ వాతావరణ మార్పులతో రెండు గంటల్లోనే రెండు నెలల వర్షపాతం కురుస్తోందని... క్లౌడ్ బస్టర్స్‌తో ఊహించనంత నష్టం వాటిల్లుతోందని సీఎం తెలిపారు. క్లౌడ్ బస్టర్ పరిస్థితులను ఎదుర్కొనే వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఊహించనంత వర్షపాతంతో గతంలో ఖమ్మం, వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రాణ నష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని.. అటువంటి ఘటనలు ఎట్టి పరిస్థితుల్లోనూ పునరావృతం కావడానికి వీల్లేదని సీఎం అన్నారు. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోపై పూర్తి అవగాహనతో ఉండాలని నీటి పారుదల శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. జల విద్యుత్ తయారీపైనా దృష్టి సారించాలని, అదే సమయంలో నీటి విడుదలపై పూర్తి సమాచారం లోతట్టు ప్రాంతాల ప్రజలకు తెలియజేయాలన్నారు. చెరువులు, కుంటలు కట్టల తెగే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు , విద్యుత్ స్తంభాలు, ఇతర సామగ్రి సిద్ధంగా ఉంచాలన్నారు. సమస్య ఎక్కడ తలెత్తినా తక్షణమే పరిష్కరించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని... పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో అవసరమైన మందులు ఉంచాలని, గర్భిణులను తక్షణమే తరలించేలా అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. అన్ని పట్టణాల్లో లోతట్టు ప్రదేశాల నుంచి ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని... వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు....పిడుగుపాట్లతో పశువులు, మేకలు, గొర్రెలు చనిపోయినప్పుడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించి బాధితులకు పరిహారం అందేలా చూడాలని పశుసంవర్ధక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు.

**హైదరాబాద్ నగరంలో....**

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్‌లు సమన్వయంతో పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్, ఎంఏయూడీ ప్రతి విభాగం సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం సూచించారు. ఐటీ, విద్యా శాఖ ఉన్నతాధికారులు పరిస్థితిపై సమీక్షించి వర్క్ ఫ్రం హోం.. సెలవుల విషయమై నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. హైడ్రా, విపత్తు నిర్వహణ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, జీహెచ్ఎంసీ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం సూచించారు. హైడ్రా టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయాలని.ప్రజల నుంచి వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం ఆదేశించారు. లా అండ్ ఆర్డర్ పోలీసులు సైతం ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగస్వాములు కావాలని సీఎం సూచించారు. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు అందజేయాలని.. అదే సమయంలో భయానక వాతావరణం సృష్టించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం హనుమకొండలో ఓ ఇంటిలోకి చేరిన వరదనీరు

# జలదిగ్బంధంలో వరంగల్లు

>> ఇళ్లను ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో హనుమకొండ బస్టాండ్, చౌరస్తా, ఇతర లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. రహదారులు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. రోడ్డుపై భారీగా నీరు నిలవడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి.పలు మండలాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. అత్యధికంగా సంగెం మండలంలో 178.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే ఖిలావరంగల్‌లో 155.0 మి.మీ., వరంగల్‌లో 148.8 మి.మీ., వర్ధన్నపేటలో 125.4 మి.మీ., ఖానాపూర్‌లో 108.8 మి.మీ. అతి భారీ వర్షం కురిసింది. అలాగే గీసుగొండలో 90.4 మి.మీ, దుగ్గొండిలో 84.2 మి.మీ, నల్లబెల్లిలో 66.4 మి.మీ, నర్సంపేటలో 86.4 మి.మీ, చెన్నారావుపేటలో 85.4 మి.మీ, రాయపర్తిలో 90.8 మి.మీ, పర్వతగిరిలో 88.6 మి.మీ, నెక్కొండలో 82.4 మి.మీ భారీ వర్షం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. జిల్లా మొత్తం సగటు వర్షపాతం 107.0 మి.మీగా నమోదైంది.ఖిలా వరంగల్ అగడ్త చెరువు ఉధృతిఖిలావరంగల్ అగడ్త చెరువు ప్రమాదకర స్థాయిలో నిండిపోయింది. రిటర్నింగ్ వాల్ పైవరకు నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఈ వరద ధాటికి చెరువు వెనకాల ఉన్న సుమారు 100 ఎకరాల పంటలు నీటమునిగాయి. ఈ పరిణామంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఖిలా వరంగల్ చెరువు పొంగిపొర్లుతుండడంతో ఆ నీరంతా శివనగర్, మైసయ్య నగర్‌లో లోతట్టు ప్రాంతాల నీట ముంచాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు.రైల్వే అండర్ బ్రిడ్జ్ కింద నుంచి రాకపోకలు బంద్‌వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జ్ కింద భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తెల్లవారుజామున ఎవరు లేకపోవడంతో ఒక కారు నీటిలో మునిగిపోయింది. అదృష్టవశాత్తూ, స్థానికులు వెంటనే స్పందించి జేసీబీ సహాయంతో కారును బయటకు తీశారు. అధికారుల నుంచి సకాలంలో ఎలాంటి సహాయక చర్యలు అందలేదని స్థానికులు వాపోతున్నారు.ప్రధాన రహదారులపైనా వరద ప్రభావంవరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్లే ప్రధాన రహదారిపై అక్కడక్కడ నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో భారీ వాహనాలు మినహా బైకులు, ఆటోలు, కార్లు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వచ్చింది. కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే బొల్లికుంట చెరువు అలుగు పోస్తుండడంతో గుంటూరు పల్లి, బొల్లికుంట మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వందల ఎకరాల్లో పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయి చెరువులను తలపింప చేశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ రైల్వే స్టేషన్ కు భారీగా వరద పోటెత్తింది. ఒకటి, రెండవ ప్లాట్ ఫామ్ ల మధ్య పట్టాలు కనిపించినంత వరద నీరు చేరింది. రైల్వే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.



ఎన్నికల కమిషన్ బీహార్ ఓటరు జాబితాలో 124 సంవత్సరాల వయస్సు గల ఓటరుగా జాబితాతో చేర్చబడిన మింటా దేవి పేరు ఉన్న టీషర్టులను ధరించి మంగళవారం పార్లమెంటు వద్ద నిరసన ప్రదర్శన జరిపిన కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర విపక్షాలకు చెందిన ఎంపీలు

# భారీగా రోడ్ల అభివృద్ధి

>> విధానం పై చర్చ జరిగింది. ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క హాజరయ్యారు.ఈ సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు,స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్,ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా,ఆర్ అండ్ బి అధికారులు,బ్యాంకర్లు,కాంట్రాక్టర్లు తదితరులు ఈ సమావేశానికి హాజరు అయ్యారు.ఆర్ అండ్ బి,పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్లు వేయనున్నామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అమెరికా సంపన్న దేశం కాబట్టి అమెరికా రోడ్లు బాగుండటం కాదు,అమెరికా రోడ్లు బాగుండటం వల్లనే అమెరికా సంపన్న దేశంగా మారింది అని జాన్ ఎఫ్ కెన్నడీ (అమెరికా మాజీ అధ్యక్షులు) పేర్కొన్నట్లు మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే, హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం) రహదారుల నిర్మాణానికి పూనుకున్నామని తెలిపారు. ప్రజలను రహదారులతో అనుసంధానించడం, రాష్ట్ర అభివృద్ధిని ప్రోత్సహించడం, తెలంగాణ భవిష్యత్తుకు రూపకల్పన చేయడం అనే ఆశయంతో మేం అవిశ్రాంతంగా కృషిచేస్తున్నామన్నారు. ప్రతి గ్రామాన్ని.. మండల్ కేంద్రానికి, ప్రతి మండలాన్ని.. జిల్లా కేంద్రానికి, ప్రతి జిల్లాను.. రాష్ట్ర రాజధానికి కలిపే హైవేలను నిర్మించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. హైబ్రిడ్ ఆన్యుటీ మోడల్ కార్యక్రమంలో మొదటి దశలో: పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం 17 ప్యాకేజీలలో 7,947 కిలోమీటర్ల రోడ్డు పనులను చేపడుతుంది. రోడ్లు భవనాల శాఖ అభివృద్ధి చేయాలని తలపెట్టిన 12 వేల కిలోమీటర్ల రహదారుల్లో మొదటి దశలో రూ.6478.33 కోట్ల రూపాయలతో 17 ప్యాకేజీలలో 5,190 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేస్తుంది.మిగిలిన 6810 కిలోమీటర్ల రహదారులను వచ్చే డిసెంబర్ నాటికి టెండర్లు పిలిచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. జిల్లా కేంద్రాల నుండి రాష్ట్ర రాజధానికి నాలుగు వరుసల రోడ్లు, మండలాల నుండి జిల్లాలకు రెండు వరుసల రోడ్లు,గ్రామాలను కలుపుతూ అన్ని వాతావరణాలకు అనుకూలమైన రోడ్లను బలోపేతం చేయడమే మా వ్యూహాత్మక ప్రణాళిక. అనుసంధానం లేని గ్రామ పంచాయతీ రోడ్లను మెరుగుపరచడం మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చాలనే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు.ఒక్కసారి ఈ హ్యామ్ రహదారుల నిర్మాణం ప్రారంభం అయితే సదరు సంస్థలే.. రహదారులను నిర్వహిస్తూ.. గుంతలు పూడ్చడం, పగుళ్ల మూసివేయడం, సైన్‌బోర్డులు, కాలువలు, మరియు లైటింగ్ వంటివి నిర్వహిస్తారు కాబట్టి ప్రమాదాలు తగ్గుతాయనే ఆశాభావంతో ఉన్నాను. ఈ రాష్ట్ర ప్రజానీకం కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం "నమ్మకమైన రోడ్లు, ప్రమాదాలు లేని రహదారులను నిర్మించడమే కాదు, ఈ ప్రాజెక్టులో భాగస్వాములైన ప్రతీ సంస్థకు అండగా ఉంటామని తెలియజేస్తున్నాను. ఇప్పటికే ఈ ప్రాజెక్టు అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు "గిబి రోడ్స్ ఇన్వెంటరీ" అనే వెబ్ ఆధారిత అప్లికేషన్‌ను అభివృద్ధి చేయడం జరిగింది. అంతేకాదు, రహదారుల నాణ్యత, నిర్వహణ పర్యవేక్షణకు ప్రత్యేక యంత్రాగాన్ని ఏర్పాటు చేస్తాం.ఈ హ్యామ్ ప్రాజెక్ట్ గ్రామీణ ప్రాంతీయ అభివృద్ధికి, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఊతం ఇస్తుందని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నట్లు తెలిపారు.

# 24 నుంచి పిసిసి చీఫ్ జనహిత పాదయాత్ర

**హైదరాబాద్, ఆగస్టు 12 ప్రభాతవార్త:** టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ రెండో విడత జనహిత పాదయాత్ర ఈనెల 24వ తేది నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 24వ తేదీ చొప్పదండి నియోజక వర్గంలో సాయంత్రం 5 గంటలకు జనహిత పాదయాత్ర ప్రారంభం కానుంది. 25వ తేదీ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శ్రమదానం కార్యక్రమాలు, 10.30 గంటల నుంచి కరీంనగర్ జిల్లా కార్యకర్తల సమ్మేళనం నిర్వహించనున్నారు. 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు వర్ధన్నపేట నియోజకవర్గంలో జనహిత పాదయాత్ర...26వ తేదీ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శ్రమదానం, 10.30గంటలకు వరంగల్ జిల్లా కార్యకర్తల సమ్మేళనం..26వ తేదీ సాయంత్రం 6 గంటలకు జుబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఉంటుందని పార్టీ ప్రకటించింది.

# భారీ వర్షాలు

>> జనగామ, వరంగల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశముందని ఈ ఐదు జిల్లాలకు రెడ్‌అలర్ట్ జారీ చేసింది. పెద్దపల్లి, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలో భారీ వానలు పడతాయని వివరించింది. ఆ 9 జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రాబోయే మూడు రోజులు హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైడ్రా తెలిపింది. మేడ్చల్ జిల్లాతో పాటు సైబరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 10 నుంచి 15 సెంటీ మీటర్లు, మరికొన్ని ప్రాంతాల్లో 20 సెంటీ మీటర్ల వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. వచ్చే మూడు రోజులు ప్రజలెవరూ బయటికి రావొద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని రంగనాథ్ కోరారు. అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ వాహనాలు తీసుకొని రహదారులపైకి రావొద్దని, భారీ వర్షాల నేపథ్యంలో అంతా అప్రమత్తంగా వ్యవహరించాలని హైడ్రా విజ్ఞప్తి చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లో అత్యంత భారీ వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. సోమవారం రాష్ట్రంలోనే అత్యధికంగా నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలో 6.6, గుడిపల్లి మండలంలో 6.5, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తాళ్లపల్లిలో 6.4 సెం.మీ. వర్షం కురిసింది. సంగారెడ్డి, వికారాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, జనగామ, వరంగల్, నిర్మల్, కరీంనగర్ జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పశ్చిమ మధ్య బంగాఖాతంలో అల్పపీడనం ఏర్పడు అవకాశం ఉండటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈనెల 13 నుంచి 16 వరకు అతి బారీ వర్షాలు కురవనున్నాయి.

**రెండు రోజులు స్కూళ్లకు సెలవులు**

భారీ వర్ష సూచన దృష్ట్యా విద్యా శాఖ ఐదు జిల్లాల్లో స్కూళ్లకు సెలవులు ప్రకటించింది. బుధవారం,గురువారం(నేడు,రేపు) సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ,వరంగల్,జనగామ,యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల్లో నేడు,రేపు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం నేడు,రేపు ఒంటిపూట బడులు ఉంటాయని వెల్లడించింది.వరంగల్, హనుమకొండ, కాజీపేటల్లో భారీ వర్షం కురిసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో హనుమకొండ బస్టాండ్, చౌరస్తా, ఇతర లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. కాజీపేట, హసన్‌పర్తి, రెడ్డిపురం, గోకుల్ నగర్, అంబేద్కర్ నగర్, న్యూ శాయంపేటలో వరద నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు.

# సెమికండక్టర్ పరిశ్రమలు

>> సిస్టమ్ ఇన్ పాకేజ్ టెక్నాలజీస్ సంస్థలకు ఆమోదం లభించింది. ఈ నాలుగు సంస్థలకు కలిపి మొత్తం 4600 కోట్ల పెట్టుబడి అవుతుంది. 2034 మంది వృత్తినిపుణులకు అవకాశాలు లభిస్తాయి. పరోక్షంగా మరింతమందికి ఉపాధి కల్పిస్తుంది. ఇండియా సెమికండక్టర్‌మిషన్ ఇప్పటివరకూ 10 కంపెనీలు ఏర్పాటు అయితే వీటిల్లో పెట్టుబడులు రూ.1.60 లక్షలకోట్లుగా ఉన్నాయి. ఆరురాష్ట్రాల్లో ఈపరిశ్రమ విస్తరించింది. టెలికామ్, ఆటోమోటివ్, డేటా సెంటర్స్, కన్సూమర్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రీయల్ ఎలక్ట్రానిక్స్ రంగాలకు ఈ సెమికండక్టర్లు ఎంతో చేరువగా అందుబాటులోకి వస్తాయని కేంద్రం భావిస్తోంది. రెండు ఫ్యాక్టరీలు ఒడిశాలోను, ఒకటి పంజాబ్‌లోను, మరోటి ఆంధ్ర ప్రదేశ్‌లోను ఏర్పాటవుతున్నాయి. సిక్‌సెమ్ కంపెనీ గ్లాస్ సిక్ వేఫర్‌ఫ్యాబ్ యుకెకంపెనీతో కలిసి వస్తోంది. సిలికాన్ కార్బైడ్ ఆధారిత సెమికండక్టర్స్ తయారుచేసింది. సిలికాన్ కార్బైడ్ పరికరాలు తయారుచేస్తుంది. సాలీనా 60వేలకుపైగా వేఫర్లు, ప్యాకేజింగ్ సామర్థ్యం 96 మిలియన్ యూనిట్లతో ఉంటుంది. క్షిపణులు, డిఫెన్స్ సామగ్రి, ఎలక్ట్రిక్ వాహణాలు,రైల్వే, ఫాస్ట్ ఛార్జర్లు, డేటా సెంటర్ ర్యాక్‌లు, కన్సూమర్ సామగ్రి, సోలార్ పవర్ ఇన్వర్టర్లకు ఈ సెమికండక్టర్లు అవసరం అవుతాయి. అలాగే 3డి గ్లాస్ సొల్యూషన్స్ ఇంక్ కూడా భువనేశ్వర్ వ్యాలీలోనే ఏర్పాటవుతుంది. సాలీనా 69,600 గ్లాస్ ప్యానెల్ సబ్‌స్ట్రాక్ట్స్ రూపొందిస్తుంది. 50 మిలియన్ అసెంబ్లింగ్ యూనిట్లు ఉంటాయి. ఇకఎఎస్ఐపి యూనిట్ ఆంధ్ర ప్రదేశ్‌లో ఏర్పాటవుతుంది. దక్షిణ కొరియా భాగస్వామ్యంతో సాలీనా 96 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో వస్తోంది.

## ఎయిర్‌పోర్టులో 13 కిలోల గంజాయి స్వాధీనం

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 12, ప్రభాతవార్త:** డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ వద్ద 13.3 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు, బ్యాంకాక్ నుండి హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తున్న ఒక భారతీయ మహిళా ప్రయాణికురాలిని అదుపులోకి తీసుకున్నారు. ప్రయాణికుడి చెక్-ఇన్ బ్యాగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ఆ వస్తువులో ఆకుపచ్చని ముద్ద పదార్థం ఉన్న 20 ప్యాకెట్లు బయటపడ్డాయి. క్షేత్ర పరీక్షలో ఆ పదార్థం గంజాయిగా నిర్ధారించబడిందని తెలిపారు. నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న పదార్థం విలువ బహిరంగ మార్కెట్లో 713.3 కోట్ల చేస్తుందని తెలిపారు. ప్యాకేజింగ్ మెటీరియల్‌తో పాటు స్వాధీనం చేసుకున్నారు. 1985 నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టంలోని నిబంధనల కింద ప్రయాణీకుడిని అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



ఎయిర్‌పోర్టులో స్వాధీనం చేసుకున్న గంజాయి దృశ్యం

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కి మాజీమంత్రి కెటిఆర్ లీగల్ నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 12:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇటీవల సిట్ విచారణకు హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కెటిఆర్.. బండి సంజయ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే బండి సంజయ్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆయనకు కెటిఆర్ లీగల్ నోటీసులు పంపించారు. ఒక ప్రజాప్రతినిధిపై ఇలా అసత్య ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని అని కెటిఆర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సంజయ్ అసత్యాలు మాట్లాడారని నోటీసులో పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉండి.. బాధ్యతారహిత్యంగా మాట్లాడారని మండిపడ్డారు. రాజకీయ ఉనికి కోసమే అసత్య ఆరోపణలు చేస్తున్నారని.. ఒక ప్రజా ప్రతినిధిపై ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు. భవిష్యత్తులో అసత్య ఆరోపణలు చేయకుండా ఉండాలని.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో క్రిమినల్ చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించారు.

# పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ

### రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే రాజ్యాంగానికి రక్ష

### బిజెపి, మోడీ ప్రభుత్వంపై ఎంపి మల్లు రవి ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** దేశంలో మోడీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవి వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సభలో ప్రశ్నోత్తరాల సమయంలో కనీసం ప్రశ్నలు అడిగే అవకాశం కూడా ఇవ్వడం లేదన్నారు. బీహార్‌లో జరిగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పైన చర్చ కోసం కాంగ్రెస్ పార్టీ పట్టుబడితే, ఇప్పటివరకు దానిపై స్పందన లేదన్నారు. ముఖ్యంగా ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపిలు అడిగే ఏ ప్రశ్నకూ ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదన్నారు. లోక్ సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ పార్టీల ఎంపిలు చర్చకు పట్టుబడితే, వెంటనే వాయిదా వేస్తున్నారని మల్లు రవి వివరించారు. సాయంత్రం సమయంలో సభ మళ్లీ ప్రారంభించి.. వారికి నచ్చిన బిల్లులను ఆమోదిస్తున్నారని ఆరోపించారు. ప్రజల కోసం తీసుకొచ్చే బిల్లు లపై ప్రతిపక్ష ఎంపి లు మాట్లాడ కుంటే, ఇదే ప్రజా స్వామ్య మని ప్రశ్నించారు. మోడీ ఓట్ల చోరీ చేస్తున్నారని ఆరోపించారు. ఇంతటి నియంతృత్వ పాలనను రాజుల కాలంలో కూడా చూడలేదని వ్యాఖ్యానించారు. ఇదే బిజెపి చివరి ప్రభుత్వం అని.. రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా ఇండియా కూటమి విజయం సాధిస్తుం దని మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని అయి తేనే.. రాజ్యాంగానికి రక్షణ ఉంటుందన్నారు.

# రాముడు మతిస్థిమితం లేకనే వాలిని వధించాడా!

### తమిళ కవి వైరముత్తు వివాదాస్పద వ్యాఖ్యలు

### హిందూ వ్యతిరేకి అంటూ ధ్వజమెత్తిన బిజెపి

**చెన్నై, ఆగస్టు 12:** ప్రముఖ తమిళ కవి, సినీ గేయ రచయిత వైరముత్తు శ్రీరాముడిపై చేసిన వ్యాఖ్యలు తమిళనాడులో తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపాయి. సీతాదేవితో విడిపోయిన తర్వాత శ్రీరాముడు తన మానసిక సమతుల్యత కోల్పోయాడని ఆయన చేసిన వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ తీవ్రంగా స్పందించింది. చెన్నైలో కంబర్ కళగం నిర్వహించిన ఒక కార్యక్రమంలో వైరముత్తు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంబ రామాయణంలోని ఒక కోణాన్ని వివరించారు. వాలిని శ్రీరాముడు చాటుగా దాడి చేసి చంపినప్పుడు ఎవరూ క్షమించలేదు. కానీ కవి కంబన్ మాత్రం రాముడిని క్షమించాడు. ఎందుకంటే, సీతా వియోగంతో రాముడు మతి స్థిమితం కోల్పోయాడని, అందుకే అలా ప్రవర్తించాడని కంబన్ భావించాడు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 84 ప్రకారం మానసిక స్థితి సరిగా లేని వ్యక్తిని శిక్షించలేమని కంబన్ ఆనాడే చెప్పకనే చెప్పాడని వైరముత్తు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై తమిళనాడు బిజెపి అధ్యక్షుడు నాయినార్ నాగేంద్రన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైరముత్తు వ్యాఖ్యలు పూర్తిగా హిందూ వ్యతిరేకమని, హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. లౌకికవాదం గురించి మాట్లాడే డిఎంకె పార్టీ, ఈ వ్యాఖ్యలను ఎందుకు ఖండించడం లేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు. వైరముత్తు వివాదాల్లో చిక్కుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఆయన ఆండాళ్‌ను 'దేవదాసి'గా అభివర్ణిస్తూ చేసిన వ్యాఖ్యలు కూడా పెను దుమారం రేపాయి. తమిళనాడు రాజకీయాల్లో శ్రీరాముడిపై వివాదాస్పద వ్యాఖ్యలు కొత్తేమీ కాదు. గతంలో మాజీ ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎం. కరుణానిధి సైతం రామసేతు నిర్మాణంపై స్పందిస్తూ, అంత గొప్ప బ్రిడ్జి కట్ట డానికి రాముడు ఏ ఇంజనీరింగ్ కళాశాలలో చదివాడు అని వ్యంగ్యంగా ప్రశ్నించడం చర్చకు దారితీసిన విషయం తెలిసిందే.



# బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్..

### ఇద్దరు జవాన్లకు గాయాలు

### మావోయిస్టులకు భారీ నష్టం జరిగినట్లు సమాచారం

**చర్ల, ప్రభాతవార్త :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో పోలీసులు, నక్సలైట్ల మధ్య ఎన్‌కౌంటర్ జరుగుతోంది. ఈ నెల 11న మావోయిస్టులు సమావేశం అయ్యారన్న సమాచారం అందడంతో సైనికులను సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ తరుణంలో మంగళవారం ఉదయం సైనికులు అడవికి చేరుకున్నప్పుడు, నక్సలైట్లు కాల్పులు సాగుతోంది. రెండు వైపుల నుండి జరిగిన కాల్పుల్లో ఇద్దరు సైనికులు గాయపడగా వారిని హెలికాప్టర్ ద్వారా రాయ్‌పూర్‌కు తరలించారు. ప్రస్తుతం ఇద్దరు సైనికుల పరిస్థితి ప్రమాదకరంగా లేదని పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ సంఘటన గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరగగా... రెండు వైపుల నుండి అడపాదడపా కాల్పులు జరుగుతున్నాయని పోలీసు అధికారులు తెలిపారు. నక్సలైట్లు కూడా నష్టపోయే అవకాశం ఉందని అంచనా వస్తున్నారు.

## గిరిజనేతరుల చేతుల్లో పోడు భూములు

### రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో పోడు భూములు గిరిజనేతరుల చేతుల్లో ఉండడంపై రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. అటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ములుగు జిల్లాలో చట్ట విరుద్ధంగా గిరిజనేతరులు గిరిజన భూములను పట్టా చేసుకున్న విషయమై పలువురు గిరిజన రైతులు హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయానికి వచ్చి చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. కొన్ని చోట్ల గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వడంలో అధికారులు నిరక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గత పదేండ్ల కాలంలో గిరిజన ప్రాంతాల్లో పోడుభూములు ఆగమయ్యాయని చెప్పారు. తమ జిల్లాలో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో కూడా కేసులు వేగంగా ముందుకు పోవడం లేదని వివరించారు. పోడు భూముల విషయంలో కూడా గిరిజన రైతులకు న్యాయం చేసేలా చూడాలని కమిషన్‌ను వేడుకున్నారు.

# బిజెపికి ఏజెంట్‌లా కేంద్ర ఎన్నికల కమిషన్

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా ఉండాల్సిన కేంద్ర ఎన్నికల కమిషన్ బిజెపి ఏజెంట్ మాదిరిగా వ్యవహరిస్తుందని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలో మాట్లాడారు. బిహార్‌లో 124 ఏళ్ల తప్పుడు వయసుతో మింటా దేవికి ఓటు హక్కు కల్పించారని, ఎలా ఓటు నమోదు చేసుకుందో తెలియదని అన్నారు. గత ఎన్నికల్లో 400 స్థానాలలో గెలవలేకపోయారని, అందుకే ఎన్నికల కమిషన్ సహాయంతో బిజెపి తప్పిదాలకు పాల్పడు తుందన్నారు. రాజ్యాంగాన్ని అందించిన కాంగ్రెస్‌ను నింది స్తున్నారంటూ మండిపడ్డారు. రాజ్యాంగాన్ని కాపాడుకునే దమ్ము ధైర్యం మాకుందని, ప్రతి నియోజకవర్గంలో ఓట్ల చోరీ అంశంపై నిరసన తెలుపుతామన్నారు. హైదరాబాద్‌లో శేరిలింగంపల్లి లాంటి ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలున్నాయని అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో మా గొంతు నొక్కే ప్రయత్నం చేశారన్నారు. మా పోరాటం ఇక్కడితో ఆగదని, గెలవడానికి తక్కువ అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలు పాల్పడుతున్నారని అన్నారు. బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాంలో గెలవడానికి ఎలక్షన్ కమిషన్‌ను బిజెపి వాడుకుంటుందని, ఓటర్ల అవకతవకలపై పార్లమెంట్ ద్వారం వద్దే కాదు అన్ని నియోజకవర్గాల్లో నిరసన చేస్తామని, దీనిపై ప్రజల్లోకి వెళ్లి వారిని చైతన్యవంతం చేస్తామన్నారు. మోడీ ప్రజల చేత 100 శాతం ఎన్నుకోబడి ప్రధాని కాలేదు. మేనేజ్మెంట్ చేసి ప్రధాని అయ్యాడని, ఏపి సిఎం చంద్రబాబు, బీహార్ సిఎం నితీష్ కుమార్‌ని ప్రలోభాలకు గురిచేసి మోడీ ప్రధాని అయ్యాడన్నారు.



## సోనియా, రాహుల్‌గాంధీతో పిసిసి ఉపాధ్యక్షుడు అజారుద్దీన్ భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నుంచి టికెట్ ఆశిస్తున్న పిసిసి ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపి మహమ్మద్ అజారుద్దీన్ మంగళవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, విపక్ష నేత రాహుల్‌గాంధీలో భేటీ అయ్యారు. ఈసందర్భం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును వివరించారు. ఈసందర్భంగా అజారుద్దీన్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రాబోయే ఉప ఎన్నికపై ఎవరికి సందేహం అవసరం లేదని కాంగ్రెస్ అధిష్టానం టికెట్‌నుతనకే కేటాయిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## బడ్జెట్ స్కూళ్లకు ప్రభుత్వ సహకారం అవసరం

**హైదరాబాద్, ఆగస్టు 12 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బడ్జెట్ స్కూళ్లకు ప్రభుత్వ సహకారం అందడం లేదని బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(బి స్మార్ట్) సంఘం రాష్ట్ర అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా,ఆర్మూరులో బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి, కోశాధికారి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, రహమద్ షఫీ, దయాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జలంధర్‌రెడ్డిలు నూతన కమిటీని నిర్వహించారు.

# అభివృద్ధి పనుల అనుమతికి మంత్రుల కమిటీ

### ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర అభివృద్ధి కోసం మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా నలుగురు మంత్రులకు కమిటీలో చోటు దక్కింది. అభివృద్ధి పనుల పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పన కోసం కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీలో సభ్యులుగా నీటిపారుదల శాఖ, ఐటీ శాఖ, ఆర్ అండ్ బి శాఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రులు ఉన్నారు. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పనులకు కమిటీ అనుమతి తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## దొంగ ఓట్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు

### కాంగ్రెస్ సీనియర్ నేత ఫిరోజ్ ఖాన్

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** బోగస్ ఓట్లను తొలగించాలని అనేక సార్లు ఉన్నతాధికారులను కలిసినా ఫలితం లేకుండా పోయిందని కాంగ్రెస్ సీనియర్ నేత ఫిరోజ్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ డూప్లికేట్ ఐడిలతో కొత్త ఓట్లు సృష్టించారని, దొంగ ఓట్లు వేస్తున్న ముగ్గురిని కూడా పట్టుకున్నామన్నారు. వారు అసదుద్దీన్ ఒవైసీ మనుషులుగా గుర్తించడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. రెవెన్యూ అధికారులను వంద మందిని ఓటరు జాబితా ప్యూరిఫికేషన్ చేయాలని నియమించారు. పది రోజుల తర్వాత అధికారులు కనిపించలేదని అన్నారు. ఐదు సంవత్సరాలు కొట్లాడితే పది శాతం ఓట్లు తొలగించారన్నారు. అది కూడా చనిపోయిన వారి పేర్లు మాత్రమేనని అన్నారు. హైదరాబాద్‌లో ఎంఐఎం చేసే పని.. దేశంలో బిజెపి చేస్తుందని, రాహుల్ గాంధీ ఓట్ చోరీ అంశం ఎత్తుకోవడం సంతోషకరం అన్నారు. ఎన్నికల కమిషన్‌కి డిక్లరేషన్ కావాలంటే తాను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాని అన్నారు.

# ఎస్వీ అన్నప్రసాదం, గోసంరక్షణ ట్రస్ట్‌లకు భూరి విరాళం

### రూ.1.10 కోట్లు అందజేసిన దాత



**తిరుమల,ఆగస్ట్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమ వంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న ఉచిత అన్నప్రసాదం ట్రస్ట్‌కు ,గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ దాత 1.10కోట్ల రూపాయలు విరాళాలిచ్చాడు. హైదరాబాద్‌కు చెందిన కాప్టన్‌సర్వీసెస్ సంస్థ అధినేత కొడాలి శ్రీకాంత్ భారీ విరాళాలకు సంబంధించి చెక్కులను అందజేశాడు. మంగళవారం ఉదయం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఆలయంలోపల రంగనాయకుల మండపంలో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు కోటిరూపాయలు, గోసంరక్షణకు 10లక్షలు విరాళాలను అందించాడు.

# సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నా

### గట్టు వామన్‌రావు కేసులో అసలు దోషులకు శిక్ష పడాలి

### ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** హైకోర్టు సీనియర్ న్యాయవాది గట్టు వామన్ రావు దంపతుల హత్య కేసు విచారణను సిబిఐకి అప్పగించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వాగతించారు. ఇది న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కలిగించిందని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో అసలు దోషులు, వారికి సహకరించిన అప్పటి ప్రభుత్వ పెద్దలకు శిక్ష పడితేనే ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. మంథనిలో నడిరోడ్డుపై అడ్వకేట్ వామన్ రావు దంపతులు హత్యకు గురైతే అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. నిష్పక్ష పాతంగా విచారణ చేయకుండా అసలు దోషులను కాపాడిందన్నారు. కుమా రుడు, కోడలిని కోల్పోయిన ఆ వృద్ధ తల్లిదండ్రులకు న్యాయం చేయాల్సిన అప్పటి ప్రభుత్వపెద్దలు విచారణను తప్పుదోవ పట్టించి అసలు హంత కులను కాపాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు విచారణను సిబిఐకి అప్పగించాలని ప్రజాసంఘాలు, కాంగ్రెస్ పార్టీ కోరినా పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వా సం ఉందన్నారు. చివరకూ న్యాయమే గెలుస్తుందన్నారు.

# నిరుద్యోగులకు పెద్దన్నగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### టిపిసిసి జనరల్ సెక్రటరీలు చనగాని దయాకర్

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ గత పాపాలు నిరుద్యోగులకు శాపంగా మారాయని టిపిసిసి జనరల్ సెక్రటరీలు చనగాని దయాకర్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగాల భర్తీ స్పష్టమైన హామీ ఇచ్చారని, వారికి పెద్దన్నగా సిఎం ఉన్నారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఉద్యోగాల భర్తీ కోసం పూర్తి స్థాయిలో నిమగ్నమైందని వివరించారు. అశోక్ అనే రాజకీయ శిఖండి నిరుద్యోగులను అడ్డుపెట్టుకొని తన కోర్సు అమ్ముకుని డబ్బులు సంపాదనకు రుచిమరికి ప్రభుత్వంను బద్నాం చేస్తున్నారన్నారు. అశోక్ అనే వ్యక్తి బిఆర్ఎస్ పార్టీ అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే ఉద్యోగాల ఉద్యోగాలు సాధ్యం అన్నారు. నిరుద్యోగులతో రాజకీయాలు చేసే శిఖండులను ఏరేద్దాం అన్నారు. ఐఏఎస్‌ల కమిటీ వేసింది ఉద్యోగాల భర్తీ కోసం అన్నారు. గాంధీ భవన్ ముట్టడి వెనుకల బిఆర్ఎస్ పార్టీ హస్తం ఉందన్నారు. త్వరలోనే తెలంగాణ ఉద్యోగాల భర్తీ ప్రకటన ఉండబోతుందని, నిరుద్యోగులకు అండగా ప్రజా పాలన ఎప్పుడు వెన్ను తట్టి ఉంటుందన్నారు.

# బసవ ఎక్స్‌ప్రెస్‌లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్‌డిఎస్‌ఒ

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 12,ప్రభాతవార్త** వారం రోజుల నుంచి రైల్వే యంత్రాంగానికి విశ్రాంతి లేకుండా చేసిన బసవ ఎక్స్‌ప్రెస్ బ్రేక్‌ప్రెషర్ డ్రాప్ సమస్యను రైలు యాంత్రిక, సాంకేతిక లోపాలను గుర్తించేందుకు లక్నోలోని రీసెర్చ్ డిజైన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్(ఆర్‌డిఎస్‌ఒ) రంగంలోకి దిగింది. రాయలసీమ జిల్లాల మీదుగా మైసూర్-బాగల్‌కోట్-మైసూరు మధ్య తిరిగే 17307/08 బసవ ఎక్స్‌ప్రెస్‌లో ఏర్పడిన యాంత్రిక, సాంకేతిక సమస్యల కారణంగా గత వారం రోజులుగా ఈ నెల 5వ తేదీ నుండి రైల్వే యంత్రాంగానికి ముఖ్యంగా యాంత్రిక విభాగానికి అంతుబట్టని సమస్యగా మారింది. బసవ ఎక్స్‌ప్రెస్ బ్రేకింగ్‌లో లోపంలో బసవ ఎక్స్‌ప్రెస్ ఫార్మేషన్ రేక్‌ను రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో హుబ్లీ డివిజన్ కోచింగ్ డిపోకు తరలించారు. జర్మనీ దేశపు అత్యాధునిక యాంత్రిక,సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన లింక్ హాఫ్ మెన్ బుష్(ఎల్‌ఎహెచ్‌బి) బోగీలు కలిగిన బసవ ఎక్స్‌ప్రెస్ ఫార్మేషన్‌లో 50కి.మీల వేగానికి చేరుకోగానే బ్రేక్ షెఫర్డ్ డ్రాప్ కావడం రైలు మొరాయించడం/ఆగిపోవడం సమస్యలతో ప్రయాణికులు, రైల్వే సిబ్బంది పడ్డ ఇబ్బందులు వర్ణణాతీతం. రైల్వే అధికార యంత్రాంగం ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బోర్డు ఆదేశాల మేరకు లక్నోలోని ఆర్‌డిఎస్‌ఒ కోచింగ్ డైరెక్టర్, డైరెక్టరేట్ బృందం బసవ ఎక్స్‌ప్రెస్ బ్రేకింగ్ విధానంలో ఏర్పడిన లోపాన్ని గుర్తించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా సోమవారం నైరుతి రైల్వే హుబ్లీ కోచింగ్ డిపోలో బసవ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 21ఎల్‌హెచ్‌బి బోగీల ఫార్మేషన్ బ్రేకింగ్ విధానంలో బ్రేకింగ్ కంట్రోల్ ప్యానెల్, పైప్‌లైన్లు,బ్రేక్‌ప్రెషర్,ఎఫ్‌పి,బ్రేకింగ్ డిస్క్‌లను,అలారం చైన్ పుల్లింగ్(ఏసిపి),ఫేయిలూర్ ఇండక్షన్ బ్రేక్ అప్లికేషన్(ఫిబా),ఫైర్ డిడక్షన్ యూనిట్(ఎఫ్‌డియు),బ్రేక్ అగ్జిలేటర్ యూనిట్(బిఏసి), ఏఎల్‌పి/టీఎంఆర్ ఎమర్జెన్సీ,ఎయిర్ సప్లై యూనిట్(ఏఎస్‌పి) వంటి కీలక విషయాల పనితీరును ఇప్పటికే గుంతకల్లు రైల్వే డివిజన్ సిబ్బంది శ్రమించిన ఫలితం లేకపోయింది. ప్రస్తుతం హుబ్లీ కోచింగ్ డిపోలో బసవ ఎక్స్‌ప్రెస్ రైలు రేక్‌ను ఆర్‌డిఎస్‌ఒ కోచింగ్ డైరెక్టర్,డైరెక్టరేట్ బృందం,హుబ్లీ సిఅండ్‌డబ్ల్యూ అధికారులు, నిపుణులైన స్కిల్డ్ ఆర్టిజాన్‌లు టెక్నీషియన్స్ సిబ్బంది రైలులో ఏర్పడిన లోపాన్ని గుర్తించేందుకు బోగీల వారిగా శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు.

# అమెరికా ప్రమాదంలో తెలంగాణ యువతి మృతి

### రెస్టారెంట్‌కు వెళ్తుండగా ఢీకొట్టిన ట్రక్కు

**హైదరాబాద్ (దుండిగల్), ఆగస్టు 12, ప్రభాతవార్త:** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమా దంలో తెలంగాణ యువతి దుర్మరణం చెందింది. స్నేహితురాలితో కలిసి రాత్రి భోజ నం కోసం రెస్టారెంట్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన



శ్రీజవర్మ (ఫైల్)

వివరాల ప్రకారం.. సిద్దిపేట ప్రాంతానికి చెందిన లక్కర్సు శ్రీనివాస్‌వర్మ, హేమలత దంప తులు 15 సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి దుండిగల్‌లోని బాలాజీనగర్‌లో స్థిరపడ్డారు. శ్రీని వాస్‌వర్మ ఓ ప్రైవేటు పాఠశాలలో ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జిగా పనిచేస్తుండగా భార్య ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. వీరికి శ్రీజవర్మ(24), శ్రేయవర్మ ఇద్దరు కూతుర్లు. పెద్దకూతురు శ్రీజవర్మ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్‌ను పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం మూడు సంవత్సరాల కింద అమెరికా వెళ్లింది. చికాగోలోని ఈస్టర్న్ ఇల్లినాయిస్ యూనివర్సిటీలో ఇటీవల మాస్టర్స్ పూర్తి చేసుకొని అర్బానాలోని ఓ అపార్ట్ మెంట్‌లో నివాసం ఉంటూ ప్రస్తుతం ఉద్యోగ అవకాశాలు వెతుకుం టుంది. చిన్న కూతురు శ్రేయవర్మ కూడ ఇంజినీరింగ్ పూర్తి చేసుకొని ఉన్నత చదు వుల కోసం 20 రోజుల కిందట అమె రికా వెళ్లింది. సోమవారంరాత్రి శ్రీజవర్మ తన స్నేహితురాలితో కలిసి భోజనం కోసం తను నివాసం ఉం టున్న అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న రెస్టారెంట్‌కు నడుచుకుంటూ వెళ్తుం డగా వెనుక నుండి వేగంగా దూసుకువచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికుల సహాయంతో వైద్య శాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

**శోకసంద్రంలో కుటుంబసభ్యులు..**

శ్రీజవర్మ మృతితో శ్రీనివాస్‌వర్మ కుటుంబం శోకసంద్రంలో మునిగి పోయింది. ప్రతి రోజు శ్రీనివాస్‌వర్మ తన కూతురు శ్రీజవర్మకు ఉదయం 11గంలకు వీడియోకాల్ చేసి మాట్లాడేవారు. మంగళవారం ఉదయం 8:30 గంలకు పలుమార్లు ఫోన్ చేసిన స్పందనలేదు. గంట తరువాత శ్రీజవర్మ ఫోన్ నుండి కాల్ రావడంతో సంతోషంతో ఫోన్ లిఫ్ట్ చేసిన శ్రీనివాస్‌వర్మ దంపతులకు తమ పెద్దకూతురు తిరిగిరాని లోకాలకు వెళ్ళిందని తెలిసి కుప్పకూలి పోయారు. తమ కూతురు మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తీసుకురావడానికి సాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తల్లి దండ్రులు కోరుతున్నారు.

# భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

### 154 బిలియన్ యూనిట్లకు చేరిన వినియోగం

### గత ఏడాది కంటే 2.4 శాతం పెరుగుదల

### మార్కెట్ క్లియరింగ్ ధరలో 23 శాతం తగ్గుదల

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాత వార్త:** దేశ వ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. వరుసగా రెండు నెలలు తగ్గుదల తర్వాత, విద్యుత్ డిమాండ్ జూలైలో తిరిగి పుంజుకుంది, ఇది గత సంవత్సరం. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 2.4 శాతం పెరిగి 154 బిలియన్ యూనిట్లకు (బియుఎస్) చేరుకుందని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో రియల్‌టైమ్ మార్కెట్లో సగటు క్లియరింగ్ ధరలో సంవత్సరానికి 23 శాతం తగ్గుదల ఏర్పడింది. మే, జూన్ నెలలో వార్షిక క్షీణతకు భిన్నంగా, ఈ పెరుగుదల పారిశ్రామిక కార్యకలాపాలలో పునరుజ్జీవనానికి ఎక్కువగా కారణమని భావిస్తోంది. కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి నివేదిక ప్రకారం ఇది రియల్‌టైమ్ మార్కెట్ క్లియరింగ్ ధరలో తగ్గుదలకు వీలుకల్పించింది. దీంతో జూలైలో యూనిట్‌కు రూ.3.83 వద్ద స్థిరపడింది. దేశం మొత్తం మీద థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సంవత్సరానికి తగ్గుదల చూసినప్పటికీ, క్లీన్ ఎనర్జీ వనరుల ద్వారా ఆ అంతరాన్ని భర్తీ చేసేందుకు ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో జల విద్యుత్ ఉత్పత్తితో పాటు, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. వివిధ రాష్ట్రాల్లో అధిక వర్షపాతం స్థాయి రికార్డు కావడంతో జల విద్యుత్ ఉత్పత్తి సంవత్సరానికి 36 శాతం పెంచగా, పునరుత్పాదక ఇంధన వనరులు సంవత్సరానికి 7.2 శాతం పెరుగుదలకు దోహదపడ్డాయి. దీనికి తగినట్లుగా జూలైలో రియల్ టైమ్ మార్కెటింగ్, డేఅహెడ్ మార్కెట్ వాల్యూమ్‌ల మధ్య విస్తరణ కూడా గణనీయంగా 401 మిలియన్ యూనిట్లకు తగ్గింది, ఇది జూన్ 2020-జూలై 2025 మధ్య నమోదైన సగటు 2,529 మిలియన్ యూనిట్లకు పూర్తి విరుద్ధంగా ఉంది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సానుకూల వృద్ధిని అంచనా వేసింది. కాగా రేటింగ్ ఏజెన్సీ విద్యుత్ డిమాండ్‌లో 2.5-3.5 శాతం ఆన్ ఇయర్ వృద్ధిని అంచనా వేసింది. మొత్తం వినియోగం 1,745-1,755 బిలియన్ యూనిట్ల మధ్య ఉంటుందని అంచనా వేసింది.

VMRDA VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

"e"-Procurement Tender Notice

The VMRDA Visakhapatnam invites RFP Bids on "e" Procurement Platform for following works

| Name of the Project | Tender Notice Nos | Last Date |
| --- | --- | --- |
| Development of the Land Parcel Located in Madhurawada Heights, Visakhapatnam on Area-Share Model through PPP Mode. | 34/2025-26/ CE/SE-I/EE-I/ VMRDA Dt: 08-08-2025 | 09-09-2025 03.00 PM |

For further details please logon to www.apeprocurement.gov.in METROPOLITAN COMMISSIONER, VMRDA

వార్త

చేయకుండానే చేశాననేవాడు అధముడు, కొద్దిగా చేసి కొండంత చేశానని చెప్పేవాడు గర్వపోతు. ఎంతో చేసి కొంచెమే చేశానని చెప్పేవాడు సజ్జనుడు.

-ఆది శంకరాచార్యులు

# బురద వరద!

వానొచ్చే.. వరదొచ్చే.. కాదు కాదు ఈసారి బురదను కూడా వెంటబెట్టుకొని వచ్చింది. ఏదో ఉత్తరాఖండ్‌లో పెద్దఎత్తున వరద బురదను కూడా తీసుకొచ్చింది. ఎన్నో ప్రాంతాలను ముంచెత్తింది. ఎన్నో జీవితాలను అతలాకుతలం చేసిందని పత్రికల నిండా వార్తలే. ఎన్నో ప్రత్యక్ష కథనాలూ చూశాం. కాగా ఇప్పుడు హైదరాబాద్‌లో కూడా కుండపోత వర్షాలకు బురద కొట్టుకొని వచ్చిందని కొన్ని ప్రాంతాల వార్తా కథనాలు. ఉత్తరాఖండ్‌లో బురద పొంగిపొర్లటానికి అక్కడ క్లౌడ్‌బరస్ట్ వల్లనే అలా జరిగిందని వాతావరణ శాస్త్రజ్ఞులు ముందే చెప్పారు. అలాగే జరిగింది. కాగా హైదరాబాద్‌లో కూడా ఆది,సోమవారాల్లో కురిసిన భారీ వర్ష తదనంతర పరిస్థితులను చూసి ఇక్కడా క్లౌడ్ బరస్ట్ జరిగిందని నగరవాసులు చర్చించుకుంటున్నారు. చిన్నపాటి వర్షానికే జంటనగరాల్లో మురికి కాల్వలు పొంగుతాయి. చెరువులన్నీ నిండుతాయి.లోతట్టు ప్రాంతాలూ మునుగుతాయి. భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ గురించి పలుసార్లు అనుకుంటాంగానీ హైదరాబాద్ అనగానే చెరువులే కదా? అందుచేత నీరు నిండిపొర్లుతున్నప్పుడు కొద్దిసేపు నీరు రోడ్ల మీద నిల్వ ఉండడం వాన ప్రక్రియే. జంట నగరాల్లో వరదనీరు సాఫీగా వెళ్లే మార్గాలు లేకనే రోడ్ల మీద 3,4 అడుగుల మేరకు నీరుతో నిండిపోతోంది. గొలుసుకట్టు చెరువులునూ నీటి ప్రవాహానికి ఆటంకం వలన కూడా రోడ్ల మీద నీళ్లు ఎక్కువసేపు నిలిచిపోతున్నాయి. దీని కారణంగానే నాలాల్లోకి త్వరత్వరగా నీరు తీసుకోలేకపోవడమే భారీ వర్షాలనంతరం జనజీవనానికి అడ్డంకులు ఏర్పరుస్తోంది. వందేళ్లలో మూసీ ఆక్రమణలు ఇంతింత కాదు. అవి కూడా వరద కాల్వల్లో ఏటా పూడిక తీయలేకపోవడమూ భాగ్యనగరానికి ముప్పే! వరద నీరు ఇంకే ఇంకుడు గుంతలే ప్రతి ఇంటికి శ్రీరామరక్ష. అయినా ఈసారి వచ్చిన వర్షాలు ఆగమాగం చేస్తున్నాయి. వారం పదిహేను రోజులుగా దేశమంతటా ఇదే పరిస్థితి. వరుణుడు విరుచుకుపడ్డాడనే అనుకుంటున్నాం. కానీ ఇప్పటి వానలు కర్షకుడికి హర్షం తెప్పించేవే. నిన్న మొన్నటి వర్షాలకు నగరం చిగురుటాకులా వణికిపోయింది. జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. అపార్టుమెంట్ల సెల్లార్లన్నీ చెరువుల్ని తలపిస్తున్నాయి. నాలాలు నోర్లు తెరుచుకున్నాయి. డ్రెయినేజీల మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. కార్లు, స్కూటర్ల వంటి వాహనాలు వరద నీటిలో మునిగాయి. కొట్టుకుపోయి అల్లంత దూరానికి వెళ్లిపోయాయి. ఇవన్నీ వానొచ్చినప్పుడల్లా ప్రత్యక్షమయ్యే దృశ్యాలు.గోదావరి పొంగినప్పుడు మాత్రమే వరద, బురద దృశ్యాలు తలపిస్తాయి.అప్పుడు కూడా వరద ముందొచ్చి బురద తర్వాత చేరుతుంది. నీరు ఇంకిపోయినప్పుడు మాత్రమే బురదపైకి పేరుకుపోయి కాళ్లకు అడ్డం పడుతుంది. కానీ మొన్న ఉత్తరాఖండ్‌లో ధరాలీ గ్రామం ఉత్తరకాశీలో కురిసిన కుండపోత వానలు,కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో చిక్కుకున్న వారిని స్నైపర్ శునకాలు, డ్రోన్లు వెంట వెంటనే రంగంలోకి దిగి దాదాపు 650 మందిని చావుకు దూరంగా తీసుకొచ్చాయి. ఆగ్రామం సగానికి సగంబురదలో కూరుకుపోయింది.అడుగు తీసి అడుగువేయగల సత్తాలేని పరిస్థితి ఏర్పడింది. మానవాళి ఇలాంటి ప్రత్యేక పరిస్థితులు చవిచూసిన సందర్భాలన్నీ చేదు అనుభవాలే. ఇవి తర్వాతి తరానికి మార్గదర్శకాలు కావాలి. ఇలాంటి సూచనలు పాటిస్తే ప్రకృతి విలయాల్లో ప్రమాదాలొచ్చినప్పుడు చాకచక్యంగా బయటపడొచ్చు. ధరాలీ గ్రామంలో పలు ప్రాంతాల్లో భారీగా 7,8 అడుగుల మేర బురద, రాళ్లు పేరుకుపోయాయి. వరదొచ్చి వారం రోజులైనా తేరుకోలేదు. ఇవన్నీ ఇలా ఉంటే మరో 3,4రోజులు భారీ వర్షాలను తట్టుకోవాల్సి ఉంటుందని స్థానిక వాతావరణ శాఖ హెచ్చరించింది. తాజాగా పశ్చిమ మధ్య బంగాళాఖాతం, సమీప ప్రాంతంలో ఈనెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు ఉండనే ఉన్నాయి. ప్రస్తుతం తూర్పు ఆగ్నేయదిశలో ఈశాన్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది.మరోవైపు దక్షిణ ఆంధ్రకోస్తా తీరం వద్ద సగటు సముద్ర మట్టం నుంచి 3 కి.మీలోపు మధ్య భాగాన ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈనేపథ్యంలో వాతావరణంలో ఏర్పడిన మార్పులు, మరికొద్ది రోజులు జనజీవనాన్ని భయభ్రాంతులు చేస్తాయి.మరో ఐదురోజులు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశంఉందని వాతావరణ కేంద్రాలు హెచ్చరిస్తున్నాయి. ఉరుములు, మెరుపులు, పిడుగులు,ఈదురు గాలులు ఇవన్నీసామాన్య ప్రజానీకా నికి అవరోధాలుకల్పించేవే. గతంకన్నా ఇప్పుడు తేడాగా భారీ వర్షసూచనలకు కొనసాగింపుగా అత్యవసరం అయితేనే బయటకు రావాలని మధ్యాహ్నం మూడుగంటల్లోగా ఇళ్లకుచేరుకోవాలని హెచ్చరికలు చేస్తున్నారు. ఇదంతా వర్ష తీవ్రతను తెలుపుతున్నాయి. వానలు, వరదలు, సునామీలు, తుఫానులు, వాయుగుండాలు, భూప్రకంపనలు, వంటి అన్నిరకాల ప్రకృతి బీభత్సాలను చవిచూసిన జనానికి కొత్తగా వరద వెంట తెచ్చిన బురదల గురించి తెలుసుకోవాల్సి వచ్చింది. ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో వర్షాభావం ఉన్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు వార్తలందాయి. సాధారణంగా ఈ యేడాది నైరుతి రుతుపవనాలు మాటతప్పి ముందస్తుగానే వచ్చేశాయి. అయినా ఎండలు మండే సమయంలో వర్షాలు, వర్షాలు కురిసే సమయంలో రైతుకుపనిలేకుండా పోయింది. ముఖ్యంగా రాయలసీమలోనూ, ఉత్తరాంధ్ర వర్షాభావం ఉంది. రుతుపవనాల సీజన్‌లో విశాఖపట్నం జిల్లాలో 38.9 శాతమే వర్షం కురిసింది. ఆ ప్రాంత రైతుకు మాత్రమూ సరిపోదు.



కొంత మందిని అదృష్టం వరిస్తుంది. చిత్రమేమిటంటే వారెప్పుడూ అదృష్టంపై ఆధారపడే వారు కాదు.


ఫ్రాంక్లిన్



సాధన లేకుండా విజయాన్ని ఆశించడం ఎడారిలో మంచినీళ్ల కోసం వెతకడం వంటిది.

విశ్వేశ్వరయ్య

# ప్రజావాక్కు



## మాతృభాషలో విద్యకు ప్రాధాన్యం

భారత విద్యావ్యవస్థలో రోటు లెర్నింగ్ పద్ధతి ఇంకా ప్రబలంగా ఉంది. విద్యార్థులు పాఠ్యాంశాలను కంఠస్థం చేయడంలోనే పరిమితం అవ్వడంతో,వారి ఆలోచనాశక్తి, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు పరిమితమవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు సృజనాత్మకత, లేటరల్ థింకింగ్, సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి అత్యవసరం. విద్య పరీక్షల మార్కులకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థులమేధోవికాసానికి దోహదపడేలాఉండాలి. ప్రపంచంలోని ఉత్తమ విద్యావిధానాలు వ్యక్తిత్వ వికాసం, స్వతంత్ర ఆలోచన, సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇస్తున్నాయి.భారతవిద్యలో కూడా ఇలాంటి మార్పులు అవసరం. పాఠ్యాంశాల్లో సృజనాత్మక ప్రాజెక్టులు, ఆవిష్కరణాత్మక పనులు, సమస్యల పరిష్కారంపై ఆధారపడి ఉన్న కార్యకలాపాలు ఉండాలి. పుస్తకాలతో పాటు ప్రాక్టికల్ అనుభవం ఇవ్వడం ద్వారా నేర్చుకున్న విషయాలను జీవితంలో అన్వయించగలిగే సామర్థ్యం పెరుగుతుంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రమాదం అంచుల్లో దేశ సంస్కృతి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కంపు అన్నిదేశాలకు వెదజల్లుతూ ఉన్నది.అదానీని కాపాడ్డానికి మోడీజీమనల్ని మాయ చేస్తున్నారని ఒక దుష్ప్రచారం జరుగుతూ ఉన్నది. ప్రపంచంలో తెలివైన ప్రజలు అమెరికాలో స్వేచ్ఛ విహంగంలో కొత్త ప్రపంచంలో జీవిస్తూ ఉన్నారు. అన్ని దేశాల ప్రజలను శాసిస్తూఉన్నారు.అందులో అనుమానం ఏమీలేదు. సమానత్వం స్వేచ్ఛ ఒక ఒరలో ఇమిడేవి కావు. సమానత్వం సాధించడానికి స్వేచ్ఛను అడ్డుకోవాలి.అది కొంత వరకు అవసరమే కానీ మితిమీరిన స్వేచ్ఛ ప్రమాదం. ఆప్రమాదం అంచుల్లోసంస్కృతి సంప్రదాయాలున్నాయి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## కుంటలను తవ్వించాలి

వర్షాలు పడుతున్నాయి. ఈసంవత్సరం 25శాతం తక్కువ వర్షపాతం ఇప్పటి దాకా నమోదు అయిన నేపథ్యంలో ఇప్పుడు మగ పుగాలో అల్పపీడనం వల్ల వర్షపాతం పెరుగుతుంది అని వార్తలు వస్తున్న నేపథ్యంలో నీటిని ఒడిసి పట్టే చర్యలు చేపట్టాలి. 11వ శతాబ్దంలోనే 75వేల చెరువులు తవ్విన కాకతీయుల వారసత్వాన్ని ఇప్పటికైనా కొనసాగించాలి.

- భారత అవినాష్, జనగామ

## దుర్మార్గపు ఆలోచనలు మానాలి

పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మనీర్ అమెరికా నుంచి భారత్ పై అణుబాంబులేసి నాశనంచేస్తామని ప్రగల్భాలు పలకడం ట్రంప్‌ను సంతోష పరచడానికా లేక భారత్‌ను భయ పెట్టడానికా? భారత్‌ను మెరిసే మెర్సిడెస్ గా పొగుడుతూ ఫెరారిలా అమిత వేగంగా పరిగెత్తేకారులా భావిస్తూ పాక్‌ను రాళ్లు రప్పలతో నిండిన చెత్తను మోసే భారీ ట్రక్కుగా పేర్కొంటూ దీనితో ఆ కారుని గుద్దితే తుక్కు తుక్కు అవుతుందని ఓ ఛండాలపు ఉదాహరణతో పోల్చడం ఆయన తన మనోగతాన్ని వెళ్లగక్కాడు. పాక్ ట్రక్కు ఎప్పటికి ఫెరారీ కారు వేగాన్ని అందుకోలేదు. పెహల్గామ్ క్రూర దాడిలా రాంగ్ రూట్‌లో వచ్చి ఫెరారీని ఢీకొట్టాలి. అదే జరిగితే ఆపరేషన్ సిందూర్‌కు పదింతలపైన అనుభవించక తప్పదు. ఈ ప్రేలాపలన్నీ ట్రంప్ అండదండలతో వాగినవని అందరికి తెలుసు. మేం మునిగితే సగం ప్రపంచాన్ని మాతో తీసుకెళ్తాం అన్న దుర్మార్గపు ఆలోచనను అన్ని దేశాలు తీవ్రంగా ఖండించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఆంగ్ల భాషతో ఉపయోగం

ప్రభుత్వ కార్యాలయాల్లో బ్యాంకుల్లో ఏ చిన్న అప్లికేషన్ పూర్తి చేయాలన్నాకాస్తోకూస్తో ఆంగ్లభాషతో పరిచయం ఉండి తీరాలి. లేకుంటే అప్లికేషన్‌లో ఉన్న వివరాలు అర్థంకాక తికమక పడటం పక్కన ఉన్నవారి సహాయం అర్థించడం జరుగుతుంది. అయితే ఒక్కబ్యాంకులు,ఆఫీసుల్లోనేకాదు ప్రతిచోటా ఆంగ్లభాష ఉపయోగంలో ఉంది. ఈ భాష ప్రపంచమంతా వ్యాపించి ఉంది.అన్ని దేశాల ప్రజలు ఆంగ్లభాషను మాట్లాడతారు. ఆంగ్ల భాషను కొందరు చులకన చేస్తున్నారు. పరాయి భాష, విదేశీ భాష అని తీసి పారేస్తున్నారు. ఇది చాలా తప్పు. ఆంగ్ల భాషా పరిజ్ఞానం ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచిది. ప్రాంతీయ భాషలు ఆయా రాష్ట్రాలకే పరిమితమై ఉంటాయి.

- మిథునం, హైదరాబాద్

## గురుకులాలకు ప్రభుత్వ సెలవులు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంలోనిఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ గురుకులాలకు ప్రభుత్వ సెలవులను తప్పనిసరిగా వర్తింపజేయాలి. టీచర్స్, లెక్చరర్స్ నైట్ స్టడీ ,హాలిడే డ్యూటీలు చేయడం వలన నిత్యం గురుకులాలలో సొంత పనులు చేయలేకపోతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన క్యాజువల్ సెలవులు, ఆప్షనల్ సెలవులు, ఆన్యువల్ సెలవులు తప్పకుండా వినియోగించుకునే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'బ్రిక్స్'తో బహుళ ధృవ ప్రపంచం సాధ్యమా?

**ముడి చమురును ఇతర దేశాలకు సరఫరా చేయడంలో రష్యా ప్రధాన పాత్ర వహిస్తున్నది. సోవియట్ యూని యన్ మనుగడలో ఉన్నప్పుడు,అమెరికా వైపు కొన్నిదేశాలు, సోవియట్ వైపు మరికొన్ని దేశాలు మద్దతుగా నిలబడేవి. అప్పట్లో ద్విధృవ ప్రపంచం అస్థిత్వంలో ఉండేది. ఇరు అగ్రరాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం(కోల్డ్‌వార్) కొనసాగేది. సోవియట్ యూనియన్ పతనం తర్వాత అమెరికా సారథ్యంలో ఏకధృవ ప్రపంచం (యూనీ పోలార్ వరల్డ్) ఏర్పడింది. రష్యా ఎప్పుడూ భారత్‌కు అండగా ఉంటూ నిజమైన స్నేహానికి దర్పణంగా నిలిచింది. చైనా, భారత్‌లు చాలాకాలం మిత్రదేశాలుగా చెలామణి కాబడ్డాయి. అయితే 1962లో జరిగిన భారత్, చైనా యుద్ధం కారణంగా ఇరు దేశాలు కత్తులు దూసుకుంటున్నాయి. ఇప్పటికైనా చైనా వైఖరి మారి, భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలపై అనవసర వివాదానికి స్వస్తిచెబితే ఇండో, చైనాలు ప్రపంచంలో బలమైన దేశాలుగా ఏర్పడి అమెరికా ఆధిపత్యానికి చరమగీతం పలకవచ్చు. అయితే ఇది సాధ్యమా? చైనా ఇందుకు సహకరిస్తుందా? రష్యా చొరవ తీసుకుని భారత్, చైనాల మధ్య సయోధ్య కుదుర్చుతుందా? వేచి చూడాలి.**



సుంకవల్లి సత్తిరాజు

అమెరికా ఫస్ట్,మేక్ అమెరికా గ్రేట్ అండ్ గ్లోరియస్ అగైన్ అంటూ అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ప్రచారం చేసిన ట్రంప్ అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత, అందుకోసం విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇందుకోసం ట్రంప్ ఎంచుకున్న మార్గం అనైతికంగా, అనుచితంగా ఉంది. ఇతర దేశాలను వాణిజ్య సుంకాల పేరుతో భయపెట్టి, లాభపడాలనుకోవడం హర్షించదగ్గ పరిణామం కాదు. ఇటీవలి కాలంలో ట్రంప్‌లో కాఠిన్యం పెరిగిపోతున్నది. తన విజయానికి బాటలు వేసిన ఎలాన్ మస్క్‌ను సాగనంపడం, భారత్ వంటి మిత్ర దేశాలను దూరం చేసుకోవడం, పాక్‌కు మద్దతుగా మాట్లాడడం ట్రంప్ దిగజారుడుతనాన్ని ప్రస్ఫుటం చేస్తున్నది. ఇప్పటికే పలు దేశాలు అమెరికా ధోరణి నచ్చక ఎదురు తిరుగుతున్నాయి. ప్రపంచ వాణిజ్య నిబంధనలకు వ్యతిరేకంగా భారత్ పై అమెరికా వాణిజ్య పరమైన యుద్ధానికి దిగడం తగని పని. ఈ కారణంగానే బ్రిక్స్‌దేశాలు అమెరికా అహంభావంపై సమరనాదం మోగించడానికి సిద్ధమోతున్న సూచనలు గోచరిస్తున్నాయి. అమెరికా ఆధిపత్యానికి బ్రిక్స్‌దేశాలు చెల్లు చీటీ ఇవ్వనున్నాయా? అనే మాటకు అవుననే సమాధానం వస్తుంది. ట్రంప్ మొండితనం, భారత్ పట్ల అర్థంలేని అసూయ చివరికి ప్రపంచంలో అమెరికా స్థానాన్ని అధఃపాతాళానికి దిగజార్చే విధంగా ఉంది. బ్రిక్స్ దేశాలు అమెరికా వాణిజ్య సుంకాలపై, ట్రంప్ దుందుడుకు ధోరణిపై ద్వంద్వ ప్రమాణాలపై ఐక్యంగా పోరాడే అవకాశాలున్నాయి. త్వరలో భారత ప్రధాని మోడీ చైనా పర్యటనకు వెళ్లనున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్ సందర్శనకు రానున్నారు. ఇప్పటికే బ్రెజిల్‌తో భారత్ ద్వైపాక్షిక,వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకున్నది. అమెరికా డాలర్ ప్రపంచాన్ని శాసిస్తున్న వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయంగా నూతన కరెన్సీ రూపొందించుకోవాలని గతంలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్ సూచించారు. అయితే బ్రిక్స్ దేశాల పట్ల ట్రంప్ అక్కసు వెళ్లగక్కుతూ ప్రతీకార సుంకాలు విధిస్తానని గతంలోనే ప్రకటించారు. ఇప్పుడు భారత్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికి ప్రతీకార సుంకాలను విధించడం అర్థరహితం. ట్రంప్ చర్యల వలన భారత్ కొంతవరకు వాణిజ్య పరంగా, ఆర్థిక పరంగా దెబ్బతినే అవకాశాలు లేకపోలేదు. అమెరికా టారిఫ్‌ల వలన భారత్‌లో ఫార్మా, ఆక్వా, ఎలక్ట్రానిక్ రంగంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముంది. భారతదేశం అమెరికాకు సుమారు 90బిలియన్ డాలర్ల వస్తువులను ఎగుమతి చేస్తున్నది. అల్యూమినియం, ఆభరణాలు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులు, బాసుమతి బియ్యం, దుస్తులు మొదలైనవి వీటిలో ఉన్నాయి. అమెరికాకు భారత్ సుమారు 8 లక్షల కోట్ల వస్తూత్పత్తులు,సేవలను అందిస్తున్నది. యూరో



పియన్ దేశాలతో పాటు యు.కె, పాకిస్థాన్ వంటి దేశాలకు అమెరికా తక్కువ సుంకాలతో వస్తువులను అందిస్తున్నది. అమెరికా దేశానికి పెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌పై ట్రంప్ నిర్ధాక్షిణ్యంగా సుంకాలు విధించడం అసమంజసం. అయితే ట్రంప్ దుందుడుకుచర్యలతో అమెరికా కూడా తీవ్రంగా నష్టపోయే అవకాశాలున్నాయి. అమెరికా ఆర్థికవ్యవస్థలో భారత్ కీలక పాత్ర వహిస్తున్నది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి ముందు అతి తక్కువ శాతం ముడి చమురును రష్యానుండి భారత్ దిగుమతి చేసేది. అయితే రష్యా,ఉక్రెయిన్ యుద్ధం వలన ప్రపంచంలో చమురు కొరత ఏర్పడింది. ఆర్థిక మాంద్యం తాండవించింది. ఈ పరిణామాలను గమనించిన భారత్,రష్యా నుండి భారీగా ముడిచమురు దిగుమతి చేసుకుని,శుద్ధిచేసి పశ్చిమ దేశాలకు విక్రయిస్తున్నది. చైనా,టర్కీ దేశాలు కూడా రష్యా నుండి చమురు దిగుమతులు చేసుకుంటున్నాయి. ఏ దేశంపైన విధించని టారిఫ్‌లనుఅమెరికా భారత్‌పై విధించడం క్షంతవ్యం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ తన ఆర్థిక, వాణిజ్య వ్యూహాలకు పదును పెట్టాలి. చైనా, రష్యాలతో వ్యూహాత్మక రక్షణ, వాణిజ్య,ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచుకోవాలి. భారత్,రష్యా,చైనాలు ఏకమైతే బహుళ ధృవ ప్రపంచాన్ని ఆవిష్కరించవచ్చు. గాల్వాన్ సంఘటన జరిగిన సుదీర్ఘ విరామం తర్వాత మోడీ చైనాలో పర్యటించడం షాంఘై కో ఆపరేషన్‌సదస్సు సందర్భంగా జిన్‌పింగ్, మోడీ, పుతిన్‌ల మధ్య వాణిజ్య పరమైన సంభాషణలు జరగబోవడం హర్షదాయకం. రష్యా ఇండియా, చైనాలు కలిసికట్టుగా ఉంటే అమెరికా సారథ్యంలోని ఏక ధృవ ప్రపంచం అంతమై మల్టీ పోలార్ ఆర్డర్‌కు దారితీయవచ్చు. బ్రిక్స్ కూటమి బలపడవచ్చు. వైజ్ఞానిక, వాణిజ్య, సాంస్కృతిక, రాజకీయ సంబంధాలను మెరుగుపరచుకుని, తమ తమ ఆర్థిక వ్యవస్థలను పటిష్టం చేసుకోవడానికి, శాంతి సుస్థిరతలకు నెలకొల్పుకోవడానికి, బహుళ ధృవప్రపంచ నిర్మాణానికి బ్రిక్స్‌దేశాలు పనిచేయాలి.బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా దేశాలతో ఏర్పడిన బ్రిక్ సౌత్ ఆఫ్రికా రాకతో బ్రిక్స్‌గా మారింది. ఈజిప్టు, ఇతియోపియా, ఇరాన్, ఇండోనేషియా, సౌదీ అరేబియా, యు.ఏ.ఇ లతో కలిసి ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో 11 దేశాలున్నాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైనప్పటికీ, ఇప్పటికీ రష్యా అగ్రదేశంగా కొనసాగుతున్నది. ఆయుధ పరంగాను, సాంకేతిక పరంగాను, ఇతర రంగాలలోను రష్యా శక్తిసంపన్నమైన దేశం. ముడి చమురును ఇతర దేశాలకు సరఫరా చేయడంలో రష్యా ప్రధాన పాత్ర వహిస్తున్నది. సోవియట్ యూనియన్ మనుగడలో ఉన్నప్పుడు,అమెరికా వైపు కొన్నిదేశాలు, సోవియట్ వైపు మరికొన్ని దేశాలు మద్దతుగా నిలబడేవి. అప్పట్లో ద్విధృవ ప్రపంచం అస్థిత్వంలో ఉండేది. ఇరు అగ్రరాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం(కోల్డ్‌వార్) కొనసాగేది. సోవియట్ యూనియన్ పతనం తర్వాత అమెరికా సారథ్యంలో ఏకధృవ ప్రపంచం (యూనీ పోలార్ వరల్డ్) ఏర్పడింది. రష్యా ఎప్పుడూ భారత్‌కు అండగా ఉంటూ నిజమైన స్నేహానికి దర్పణంగా నిలిచింది. చైనా, భారత్‌లు చాలాకాలం మిత్రదేశాలుగా చెలామణి కాబడ్డాయి. అయితే 1962లో జరిగిన భారత్, చైనా యుద్ధం కారణంగా ఇరు దేశాలు కత్తులు దూసుకుంటున్నాయి. ఇప్పటికైనా చైనా వైఖరి మారి, భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలపై అనవసర వివాదానికి స్వస్తిచెబితే ఇండో, చైనాలు ప్రపంచంలో బలమైన దేశాలుగా ఏర్పడి అమెరికా ఆధిపత్యానికి చరమగీతం పలకవచ్చు. అయితే ఇది సాధ్యమా? చైనా ఇందుకు సహకరిస్తుందా? రష్యా చొరవ తీసుకుని భారత్, చైనాల మధ్య సయోధ్య కుదుర్చుతుందా? వేచి చూడాలి. ●

# వేతన జీవుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం!

తరిగోపుల నారాయణస్వామి

ఆంధ్రప్రదేశ్‌లో వేతన జీవుల పరిస్థితి ఏ ప్రభుత్వంలోనూ పెద్దగా మారలేదు. గత ప్రభుత్వ కాలంలోనూ, తాజాగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలోనూ ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు యథాతథంగానే కొనసాగుతున్నాయి. ముఖ్యంగా వేతన సవరణ, కరువు భత్యం విషయాల్లో ప్రభుత్వ వైఖరి నిరాశ కలిగిస్తోంది. గత ప్రభుత్వం అమలు చేసిన వేతన సవరణ పద్ధతి ఉద్యోగులకు ఎలాంటి ఆర్థిక లాభం ఇవ్వలేకపోయింది. వాస్తవానికి, ధరల పెరుగుదలతో పోలిస్తే వేతనాలు పెరగాల్సిన చోట, పెరుగుదల గణనీయంగా తక్కువగా ఉండటంతో ఉద్యోగుల కొనుగోలు శక్తి తగ్గిపోయింది. ఈ పరిస్థితి వేతన జీవుల దైనందిన జీవితంలో మరింత ఆర్థిక ఒత్తిడిని తెచ్చింది. కేంద్ర ప్రభుత్వం, ద్రవ్యోల్బణ సూచిక ఆధారంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి కరువు భత్యం పెంచి, ఉద్యోగులకు అందిస్తోంది. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చట్టబద్ధంగా ఇవ్వాల్సిన కరువు భత్యాన్ని తరచూ వాయిదా వేస్తూ వస్తోంది. ఫలితంగా ఉద్యోగుల వేతనాలు ధరల పెరుగుదలకు అనుగుణంగా పెరగడం లేదు. వేతనాలు స్థిరంగా ఉండగా, కూరగాయల నుండి ఇంధన ధరల వరకు అన్నీ పెరుగుతుండటంతో, ఆర్థిక కష్టాలు తీవ్రతరమవుతున్నాయి. సంక్షేమ పథకాల పేరిట నిధుల మళ్లింపు, ప్రభుత్వాలు ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతన బకాయిలు,కరువు భత్యం వంటి చెల్లింపులను వాయిదా వేస్తూ, ఆ సొమ్మును సంక్షేమ పథకాల పేరిట వేరే




అవసరాల కు వినియోగిస్తున్నాయి. ఆదాయపు పన్నులు, వివిధ వనరుల నుండి వచ్చే రాష్ట్ర ఆదాయం,అలాగే రిజర్వ్ బ్యాంకునుండి అప్పులు తీసుకుని, ఉచిత పథకాల రూపంలో ప్రజలకు సబ్సిడీలు అందించడం రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నా,వేతనజీవుల హక్కుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఉద్యోగుల ఆవేదన, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పుడు ద్వంద్వ సమస్యలను ఎదుర్కొంటున్నారు. చెల్లించని కరువు భత్యం, తగిన లాభంఇవ్వని వేతన సవరణ ఇవి రెండూ కలిసి వారి వాస్తవ వేతనాన్ని తగ్గిస్తున్నాయి. పెరుగుతున్నద్రవ్యోల్బణం, గృహరుణాలు, విద్యఖర్చులు, వైద్య వ్యయాలన్నీ కలిపి వేతన జీవుల జీవన ప్రమాణాన్ని దెబ్బతీస్తున్నాయి. పరిష్కారంకోసం అవసరమైన చర్యలు చెల్లించని బకాయిలను వెంటనే విడుదల చేయాలి. భవిష్యత్తులో ఈ చెల్లింపులను కేంద్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా సమయానికి ఇవ్వాలి. వేతన సవరణలను వాస్తవ ద్రవ్యోల్బణానికి అనుగుణంగా, ఉద్యోగుల కొనుగోలు శక్తినికాపాడేలా రూపకల్పన చేయాలి. ఉద్యోగుల హక్కులను సంక్షేమ పథకాల నిధుల మళ్లింపుకు బలిచేయరాదు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే, ఆర్థిక పరిపాలన సుస్థిరంగా ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్ర పరిపాలనకు వెన్నెముక. వారిని ఆర్థికంగా బలహీనులను చేస్తూ, సంక్షేమం పేరుతో రాజకీయ ప్రాధాన్యత కలిగిన పథకాలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వడం సమాజానికి దీర్ఘకాలంలో నష్టం కలిగిస్తుంది. ఉద్యోగుల హక్కులను గౌరవించి, చెల్లించాల్సిన వేతనాలు,కరువుభత్యం సమయానికి చెల్లించడం ప్రభుత్వం ప్రాథమిక బాధ్యత కావాలి. ●

# మానవాభివృద్ధిలో ముందుకు వెళ్తున్నామా?

పూసాల సత్యనారాయణ

ఇండియాకు పోతున్నారా ! జాగ్రత్త సుమీ ! అక్కడ హత్యలు ,మానభంగాలు, దోపిడీలు ,రేప్‌లు రెచ్చిపోతున్నాయి అని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ హెచ్చరిక. నాలుగు వేదాలు పుట్టిన భూమిలో రాముడు జన్మించిన పవిత్ర స్థలంలో బుద్ధుడి మూలాలు ఉన్న భారత్ లో ఘోరాలు నేరాలా ! దేశ ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో ఇంతకు దిగజారిందా? సుంకాల వజ్రాయుధం ఉన్నదని అందరిమీద ఎగబడతారా! అది ఎప్పుడో ఒకప్పుడు గోడకు కొట్టిన బంతిలా వచ్చి కంపు చేసి మట్టి కరిపిస్తుంది. మా అంతరంగిక వ్యవహారంలో తలదూర్చేరు తస్మాత్ జాగ్రత్త! అని మన దేశ రథసారథి ప్రధాని మోడీ అమెరికాకు తన వాయిస్ ను దిక్కులు పిక్కటిల్లేలా వినిపించాల్సి ఉందే.ఇంతకు మన దేశం ఎటు వైపుపోతుంది ? ఏమి జరుగుతుంది? ఒక్కసారి దేశ పరిపాలన మైక్రోస్కోప్‌తో చూస్తే ఉన్నది ఉన్నట్లుగా దృశ్య మాలిక వీక్షించవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఐదు వసంతాలు గడిచినా దేశం అభివృద్ధి చెందుతూనే ఉందా ! ప్రధానమంత్రి మోడీ ప్రధానమంత్రి పదవి చేబట్టి పది సంవత్సరాలు దాటనున్నాయి. హిందూ భావజాలం నుండి వచ్చిన ప్రధాని మోడీ పరిపాలన మతంతో ముడిపడి ఉన్నందున అనేక విమర్శలను ఎదుర్కొంటున్నారు. లోకం చుట్టిన వీరుడుగా సమర్థమంతమైన నాయకుడిగా మహోన్నతమైన బిరుదులతో సన్మానాలు సత్కారాలు అందుకుంటున్నారు.అసలు ప్రధాన మంత్రి అంటే ఇలా ఉండాలి అనేలా ఉన్నారు. అసలు విషయానికి వస్తే స్వంత దేశంలో అనేకమైన బర్నింగ్ సమస్యలు పరిష్కారం చేయకుండా దేశాలు తిరిగి ఉపన్యాసలిస్తే దేశం అన్ని కోణాలలో అభివృద్ధి చెందినట్టేనా! 'ఇంట గెలిచి రచ్చ గెలవాలి' ముందు తనదేశాన్ని చక్కబెట్టుకోవాలి. మానవాభివృద్ధి సూచికలో 193 దేశాలలో భారతదేశం 130 స్థానంలో ఉంది. జిడిపి 2024-2025 ఆర్థిక సంవత్సరానికి 6.5 గత సంవత్సరాల కంటే అధికంగా ఉన్న అభివృద్ధి చెందిన దేశాలకంటే వెనుకబడి ఉందని చెప్పవచ్చు. మన దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నంగా ఉంది. తలసరి ఆదాయం, పారిశ్రామికీకరణ. అభివృద్ధి అంకెలు అందుకోలేదు. పేదరికం చుట్టుముట్టి ఆకలి కేకలతో అసువులు బాస్తున్నారు.గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. కాలుష్యం కోరలు విప్పి బుసలు కొడుతూ కాటేస్తూ ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో శ్వాస తీసుకునే పరిస్థితి లేదు. పరిశోధన కేంద్రాలకు ప్రాముఖ్యత లేదు. కొత్త కొత్త ఆవిష్కరణలు అంతకన్నా లేవు. సాంకేతికంగా మెరుగ్గా ఉన్నా ఇంకా అభివృద్ధిచెందాల్సిన అవసరం ఉంది. ముక్కోటి దేవతలున్న దేశాల కంటే లక్ష్మీ,సరస్వతి, ఊసే లేని నాస్తిక దేశాలు అభివృద్ధి చెంది ఉన్నాయి.'అందుకే అన్నారు అన్నీ తెలిసినవాడు అమావాస్య రోజు చస్తే ఏమి తెలియనివాడు ఏకాదశిరోజు చచ్చినట్లు'గా ఉంది మన పవిత్ర దేవుళ్ల దేశం. కెనడా, నార్వే ఆస్ట్రేలియా, బెల్జియం,జపాన్, డెన్మార్క్ దేశాలలో ప్రార్థనా మందిరాలు లేవు. పూజలు,యజ్ఞయాగాదులు కుంభమేళాలు ఉంటే ఒట్టు మానవతావాదం, హేతువాద భావజాలంతోపాటు పరిశోధనలు కొంగ్రొత్త ఆవిష్కరణలు విరాజిల్లుతున్నాయి. స్థూలదేశీయ ఉత్పత్తి,తలసరి ఆదాయం, పారిశ్రామికీకరణ, భవిష్యత్ అభివృద్ధి, ప్రజల జీవనకాలం, విద్యాస్థాయి మానవ వనరుల అభివృద్ధి



విద్యుత్ రవాణా సౌకర్యాలు 'మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లుతున్నాయి' మోదీ నాయకత్వం వహించే మనదేశం అభివృద్ధి అంకెల అందాలను అందుకోవాలి. మన ప్రజాప్రతినిధులు ఎలా ఉన్నారంటే, 'గొర్రెల మందకు తోడేలును కాపల పెట్టిన' రీతిలో ఉన్నారు. ఆర్థిక క్రమశిక్షణ లేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత సంక్షేమ పథకాలతో ఆదాయానికి మించిన ఖర్చులు పెట్టి అప్పుల పాలవుతున్నాయి. నిత్యావసరాల ధరలు పెరగడానికి కారణం అవుతున్నారు ప్రభుత్వ ఆర్థిక నిపుణులు, ప్రభుత్వ సలహాదారులు, యంత్రాంగం అంతా ఏమిచేస్తున్నట్లు? రాజకీయ నాయకులు అధికారం కొరకు అర్రులు చాచి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజలకు సమాధానం చెప్పలేక పాలకులు మొఖం చాటేస్తున్నారు.ఉచిత పథకాలు 'సోమరిని సోకు' చేస్తున్నాయి. దేవాలయాలలో తిష్టవేసిన దేవుళ్ళ వద్ద గుట్టలుగా పడి ఉన్న సంపద గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలకు కేటాయించి వారి మన్ననలను పొందవచ్చు కదా! కాషాయ వస్త్రదారుల ధనమంతా విద్య కొరకు పరిశోధనా సంస్థలకు ఖర్చు పెట్టీ స్మార్ట్ విధానాలు కనిపెట్టి చైనాతో పోటీపడి మీసం మేలయవచ్చు కదా ! నిరుద్యోగులకు నైపుణ్యాలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించి చైనా మేడ్ వస్తువులను నిషేధించి ఇండియా మేడ్‌నే గర్వంగా ఎందుకు వాడరాదు. ఎగుమతులు పెంచి దిగుమతులు తగ్గించి ఆదాయం పెంచే నిపుణత మనకేమి తక్కువ .కార్పొరేట్ దిగ్గజాలకు రుణమాఫీలు ఎందుకు? పన్ను ఎగవేతదారులకు కఠిన శిక్షలు ఎక్కడా ? దేశానికి కీలకమైన వ్యవసాయానికి పెద్దపీటవేస్తే రైతులకు అండగా నిలిస్తే ఆత్మహత్యలుండేనా? ఆదాయానికి మించి ఖర్చు పెట్టకుండా ఆర్థికమంత్రి బాధ్యత ఎందుకు వహించడం లేదు? ప్రభుత్వ ముఖ్యసలహాదారులు లోటు బడ్జెట్‌కు సలహాలు ఇవ్వడానికేనా? ఇలా ఉంటే దేశం ఎలా? కూడలిలో అంబేద్కర్ విగ్రహాలవద్ద లెక్చర్ దంచితే దేశం అభివృద్ధి దిశగా పయనించేనా! హేతుబద్ధత, శాస్త్రీయ దృక్పథం లేకుండా అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడడం అందని ద్రాక్ష పండ్లే! దేవతలుగా ఆరాధించబడే స్త్రీలు దేవుని దూతలైన పూజారుల, బాబాల,మఠాధిపతుల పాస్టర్ల బిగి కౌగిలిలో కర్పూరంలా కరిగిపోతున్నారే! ఇది ఎవరి తప్పు అంటే మహిళలదే అని చెప్పక తప్పదు. వారి గుడ్డి నమ్మకాలకు పరాకాష్ట. ఇంకెప్పుడు మారేది మహిళాలోకం! శాస్త్రీయ దృక్పథం లేని చదువులెందుకు? ప్రశ్నించే తత్వం లేని పనులెందుకు? ప్రభుత్వం మాత్రం ఏమి చేస్తుంది ? సమాజంలో మార్పు రావాలి మన జీవితాలకు మనమే బాధ్యులం. జైలులో జీవచ్ఛములా కాలం గడుపుతున్న బాబాలు పూజారుల అతీత శక్తులు ఏమైనావి? ఏ దేవుడు కూడా కాపాడలేడు. ఈ మాత్రం తెలియని చదువుకున్న మేధావులు ఎందుకు? ప్రతి పౌరుడు తనకు తానే ప్రశ్నించుకునే తత్వం అలవరచుకోవాలి. సమర్థమైన నీతినిజాయితీ గల నాయకుడికి ఓటు వేసి గెలిపించాలి. నోటుకు ఓటు అమ్ముడుపోయే మనుషులు ఆలోచించాలి. గారడి చేసే రాజకీయనాయకుల మాటలకు లొంగిపోయేరు సుమీ! నేటి రాజకీయ నాయకులు అధికార ఆధిపత్యం కొరకు మాట్లాడే భాష కొట్లాడే తీరుచూస్తే వీధిలో కుక్కల అరుపులు గుర్తుకు వస్తాయి. సొంత టీవీ చానల్స్, వార్త సంస్థలు పెట్టుకొని నిబంధనలు పాటించకుండా తన పార్టీ గొప్పదని మిగతా పార్టీల పై అభియోగాలు మోపడం ఆమోదయోగ్యం కాదు. ఉన్నతాధికారులు సమాచార చట్టం ఉల్లంఘించి అడిగిన వారికి సరైన సమాచారం ఇవ్వకుండా నిజాలను దాచడం చట్ట విరుద్ధం కాదా?యువత ఆలోచన విధానం మారాలి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది. మహిళా సాధికారత ఎక్కడుంది? లింగ వివక్ష చెలరేగుతోంది కులమతాల చిచ్చు రగులుతుంది. నీతి ,నిజాయితీ, ధర్మం, సత్యం అహింస, చెట్టాపట్టాలేసుకొని దిక్కులు తోచక చుక్కల దారి పట్టాయి. పాలకులు ప్రజాసంబంధాల పత్రికల వార్తలు ప్రజల నాడిగా భావించి కుల మతాల కతీతంగా సుపరిపాలన చెయ్యాలి. అప్పుడే ప్రజాస్వామ్య పాలన చిగురులు తొడుగుతుంది. దేశం అన్ని కోణాలలో అభివృద్ధి చెంది సకల జనులు సంపూర్ణ ఆరోగ్య జీవితం గడుపుతారు .ఆ దిశగా అందరం కలసి అడుగులు వేద్దాం. ●

# జస్టిస్ వర్మ అభిశంసన ప్రక్రియ మొదలు



**● తీర్మానంపై లోక్‌సభలో చర్చకు ఆమోదించిన స్పీకర్ ఓం బిర్లా ● ఆరోపణలపై విచారణకు త్రిసభ్య కమిటీ ● విచారణ ప్రక్రియ పారదర్శకంగా ఉందన్న 'సుప్రీం'**

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** భారత న్యాయవ్యవస్థ చరిత్రలో అత్యంత అరుదైన, రాజ్యాంగపరంగా కీలకమైన పరిణామం చోటుచేసుకుంది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన ప్రక్రియకు లోక్‌సభ మంగళవారం శ్రీకారం చుట్టింది. ఆయన అధికారిక నివాసంలో కాలిపోయిన స్థితిలో భారీగా నగదు కట్టలు లభ్యం కావడం ఈ పరిణామాలకు దారితీసింది. ఈ అభిశంసన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభలో అధికారికంగా చదివి వినిపించారు. ఈ ఏడాది మార్చిలో ఢిల్లీలోని జస్టిస్ వర్మ ప్రభుత్వ నివాసంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు కాలిపోయిన కరెన్సీ నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ ఘటనపై జరిగిన అంతర్గత న్యాయ విచారణలో, ఆ నగదుపై జస్టిస్ వర్మకు రహస్య లేదా క్రియాశీలక నియంత్రణ ఉందని తేలింది. ఈ నివేదిక ఆధారంగా, భారత ప్రధాన న్యాయమూర్తి ఆయనను పదవి నుంచి తొలగించాలని సిఫార్సు చేశారు.

దీనిని అనుసరించి, రవిశంకర్ ప్రసాద్‌తో పాటు లోక్‌సభ నుంచి 146 మంది, రాజ్యసభ నుంచి 63 మంది సభ్యులు సంతకాలు చేసిన అభిశంసన తీర్మాన నోటీసును జులై 31న స్పీకర్‌కు అందజేశారు. ఈ తీర్మానంలో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించి, దానిని చర్చకు స్వీకరిస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఈ తీర్మానంలో తగిన బలం ఉందని నేను భావిస్తున్నాను. అందుకే దీనిని స్వీకరించి, ఆరోపణలపై విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నానని ఆయన తెలిపారు. జడ్జిల విచారణ చట్టం 1968 ప్రకారం ఏర్పాటైన ఈ త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది వి.వి. ఆచార్య సభ్యులుగా ఉంటారని స్పీకర్ వెల్లడించారు.

ఈ కమిటీ నివేదిక ఇచ్చేంత వరకు తీర్మానం పెండింగ్‌లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు, అంతర్గత విచారణ నివేదికను సవాలు చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయన పిటిషన్‌ను గత వారం సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

విచారణ ప్రక్రియ పారదర్శకంగా, రాజ్యాంగ బద్ధంగా ఉందని పేర్కొంది. స్వతంత్ర భారత చరిత్రలో ఒక సిట్టింగ్ జడ్జిపై అభిశంసన ప్రక్రియ ప్రారంభం కావడం ఇది కేవలం మూడోసారి. ఒకవేళ విచారణ కమిటీ ఆరోపణలు నిజమేనని తేలిస్తే, ఈ తీర్మానం పార్లమెంటు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీతో సభలో హాజరై ఓటు వేసిన వారిలో మూడింట రెండొంతుల మంది, సభ మొత్తం సభ్యుల్లో మెజారిటీతో ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఆ తర్వాత తుది ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపుతారు.



## గాజాలో మారణహోమానికి పాల్పడుతున్న ఇజ్రాయెల్

### ప్రియాంక గాంధీ తీవ్ర ఆరోపణ

### హమాస్ ఉగ్రవాదులనే చంపామన్న ఇజ్రాయెల్ రాయబారి

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందని, ఇప్పటికే వేలాది మంది మరణానికి కారణమైందని కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ ఆరోపించారు. వీటిని భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఖండించారు. గాజాలోని వేలాది మంది హమాస్ ఉగ్రవాదులనే తాము చంపామని బదులిచ్చారు. గాజాలో నెలకొన్న పరిస్థితులపై స్పందించిన ప్రియాంక 'ఇజ్రాయెల్ మారణ హోమానికి పాల్పడుతోంది. 60 వేల మందిని హత్య చేసింది. వారిలో 18,430 మంది చిన్నారులే. పిల్లలు సహా అనేక మంది ఆకలితో చనిపోయారు' అని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా ప్రపంచం మౌనంగా ఉండటాన్ని ఖండించిన ఆమె ఇలా ఉండటం కూడా నేరమేనంటూ భారత ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ విమర్శలు గుప్పించారు. ప్రియాంక గాంధీ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ స్పందించారు. మీ వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయి. 25వేల మంది హమాస్ ఉగ్రవాదులను ఇజ్రాయెల్ చంపింది. సామాన్యుల వెనుక దాక్కొని హమాస్‌హేయమైన వ్యూహాలకు పాల్పడుతుండటం వల్ల ప్రాణనష్టం మరింత పెరుగుతోంది అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ 20 లక్షల టన్నుల ఆహార పదార్థాలను గాజాలోకి పంపించిందని, హమాస్ మాత్రం వారిని నిర్బంధిస్తోందని ఆరోపించారు. ఇదే అక్కడ ఆకలికి కారణమవుతోందన్నారు. గాజాలో మారణహోమం లేదని, గడిచిన 50 ఏళ్లలో అక్కడి జనాభా 450 శాతం పెరిగిందన్నారు.



### అల్జీమర్స్ సీక్రెట్స్ ఛేదించేందుకు పిల్లులపై అధ్యయనం!

**ఎడిన్‌బర్గ్, ఆగస్టు 12:** మనుషుల్లో తీవ్రమైన మతిమరుపునకు కారణమయ్యే అల్జీమర్స్ వ్యాధి చికిత్స దిశగా శాస్త్రవేత్తలు ఒక కీలక ముందడుగు వేశారు. ఈవ్యాధి రహస్యాలను ఛేదించేందుకు పెంపుడు పిల్లులు ఒక అద్భుతమైన మార్గాన్ని చూపగలవని తాజా అధ్యయనంలో తేలింది. యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్‌కు చెందిన శాస్త్రవేత్తలు మంగళవారం ఈ ఆసక్తికర వివరాలను వెల్లడించారు. వయసు పైబడిన పిల్లుల్లో కనిపించే మతిమరుపు (డిమెన్షియా) లక్షణాలకు, మనుషుల్లో అల్జీమర్స్‌కు మధ్య బలమైన సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. వృద్ధాప్యంలోకి అడుగుపెట్టిన పిల్లులు తరచుగా అరవడం, గందరగోళానికి గురవడం, నిద్రలేమి వంటి సమస్యలతో బాధపడతాయి. ఇవే లక్షణాలు అల్జీమర్స్ బాధితుల్లో కూడా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో, మరణించిన 25 పిల్లుల మెదళ్లను పరిశీలించగా, మనుషుల్లో అల్జీమర్స్‌కు కారణమయ్యే అమైలాయిడ్ బీటా అనే హానికర ప్రోటీన్ వాటి మెదళ్లలోనూ పేరుకుపోయినట్లు కనుగొన్నారు. శక్తివంతమైన మైక్రోస్కోపీ ద్వారా చేసిన ఈ పరిశీలనలో, నాడీ కణాల మధ్య సమాచారాన్ని చేరవేసే కీలక ప్రాంతాలైన సినాప్సెస్ వద్ద ఈ ప్రోటీన్ నిల్వలు అధికంగా ఉన్నట్లు తేలింది. అల్జీమర్స్ వ్యాధిలో జ్ఞాపకశక్తి తగ్గడానికి ఈ సినాప్సెస్ దెబ్బతినడమే ప్రధాన కారణం. అంతేకాకుండా, మెదడులోని సహాయక కణాలైన ఆస్ట్రోసైట్లు, మైక్రోగ్లియా ఈ దెబ్బతిన్న సినాప్సెస్‌ను తొలగిస్తున్నట్లు కూడా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ప్రక్రియను సినాప్టిక్ ప్రూనింగ్ అంటారు. ఇది మెదడు అభివృద్ధి దశలో అవసరమైనప్పటికీ, వ్యాధి బారిన పడినప్పుడు మాత్రం నష్టాన్ని కలిగిస్తుంది. ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన రాబర్ట్ ఐ. మెక్‌గెచన్ మాట్లాడుతూ, గతంలో అల్జీమర్స్ పరిశోధనల కోసం జన్యుపరంగా మార్పులు చేసిన ఎలుకలపై ఆధారపడేవారు. కానీ వాటికి సహజంగా మతిమరుపు రాదు. పిల్లులు సహజంగానే ఈ సమస్యను ఎదుర్కొంటాయి. అందువల్ల, పిల్లులపై చేసే అధ్యయనాలు మనుషులకూ, పిల్లులకూ ఉపయోగపడే కొత్త చికిత్సల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ఈ ఆవిష్కరణతో భవిష్యత్తులో అల్జీమర్స్ వ్యాధికి మరింత మెరుగైన చికిత్సలు అందుబాటులోకి వస్తాయని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ అధ్యయన వివరాలు యూరోపియన్ జర్నల్ ఆఫ్ న్యూరోసైన్స్‌లో ప్రచురితమయ్యాయి.

## గుజరాత్ 'రిల్' రిఫైనరీ టార్గెట్‌చేస్తాం!

### అమెరికా గడ్డపైనుంచి పాక్ ఆర్మీచీఫ్ వార్నింగ్



**ఫ్లోరిడా, ఆగస్టు 12:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ అమెరికా వత్తాసుతో భారత్‌పై ప్రేలాపనలకు దిగుతున్నారు. మరోసారి తన వాచాలత్వాన్ని బయటపెట్టుకున్న ఆసిమ్‌మునీర్ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) రిఫైనరీని లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించారు. ఈ రిఫైనరీ ప్రపంచంలోనే అతిపెద్ద సింగిల్‌సైట్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌గా గుర్తింపు పొందింది. అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఒక విందు సమావేశంలో, మునీర్ ఆర్ఐఎల్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ చిత్రంతో పాటు ఖురాన్ శ్లోకాన్ని ప్రస్తావిస్తూ ఒక సోషల్ మీడియా పోస్ట్‌ను ప్రస్తావించారు. అంతేకాదు, భారత్‌కు అణు హెచ్చరికలు కూడా చేశారు.

అమెరికా నేలపై నుంచి మునీర్ చేసిన ఈ వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ యొక్క యుద్ధోన్మాద వైఖరిని స్పష్టంగా చూపిస్తున్నాయని భారత్ అభిప్రాయపడింది. కాగా, మునీర్ న్యూక్లియర్ వార్నింగ్ నేపథ్యంలో... భారత్, పాకిస్థాన్ దేశాల సైనిక, అణు సామర్థ్యంపై చర్చ మొదలైంది. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ ప్రకారం, భారత్ సైనిక బలం పాకిస్థాన్ కంటే చాలా ఎక్కువ. భారత్‌లో సుమారు 14 లక్షల మంది సక్రియ సైనిక సిబ్బంది ఉన్నారు, వీరిలో 12.3 లక్షలు ఆర్మీ, 75,500 నౌకాదళం, 1,49,900 వైమానిక దళం, మరియు 13,350 కోస్ట్ గార్డ్‌లో ఉన్నారు. దీనికి విరుద్ధంగా, పాకిస్థాన్‌లో 7 లక్షల కంటే తక్కువ సైనిక సిబ్బంది ఉన్నారు. 5,60,000 మంది ఆర్మీ, 70,000 మంది వైమానిక దళం, మరియు 30,000 మంది నౌకాదళంలో ఉన్నారు.

అంతేకాక, భారత్‌లో 25 లక్షల మంది పారా మిలటరీ బలగాలు ఉండగా, పాకిస్థాన్‌లో కేవలం 5 లక్షలమంది మాత్రమేఉన్నారు. రెండు దేశాలు న్యూక్లియర్ ఆయుధాలను కలిగి ఉన్నప్పటికీ, గత 20 ఏళ్ల గణాంకాలను పరిశీలిస్తే భారత్‌లో 180 న్యూక్లియర్ వార్‌హెడ్‌లు ఉండగా, పాకిస్థాన్‌లో 170ఉన్నాయని అంచనా. భారత్ అగ్ని5 క్షిపణులు బహుళ లక్ష్యాలను ఒకేసారి ఛేదించగల మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్స్ (ఎంఐఆర్‌వీ) సాంకేతికతను కలిగి ఉన్నాయి. అగ్ని5 రేంజ్ 5,000 నుంచి 8,000 కి.మీ. వరకు ఉండగా, పాకిస్థాన్ యొక్క షాహీన్3 క్షిపణి రేంజ్ 2,750 కి.మీ. మాత్రమే.

## పాక్ ఆర్మీచీఫ్ ఆసీం మునీర్ లాడెన్ వంటివాడు

### పెంటగాన్ మాజీ అధికారి మండిపాటు

**వాషింగ్టన్, ఆగస్టు 12:** అమెరికా పర్యటనలో ఉండగానే పాక్ సైన్యాధిపతి ఆసీం మునీర్ అణు బెరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ బెదరింపులపై పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆసీం మునీర్‌కు.. అల్‌ఖైదా మాజీ చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌కు పెద్ద తేడా లేదని వ్యాఖ్యానించారు. ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. అమెరికా గడ్డపై ఉండి పాక్ ఆర్మీచీఫ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ సందర్భంగా ఆసీం మునీర్ ప్రవర్తన ఒసామా బిన్‌లాడెన్‌లా ఉందని వ్యాఖ్యానించారు. ఆయన మాటలను ట్రంప్ పరిపాలనాధికారులు వెంటనే ఖండించి.. దేశం నుంచి బహిష్కరించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. పాక్‌పై దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సగం ప్రపంచాన్ని అణ్వాయుధాలతో నాశనం చేస్తామని బెదిరిస్తున్న పాక్.. చట్టబద్ధమైన దేశంగా ఉండే హక్కును కోల్పోయిందన్నారు.

ఇటీవల భారత దిగుమతులపై అమెరికా విధించిన సుంకాలపై కూడా రూబెన్ మాట్లాడారు. భారత ప్రధాని మోడీ దేశ హక్కులకు ప్రాధాన్యం ఇవ్వడం ఎంతో గొప్ప విషయమన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ న్యూఢిల్లీని లక్ష్యంగా చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ప్రస్తుత పరిపాలనా విధానం మారిన తర్వాత భారత్-యుఎస్ సంబంధాలు గణనీయంగా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ట్రంప్ ఒక వ్యాపారవేత్త అని.. చెడు శాంతి ఒప్పందం యుద్ధాన్ని ముందుకు తీసుకెళ్తుందనే విషయం ఆయనకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.

## బంగ్లాదేశ్ జనపనార ఉత్పత్తులపై భారత్ బ్యాన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** బంగ్లాదేశ్‌తో వాణిజ్య సంబంధాలు క్షీణిస్తున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్ నుంచి దిగుమతి అయ్యే మరిన్ని జనుము సంబంధిత ఉత్పత్తులపై నిషేధం విధిస్తూ ఆంక్షల జాబితాను విస్తరించింది. భూ సరిహద్దుల ద్వారా ఈ ఉత్పత్తుల దిగుమతిని తక్షణమే నిషేధిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్టీ) ఉత్తర్వులు జారీ చేసింది. డిజిఎఫ్టీ విడుదల చేసిన తాజా నోటిఫికేషన్ ప్రకారం బంగ్లాదేశ్ నుంచి వచ్చే జనుముతో చేసిన వస్త్రాలు, జనపనార దారాలు, తాళ్లు, గోనె సంచులు వంటి ఉత్పత్తులను ఇకపై భూమార్గం ద్వారా దిగుమతి చేసుకోరాదు. కేవలం నవీ ముంబైలోని నవా షేవా ఓడరేవు ద్వారా మాత్రమే వీటికి అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్, అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లోని అన్ని భూ సరిహద్దు కస్టమ్స్ స్టేషన్లు, సమీకృత చెక్ పోస్టుల వద్ద ఈ ఆంక్షలు వెంటనే అమల్లోకి వచ్చాయి. అయితే, బంగ్లాదేశ్ నుంచి నేపాల్, భూటాన్‌లకు వెళ్లే ఎగుమతులకు ఈ నిబంధనలు వర్తించవని, కానీ ఆ దేశాల నుంచి తిరిగి భారత్‌లోకి ఈ వస్తువులను పునఃఎగుమతి చేయడానికి వీల్లేదని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇరు దేశాల మధ్య వాణిజ్య ఆంక్షలు విధించుకోవడం ఇదే మొదటిసారి కాదు. గత కొంత కాలంగా ఈ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో బంగ్లాదేశ్ ప్రభుత్వం భూమార్గాల ద్వారా భారత్ నుంచి నూలు దిగుమతిని నిషేధించింది. దీనికి ప్రతిగా భారత్ కూడా పలు కఠిన నిర్ణయాలు తీసుకుంది. మే నెలలో బంగ్లాదేశ్ నుంచి రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, ఫర్నిచర్‌వంటి సుమారు 770 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ. 6,600 కోట్లు విలువైన వస్తువుల దిగుమతిని భూమార్గాల ద్వారా నిషేధించింది. జూన్‌లో మరికొన్ని నార ఉత్పత్తులపైనా ఇలాంటి ఆంక్షలనే విధించింది. చైనా తర్వాత బంగ్లాదేశ్‌కు భారత్ రెండో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం సుమారు 16 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో బంగ్లాదేశ్ భారత్‌కు 2 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేయగా, భారత్ నుంచి సుమారు 14 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను దిగుమతి చేసుకుంది. తాజా పరిణామాలు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత దెబ్బతీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమిత్‌షాను పొగిడారని సిపిఎం, చర్చి పెద్దలమధ్య డైలాగ్ వార్!



**తిరువనంతపురం, ఆగస్టు 12:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ప్రశంసించినందుకు కేరళలో అధికార సిపిఎం, క్యాథలిక్ చర్చి మధ్య తీవ్ర వివాదం చెలరేగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్ని రేపగా, చర్చి వర్గాలు తీవ్రంగా స్పందించి ఎదురుదాడికి దిగాయి. ఈ పరిణామంతో కేరళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో తప్పుడు ఆరోపణలతో ఇద్దరు క్రిస్టియన్ నన్‌లను అరెస్ట్ చేశారు. ఈ విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోక్యం చేసుకుని వారి విడుదలకు సహకరించారు. దీనిపై తలస్సరీ ఆర్చ్‌బిషప్ మార్ జోసెఫ్ పంప్లానీ, అమిత్ షాకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రశంసించారు. అయితే, ఆర్చ్‌బిషప్ తీరుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నన్‌ల అరెస్ట్ సమయంలో బిజెపిని విమర్శించి, బెయిల్ వచ్చిన తర్వాత అమిత్ షాను పొగడటం ఆర్చ్‌బిషప్ అవకాశవాదానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. గోవిందన్ వ్యాఖ్యలపై కేరళ క్యాథలిక్ కాంగ్రెస్, తలస్సరీ ఆర్చిడయాసిస్ తీవ్రంగా మండిపడ్డాయి.

గోవిందన్ వ్యాఖ్యలు ఆయన హోదాకు తగనివని, అవివేకంతో కూడుకున్నవని కేరళ క్యాథలిక్ కాంగ్రెస్ ప్రతినిధి ఫాదర్ ఫిలిప్ కవియిల్ విమర్శించారు. గోవిందన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటారో లేదో ఆయన ఇష్టం. కానీ, పినరయి విజయన్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావాలా వద్దా అనే విషయం కూడా ఆయన ఆలోచించుకోవాలంటూ తీవ్ర హెచ్చరిక చేశారు. తలస్సరీ ఆర్చిడయాసిస్ కూడా ఘాటుగా స్పందించింది. బిషప్‌లు సిపిఎం పార్టీ ప్రధాన కార్యాలయం ఎకెజి సెంటర్ ఆదేశాల ప్రకారం నడుచుకోవాలా అని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పడం తమ బాధ్యత అని స్పష్టం చేసింది. అవకాశవాది అనే పదం గోవిందన్‌కు సరిగ్గా సరిపోతుందని, ఆయన వ్యక్తిగత బలహీనతలను ఇతరులకు ఆపాదించవద్దని హితవు పలికింది. గోవిందన్ వ్యాఖ్యలు ఆయన ప్రతిష్ఠకే కాకుండా, పార్టీకి, ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు కూడా రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయని హెచ్చరించింది.


### చాట్‌జిపిటికి కొమ్ముకాస్తున్న యాపిల్

### యాపిల్ యాప్‌స్టోర్‌పై ఎలాన్ మస్క్ ఫైర్

**సియాటెల్, ఆగస్టు 12:** టెక్నాలజీ రంగంలో కృత్రిమ మేధ (ఎఐ) ఆధిపత్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్, టెక్ దిగ్గజం యాపిల్‌పై సంచలన ఆరోపణలు చేస్తూ మంగళవారం న్యాయపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించారు. యాపిల్ తన యాప్ స్టోర్‌లో ఓపెన్ ఎఐకి చెందిన చాట్‌జీపీటీకి అనైతికంగా కొమ్ముకాస్తోందని, ఇది తమ సొంత ఎఐ స్టార్టప్ ఎక్స్ ఎఐ ఎదుగుదలను అడ్డుకుంటోందని ఆయన మండిపడ్డారు. యాపిల్ ప్రవర్తిస్తున్న తీరు వల్ల, ఓపెన్‌ఎఐ తప్ప మరే ఇతర ఎఐ కంపెనీ యాప్ స్టోర్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకోవడం అసాధ్యంగా మారింది. దీనిపై ఎక్స్ఎఐ తక్షణమే చట్టపరమైన చర్యలు తీసు కుంటుందని మస్క్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. యాపిల్ ఈ విషయంలో చిన్నపాటి పక్షపాతం చూపడం లేదు, ఏకంగా వాళ్ల బరువునంతా మోసిందంటూ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్ఎఐ రూపొందించిన గ్రాక్, ఓపెన్‌ఎఐకి చెందిన చాట్‌జీపీటీ మధ్య పోటీ తీవ్రమవుతున్న తరుణంలో ఈ ఆరోపణలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## బంగారంపై సుంకాలు విధించం

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టీకరణ



**వాషింగ్టన్, ఆగస్టు 12:** తమ దేశం దిగుమతి చేసుకునే వివిధ దేశాల వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ స్థాయిలో సుంకాలు విధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దిగుమతి చేసుకొనే బంగారు కడ్డీలపై సుంకాల పెంపు వర్తిస్తుందా? లేదా? అనే విషయమై సందిగ్ధతనెలకొంది. దీనిపై ట్రంప్ వివరణ ఇస్తూ సుంకాలు విధించబోమని స్పష్టం చేశారు. అమెరికా కస్టమ్స్ విభాగం గత వారం విడుదల చేసిన ప్రకటనలో.. ఒక కేజీతోపాటు 100 ఔన్సుల (2.8 కిలోల) బంగారు కడ్డీలు సుంకాల పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

ఇదే సమయంలో బంగారంపై సుంకాల విధింపుపై ట్రంప్ క్లారిటీ ఇచ్చేందుకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేస్తారంటూ ఓ వైట్‌హౌస్ అధికారి వ్యాఖ్యలు చేయడం మార్కెట్ వర్గాల్లో మరింత గందరగోళానికి కారణమైంది. ఈ నేపథ్యంలో పసిడి ధర కూడా రికార్డు స్థాయి గరిష్ఠానికి చేరుకుంది. బంగారంపై సుంకాలు లేవంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టు పెట్టిన వెంటనే ధర ఔన్సుపై 50 డాలర్ల మేర తగ్గింది. మరోవైపు స్విట్జర్లాండ్ నుంచి దిగుమతి చేసుకునే బంగారంపై 39 శాతం సుంకం విధించాలని అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల నిర్ణయించారు. అయితే, స్విస్ సహా అనేక దేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారం ఉత్పత్తులకు ప్రతీకార సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందా? అనే విషయంపై స్పష్టం లేదని తెలుస్తోంది.

## సంక్షిప్తంగా..

### ఆగి ఉన్న విమానాన్ని ఢీకొట్టిన మరో విమానం

**కాలిస్పెల్ (యుఎస్), ఆగస్టు 12 :** అమెరికాలో మరోసారి విమాన ప్రమాదం చోటుచేసుకుంది. మోంటానా విమానాశ్రయంలో ల్యాండ్ అవుతున్న ఓ చిన్న విమానం.. ఆగి ఉన్న మరో విమానాన్ని ఢీకొట్టింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని అధికారులు తెలిపారు. నలుగురు ప్రయాణికులతో వెళ్తున్న సింగిల్ ఇంజిన్ విమానం కాలిస్పెల్ సిటీ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నదని కాలిస్పెల్ పోలీసు చీఫ్ జోర్డాన్ వెనెజియో, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. సోకాటా టిబిఎం 700 టర్బోప్రాప్ విమానం అప్పటికే ఆగి ఉన్న ప్రయాణికులు లేని విమానాన్ని ఢీకొట్టిందని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో విమానంలో ఉన్న పైలట్, ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారని చెప్పారు. అయితే ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారని, వారికి ఎయిర్‌పోర్టులోనే చికిత్స అందించామని వెల్లడించారు.

### ఉగ్రవాద సంస్థగా బిష్ణోయ్ గ్యాంగ్‌ను ప్రకటించాలి



**టొరంటో, ఆగస్టు 12:** కెనడాలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కోరుతూ కన్జర్వేటివ్ పార్టీ తాజాగా మార్క్ కార్నీ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ గ్యాంగ్ సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తోందని, వీరిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. కెనడాలో బిష్ణోయ్‌గ్యాంగ్ ఆగడాలు పెరుగుతున్నాయంటూ స్థానికంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కపిల్ శర్మ కేఫ్‌పై రెండుసార్లు కాల్పులు జరగడం తీవ్ర కలకలం రేపింది. ఈ కాల్పుల్లో బిష్ణోయ్ గ్యాంగ్ పాత్ర ఉందనే వాదనలు వినిపించాయి. ఈ నేపథ్యంలో లారెన్స్ బిష్ణోయ్ సంస్థను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కన్జర్వేటివ్ పార్టీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తోందని, కెనడా పౌరులను దోచుకుంటోందని, హత్య కేసుల్లో వారి ప్రమేయం ఉందని కెనడా ఎంపీ ఫ్రాంకా కాపుటో ఆ లేఖలో పేర్కొన్నారు. స్థానికంగా, విదేశాల్లో పలు హింసాత్మక ఘటనలకు తామే బాధ్యులమని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుందని గుర్తు చేశారు.

### మజీద్‌బ్రిగేడ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన అమెరికా

**క్వెట్టా, ఆగస్టు 12:** పాకిస్థాన్ నుంచి స్వేచ్ఛను కోరుతూ బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. స్వతంత్ర బలూచిస్థాన్ లక్ష్యంగా పాక్ ఆర్మీపై తీవ్ర దాడులకు కూడా తెగబడుతోంది. మరోవైపు బిఎల్ఎకు అమెరికా షాక్ ఇచ్చింది. బిఎల్ఎను, దానికి చెందిన మజీద్ బ్రిగేడ్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా అమెరికా ప్రకటించింది. బిఎల్ఎకు గతంలోనే ఇచ్చిన స్పెషల్లీ డిజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ క్లాసిఫికేషన్‌లో మజీద్ బ్రిగేడ్‌ను కూడా చేర్చింది. ఈ సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ 2019 నుంచి జరిగిన ఎన్నో దాడులకు బిఎల్ఎ బాధ్యత వహించిందని చెప్పారు. వీటిలో మజీద్ బ్రిగేడ్ చేసిన దాడులు కూడా ఎన్నో ఉన్నాయని తెలిపారు. బిఎల్ఎను 2019లో స్పెషల్లీ డిజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ గా అమెరికా గుర్తించింది. మరోవైపు 2024లో కరాచీ ఎయిర్ పోర్టు, గ్వాదర్ పోర్ట్ అథారిటీ కాంప్లెక్స్‌లో జరిగిన ఆత్మాహుతి దాడులు, 2025లో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేయడం వంటివి తామే చేసినట్టు బిఎల్ఎ ప్రకటించుకుంది.

### బీహార్ ఓటరు జాబితాపై ఆగని నిరసనలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** బీహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్, ఆర్జేడి వంటి విపక్ష పార్టీలు ఢిల్లీలో నిరసన ర్యాలీ చేపట్టిన విషయం తెలిసిందే. మంగళవారం కూడా విపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఆందోళనల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీతో సహా పలువురు ప్రతిపక్ష నేతలు 'మింతాదేవి' అనే బీహార్ ఓటరు ఫొటోతో ఉన్న టీ షర్టులు ధరించి పార్లమెంట్ వెలుపల నిరసనలో పాల్గొన్నారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, ఇతర ప్రతిపక్ష ఎంపీలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓట్ల చోరీ అంశంలో ఇచ్చిన ప్రజెంటేషన్‌లో బీహార్‌కు చెందిన మింతాదేవి గురించి ప్రస్తావించారు. మింతాదేవి పేరుతో ఉన్న ఓటర్లు ఐడిలో ఆమె వయసు 124 అని ముద్రించినట్లు రాహుల్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత వృద్ధ వ్యక్తి వయసు కంటే ఇది ఎక్కువని ఆయన తెలిపారు.

# ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలి



## అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధారించాలి ..
## అడవిజంతువుల దాడి బాధితులకు తక్షణ పరిహారం
## అధికారుల ప్రమోషన్లు.. అవార్డులకు ప్రతిపాదనలు పంపాలి
## అటవీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 12:** రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని... మన దగ్గర భారీ విస్తీర్ణాల్లో అటవీ ప్రాంతాలు.. అందులోనే నదులు, జలపాతాలు ఉన్నందున మనకు ఉన్న వనరులను సద్వినియోగం చేసే ప్రణాళికలు రూపొందించాలని సిఎం సూచించారు. అటవీ శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మన దగ్గర అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళుతున్నారని సీఎం అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే చేపట్టాలని సీఎం సూచించారు. కలెక్టర్లు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరమైన వరంగల్‌లో జూ ను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు. అటవీ జంతువుల దాడిలో మృతిచెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఇందుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి అవసరమైన మేరకు నిధులు వినియోగించుకోవాలని సీఎం సూచించారు. అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖ, ఆయా పనులు చేపడుతున్న శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీఎం సూచించారు. కేంద్ర అటవీ, పర్యా వరణ శాఖ నుంచి అనుమతులను సాధ్యమైనంత త్వరగా సాధించాలన్నారు. అడవుల్లో వన్య ప్రాణుల సంరక్షణ, వాటి కదలికలను గమనించేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలన్నింటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని సీఎం ఆదేశించారు. అటవీ శాఖలో అధికారుల కొరతపైనా సీఎం ఆరా తీశారు. రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రంతో సంప్రదించాలని సీఎస్‌కు సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు... ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఉత్తమ పని తీరు కనబర్చుతున్న వారికి అవార్డులను ఇచ్చే ప్రక్రియను పునరుద్ధరించాలని సీఎం సూచించారు.

సమీక్షలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఎలు సింగ్ మేరు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మెయింటనెన్స్‌డిపోను తనిఖీ చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

## రైల్వే మెయింటెనెన్స్ డిపో తనిఖీ

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 12, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం మౌలాలీలోని ట్రైన్ సెట్ మెయింటెనెన్స్ డిపోను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో ఆయనతో పాటు హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ డిపోలో చేపడుతున్న వందే భారత్ రైళ్లు, ఎం.ఎం.టి.ఎస్, ఈ.ఎం.యూ ల తనిఖీ,నిర్వహణ షెడ్యూల్‌లను సమీక్షించారు.అదేవిదంగా ఆయన వందే భారత్ రైలును క్షుణ్ణంగా తనిఖీ చేసి, కొనసాగుతున్న నిర్వహణ కార్యకలాపాలను నిశితంగా సమీక్షించారు. డిపోలోని ఇతర సౌకర్యాలను కూడా ఆయన పరిశీలించారు. వాటిలో పిట్ వీల్ లేత్, ఫ్లాష్ బట్ వెల్డింగ్ ప్లాంట్ లను తనిఖీ చేసి కార్యాచరణ సామర్థ్యాన్ని అంచనా వేశారు. అనం తరం జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సిబ్బందితో సంభాషించారు. భద్రత, సామర్థ్యం అధిక ప్రమాణాలను నిర్వహించాలని వారికి సూచించారు. జనరల్ మేనేజర్ పర్యావరణ హిత వాతావరణాన్ని ప్రోత్సహించడానికి మొక్కలు నాటారు. అధికారులతో తదుపరి అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు.

# బిసిలకు క్షమాపణ చెప్పి బిఆర్ఎస్ సభ పెట్టాలి

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** బిసిలకు క్షమాపణ చెప్పి బిఆర్ఎస్ నేతలు సభ నిర్వహించుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విలీనం కోసం బిజెపితో లోపాయి కారీ ఒప్పదం పెట్టుకొని డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గతంలో ప్రజా సమస్యల కోసం వేదికలు ఉండేవి కావని, పదేళ్ల పాలనలో గడిల పాలన, ఫాం హౌస్ పాలనకి చరమగీతం పాడి ప్రజా ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారని అన్నారు. బిఆర్ఎస్ హయంలో ప్రగతి భవన్‌లోకి సామాన్యుడికి ప్రవేశం లేదని, ధనవంతులకే ఖరీదైనకార్లలో ఎంట్రీ ఉండేదన్నారు. ప్రజల సమస్యల కోసం అందు బాటులో ప్రజా ప్రతినిధుల కార్యక్రమం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గాంధీభవన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మారిందని, పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం బిసిలను పట్టించుకున్న పాపాన పోలేద న్నారు. కుల గణనలో కెసిఆర్ కుటుంబం పాల్గొనలేదు. బిసి సభ పెట్టడా నికి బిఆర్ఎస్ నేతలకు ఏం అర్హత ఉందన్నారు. బిసి సభ కోసం ఫాంహౌస్‌లో వినోద్, కెసిఆర్, హరీశ్‌రావుతో కెసిఆర్ చర్చలు జరపడం విడ్డూరంగా ఉందన్నారు.



బిసిల యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

# పార్టీపరంగా 42శాతం టిక్కెట్లు అంటే ఒప్పుకోం

### హక్కుగా రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే : ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** బీసీ బిల్లుల అమలు కోసం ప్రజా పోరాటంతోపాటు అవసరమైతే న్యాయపోరాటం కూడా చేయాల్సి ఉందని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎల్.శ్రావణి. తంగెళ్లమూడి నందగోపాల్‌తో కలిసి బీసీల యుద్ధభేరి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రిజర్వేషన్లు పెంచడానికి న్యాయ, చట్టపరమైన అవరోధాలు ఏమీ లేవు కేసు బలంగా వుందన్నారు. పార్టీ పరంగా 42శాతం టికెట్లు ఇస్తామంటే ఒప్పుకునేది లేదని, చట్టపరంగా హక్కుగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఈ నెల 31న నగరంలోని రవీంద్రభారతిలో బిసిల యుద్ధబేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, జిల్లాపెల్లి అంజి, శ్రావణి, పి.సుధాకర్, చెరుకు మణికంఠ, కరుణ, కవిత, పగిళ్ల సతీష్, హరి, తిలక్ సింగ్, శివ, చాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారాహిల్స్‌లో హైటెన్షన్

## పెద్దమ్మగుడిలో కుంకుమార్చనకు బిజెపి నేతలు పిలుపు
## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హౌజ్ అరెస్టు
### అరెస్టును ఖండించిన బిజెపి నేతలు



**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావును పోలీ సులు గృహ నిర్బంధనం చేశారు. దీంతో మంగళవారం బంజారాహిల్స్ లో హైటెన్షన్ నెలకొంది. రోడ్‌నెంబర్ 12 ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మ గుడిలో కుంకుమార్చన పూజ నిర్వహించాలని బిజెపి, హిందు సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీ సులు అప్రమత్తమయ్యారు. బంజారాహిల్స్ కు వెళ్లే ఇన్ని దారులను మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా పెద్దమ్మ ఆలయం దగ్గర భారీగాపోలీసులు మోహరించారు. గత కొద్ది రోజుల క్రితం దుండగులు ఈ ఆల యాన్ని ధ్వంసం చేయడంతో వివాదం నెలకొంది. మరోవైపు నగర వ్యాప్తంగా బిజెపి లీడర్లు, హిందూ సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పె ద్దమ్మ గుడికి వెళ్తారన్న సమా చారం ఉండ దంతో ఆయన్ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. తా ర్నాకలోని ఆయన నివాసం లోనే గృహ నిర్బం ధం చేశారు. అయి తే పోలీసుల తీరుపై బిజెపి నేతలు అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్బంధ చర్యలు పనికిరావని హెచ్చరించారు.

**గుడిని కూల్చిన గూండాలను అరెస్ట్ చేయరెందుకు?: కేంద్ర మంత్రి బండి సంజయ్**

బంజారాహిల్స్ పెద్దమ్మ గుడివద్ద హిందూ సంఘాలు నిర్వహించే కుంకుమార్చన కార్యక్రమానికి వెళ్లే కార్యక్రమం లేకపోకపోయినా రామ చందర్ రావును అడ్డుకోవడంపైనా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో బిజీగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ విషయం తెలిసిన వెంటనే తీవ్రంగా స్పందించారు. పెద్దమ్మ గుడికి హిందువులు పోతే తప్పేంది? రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? భాగ్యనగర్ లో హిందూ సంఘాలను, బిజెపి కార్యకర్తలందరినీ అరెస్ట్ చేయడం మూర్ఖత్వం అని పేర్కొన్నారు. ఒక పథకం ప్రకారమే కాంగ్రెస్ వ్యవహరిస్తున్నట్లు కన్పిస్తోందన్నారు. పెద్దమ్మ గుడిని కూల్చిన గూండాలను అరెస్ట్ చేయకుండా శాంతియుతంగా పూజలు నిర్వహించే హిందూ సంఘాల నాయ కులను, కార్యకర్తలను అరెస్ట్ చేయడం దుర్మార్గం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఒక వర్గం ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇట్లాంటి కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. రాంచందర్‌రావు అరెస్టును మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌విఎస్‌ఎస్ ప్రభా కర్, గువ్వల బాలరాజు ఖండించారు. నిర్బంధాలతో కార్యక్రమాలను అడ్డుకోవాలని చూడడం దురదృష్టకరమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, హర్ ఘర్ తిరంగా యాత్ర రాష్ట్ర ప్రముఖ్ డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. బిజెపి నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు, నిర్బంధాన్ని తీవ్రంగా ఖండి స్తున్నానని, బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు.

# వికారాబాద్ కలెక్టరేట్‌లో ఎసిబి సోదాలు

### రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మహిళా ఉద్యోగి

**వికారాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఎసిబి సోదాలు జరగడం తీవ్రకలకలం రేపింది. ఓ మహిళా ఉద్యోగి లంచం తీసుకుంటూ అధికారులకు చిక్కారు. వికారాబాద్ జిల్లా కలెక్ట రేట్‌లోని రెవెన్యూ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్ సుజాత రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కింది. ఎసిబి డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌పేట మండలం వట్టిమీనపల్లికి చెందిన ఓ రైతు రెండెకరాల అసైన్డ్ భూమిని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జాకు యత్నించాడు. బాధితుడు నవాబుపేట తహసీల్దార్‌ను ఆశ్రయించగా కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్డర్ కాపీ తీసుకురావాలన్నారు. అందుకోసం రెవె న్యూ సెక్షన్‌లోని జూనియర్ అసిస్టెంట్ సుజాతకు బాధితుడు రూ.5 వేలు ఆన్లైన్ పేమెంట్ చేశాడు. ఆర్డర్ కాపీని మళ్లీ నవాబుపేట్ తహసీల్దార్ కార్యాలయానికి పంపాలంటే మరో రూ.20 వేలు ఇవ్వాలనడంతో రూ.15 వేలు ఇస్తానని బాధితుడు బేరం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత బాధితుడు ఎసిబి అధికారుల ను ఆశ్రయించి వారి సూచన మేరకు మంగళవారం జూనియర్ అసిస్టెంట్ సుజాతకు రూ.15 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టు నకున్నారు. నిందితురాలిని విచారిస్తున్నామని, ఆ తర్వాత ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు.



లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కిన జూనియర్ అసిస్టెంట్ సుజాత

**ఆన్‌లైన్ లంచం.. పట్టుబడ్డ సర్వేయర్**

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** నగదు రూపంలో లంచం తీసుకుంటే దొరికిపోతానని, డిజిటల్ మార్గంలో లంచం తీసుకున్న ఓ అధికారిని ఎసిబి అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. పెద్దపల్లి తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా పని చేస్తున్న సునీల్ ఓ బాధితుని వద్ద ఫోన్‌పే ద్వారా తీసుకోగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. బాధితుడు తన భూమి సర్వే కోసం 8 నెలల క్రితం దరఖాస్తు చేసుకోగా సర్వే రిపోర్ట్ కోసం సర్వేయర్ రూ.20వేల లంచండం డిమాండ్ చేశారు. బాధితుడు రూ.10 వేలు ఫోన్‌పే ద్వారా, ఓ ప్రైవేట్ వ్యక్తి సర్వేయర్ ద్వారా ఫోన్‌పే చేయించుకుని సర్వే చెయ్యకపోవడంతో ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ప్రైవేట్ సర్వేయర్ రాజేందర్ రెడ్డి నుండి 10 వేల రూపాయలు జూలై 9న ఫోన్‌పే చేయించుకున్నారు. దీంతో కాల్ రికార్డింగ్స్, ఫోన్ పే ట్రాన్స్ సాక్షన్స్ ఆధారంగా సర్వేయర్ సునీల్, ప్రైవేట్ సర్వేయర్ ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎసిబి డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు.

# 'కొన్ని మాటలు యాది పెట్టుకోండి, మరికొన్ని రాసి పెట్టుకోండి'

### బిజెపిలో చేరుతున్న వారికి రాజాసింగ్ హెచ్చరికలు




కొన్ని మాటలు యాది పెట్టుకోండి, రాసి కూడా పెట్టుకోండి.

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** బిజెపిలో చేరుతున్న వారికి గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ హెచ్చరికలు జారీ చేశారు. బీజేపీ పార్టీలో చేరుతున్న వారికి స్వాగతం సుస్వాగతం.. పార్టీలో చేరే ముందు కొన్ని మాటలు యాది పెట్టుకోండి, మరికొన్ని రాసి కూడా పెట్టుకోండి అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.బీజేపీ పార్టీలో చేరిన తర్వాత మీరు కోరుకున్నది మీ అసెంబ్లీ, మీ జిల్లా, మీ పార్లమెంటరీ నియోజకవర్గంలో జర గదని చెప్పారు. మీపైన విశ్వాసం పెట్టుకొని మీ కార్యకర్తలు బీజేపీలో చేరిన తర్వాత మీరు వారికి ఏ పదవి కూడా ఇప్పించలేరని పేర్కొన్నారు. బీజేపీలో చేరేముందు కొంత మందితో చర్చలు చేసుకొని రండి అని రాజా సింగ్ సూచనలు చేశారు. ఇటీవల రాజా సింగ్ బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ వెయ్యనివ్వలేని కారణంగానే రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

"బీజేపీలో వేరే పార్టీ నుంచి చాలామంది చేరుతున్నారు. బీజేపీ పార్టీలో చేరుతున్న వారికి స్వాగతం సుస్వాగతం. బీజేపీలో చేరే ముందు బీజేపీలో చేరిన తర్వాత మీరు కోరుకున్నది మీ అసెంబ్లీలో, మీ జిల్లాలో, మీ పార్లమెంటరీ నియోజక వర్గంలో జరగదు. మీపైన విశ్వాసం పెట్టుకొని మీ కార్యకర్తలు బీజేపీలో చేరిన తర్వాత వారికి ఏ పదవి కూడా ఇప్పించలేరు. ఎన్నికల ముందు మీకే టికెట్ వస్తదని గ్యారెంటీ కూడా ఉండదు. బీజేపీలో ఈ రోజు మీరు చేరుంటారు కదా. మొదట్లో ఫస్ట్ సీట్లో మీరు ఉంటారు కానీ తర్వాత లాస్ట్ సీట్లో ఉంటారు. బీజేపీలో చేరిన తర్వాత కొన్ని అలవాట్లు మీరు చేసుకోవాలి. కొన్ని బాధలు కూడా భరించే శక్తి కూడా మీలో పెంచుకోవాలి" అని ఎమ్మెల్యే రాజా సింగ్ అన్నారు.

'మా అసెంబ్లీలో 11 యేళ్లుగా వారి అణచివేతను ఎదుర్కొంటున్నాము. మా జిల్లా, డివిజన్, నియోజకవర్గంలో వాళ్ల వ్యక్తి ఉంటాడు. మేము కోరు కున్నా మమ్మల్ని మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన మా కార్యకర్తల కోసం ఏమీ చేయలేకపోయాము. గోషామహల్ అసెంబ్లీ నుంచి బిజెపిలో చేరే ముందు కొంతమందితో మీరు మాట్లాడి.. చేరిన తర్వాత ఏమైతదని కనుక్కోండి. విజయ శాంతి, జితేందర్‌రెడ్డి, నాగం జనార్ధన్‌రెడ్డి.. చాలామంది వేరే పార్టీ నుంచి బీజేపీలో చేరిన తర్వాత ఎందుకు వెళ్లిపోయారో కనుక్కోండి. నా పర్సనల్ విజ్ఞప్తి ఏంటంటే?.. అలాంటి వారితో ఒక్కసారి మాట్లాడండి. హిందూత్వానికి, దేశా నికి, సమాజానికి చాలా మంచిపనులు చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ. కానీ తెలంగాణలో బీజేపీ కొందరి వల్ల సర్వనాశనం అవుతోంది. బీజేపీలో మేము ఏది చెప్తే అదే అయితది, మేము ఏది రాస్తే అదే రాజ్యమైతది అనుకునే వ్యక్తుల వల్లనే పార్టీ సర్వనాశనం అవుతుంది. ఈరోజు కాకపోతే రేపు తెలంగాణలో రాక్షసులు నాశనమవుతారు. కార్యకర్తల ఆశీస్సులతో బీజేపీ తెలంగాణను పాలి స్తుంది. తెలంగాణలో సీఎం బీజేపీ నుంచే వస్తారు' అని ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పుకొచ్చారు.





ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, షఫీ, మల్లికార్జుజ్ తదితరులు


# దివ్యాంగుల పెన్షన్ ఆరు వేలకు పెంచి తీరుతాం

### లేకుంటే నేనే రాజీనామా చేస్తా

### రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలు కచ్చితంగా పెంచుతామని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్థానిక సంస్థల్లో దివ్యాంగుల రిజర్వేషన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో 'దివ్యాంగుల హక్కులు సంక్షేమం, రాజకీయ అవకాశాలు' పై రాష్ట్ర సదస్సు జరిగింది. చైర్మన్ వీరయ్య ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి చేసిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచకొంటే తాను పదవికి రాజీనామా చేస్తానని...కేంద్రం రూ.3వేలకు పెన్షన్ పెంచకొంటే తమరు పార్టీ పదవికి రాజీనామా చేసే దమ్ముందా అని బిజెపి నేతలకు సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వం 80 శాతం పైబడి అంగవైకల్యం ఉంటేనే దివ్యాంగులగా గుర్తిం చి, 20 వేల మందికి నెలకు రూ.300 చొప్పున పెన్షన్ ఇస్తున్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం 40శాతం పైబడి అంగవైకల్యం ఉన్న దివ్యాంగులకు నెలకు రూ.4,016 పెన్షన్ ఇస్తున్నదని తెలిపారు. సమావేశంలో కమిటీ చైర్మన్ షఫీ, వైస్ చైర్మన్ ధ్యనంపల్లిమల్లికార్జున్, ఎన్పీఆర్‌డి ఇండియా వ్యవస్థాపక అధ్యక్షులు తుడుం రాజేందర్‌తోపాటు వివిధ జిల్లాల నుంచి 150 మంది దివ్యాంగులు పాల్గొన్నారు.

# సినీఫక్కీలో జ్యువెలరీ దుకాణం దోపిడి



వెండి ఆభరణాలు దోచుకుంటున్న దృశ్యం

## తుపాకీతో కాల్పులు జరిపి ఆభరణాలు చోరీ
## పట్టపగలు పది నిమిషాలు బీభత్సం
## హైదరాబాద్ చందానగర్‌లో దోపిడీదొంగల స్వైరవిహారం

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి, శేరిలింగంపల్లి) ఆగస్టు 12, ప్రభాతవార్త :** పట్టపగలు సినీఫక్కీలో తుపాకీ ఎక్కుపెట్టి దోపిడీ దొంగలు పదినిమిషాలపాటు బీభత్సం సృష్టించారు. ప్రతినిత్యం లక్షలాది వాహనాలు తిరుగాడే జాతీయ రహదారిని ఆనుకొనివున్న జ్యుయెలరీ షాపులో చొరబడి అందినకాడికి దోచుకున్నారు. అడ్డొచ్చిన సిబ్బందిపై కాల్పులు జరిపి భయభ్రాంతులకు గురి చేశారు. భయంతో వణికిపోయిన సిబ్బంది ఒక్కసారిగా పరుగులు తీయగా తమ పని ముగించుకొని నింపాదిగా వెళ్లిపోయారు. సైబరాబాద్ పరిధిలోని చందానగర్ ఖజానా జ్యుయెలరీలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా వున్నాయి. చందానగర్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఖజానా జ్యూవెలరీ షాపులో మంగళవారం ఉదయం ఆరుగురు దొంగలు అకస్మికంగా చొంబడ్డారు. ఉదయం 10:35 నిముషాలకు అప్పుడే షాపు ఓపెన్‌చేసి ప్లెడ్జ్ చేస్తున్న సిబ్బందిపైకి ఒక్కసారిగా దూసుకువచ్చిన ఆరుగురు దుండగులు రెండు రౌండ్ల కాల్పులు జరిగపారు. తుపాకీ పేల్చి సీసీ కెమారాలను ధ్వంసం చేశారు. తొలుత తుపాకీతో బెదిరించిన దుండగులు సిబ్బందిని లాకర్ కీ అడిగారు వారు కీ ఇవ్వకపోవడంతో డిప్యూటీ మేనేజర్ సతీశ్ పై కాల్పులు జరిపారు. కాగా జ్యూవెలరీ షాపు లోపల బంగారు అభరణాలకు సంబం ధించిన స్టాల్స విరగగొట్టి సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారు.

**పది నిమిషాల్లో పని ముగించారు..**

ఖజానా జ్యుయెలరీలో సినీఫక్కిలో సాగిన దోపిడీ అంతా పదినిముషాల్లోనే జరిగిపోయింది. సరిగ్గా ఉదయం 10:35 నిముషాలకు ఖజానా జ్యూవెలరీ షాపులోకి ప్రవేశించిన ఆరుగురు దుండగులు ముఖానికి మాస్కులు ధరించి ఒక్కొక్కరుగా లోపలికి చేరుకున్నారు. ముందుగా ఇద్దరు దుండగులు లోనికి ప్రవేశించారు. ఆ తరువాత ఇద్దరు దుండగులు చేతిలో తుపాకిలతో ప్రత్యక్ష్యమయ్యారు. ఆ తరువాత మరో ఇద్దరు దుండగులు ఒక్కొక్కరుగా మాస్కులతో షాపులోనికి వచ్చారు. దుండగులు సిబ్బందిపై తుపాకీ ఎక్కుపెట్టి భయభ్రాంతులకు గురిచేశారు. సీసీ కెమారాలను ధ్వంసం చేయటంతో పాటు అసిస్టెంట్ మేనేజర్ సతీశ్‌ను బంగారు అభరణాలను భద్రపరచిన లాకర్ కీ ఇవ్వాలని బెదరించారు. అందుకు సతీశ్‌కుమార్ నిరాకరించటంతో అతనిపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ క్రమంలోనే సతీశ్ కాలులోనికి బుల్లెట్ దూసుకుపోయింది. ఈ క్రమంలో పోలీసులు వస్తున్నారని గమనించిన దుండగులు అందిన కాడికి వెండివస్తువులను,కొన్ని బంగారు అభరణాలను దొంగలించుకొని ధర్జాగా వెళ్లిపోయారు.

**ఆ సమయంలోనైతేనే..**

కాగా నిత్యం రద్దీగా ఉండే చందానగర్, గంగారం ప్రాంతంలో బంగారు ఆభరణాల షాపులు కొత్తగా వెలిశాయి. ముఖ్యంగా ఖజానా, మల్‌బార్, జీఆర్‌టీ, ఆర్‌ఎస్ బ్రదర్స్ వంటివి ఇక్కడేవున్నాయి. కాగా ఖజానా జ్యుయె లరీ షాపులో దోపిడీకి దుండగులు ముందుగానే రెక్కీ నిర్వహించి, పథకం ప్రకారంగానే ఉదయం వేళను ఎంచుకున్నట్లు తెలుస్తుంది. సిబ్బంది దుకాణం తెరవగానే కస్టమర్ల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం లేదనుకొని ఆ సమయాన్ని ఎంచుకన్నట్లు తెలుస్తుంది. అప్పటికీ ఆ ప్రాంతంలో జనసంచారం ఎక్కువగా ఉండే అవకాశం కూడా ఉండదని పకడ్బందీగా తమ పథకాన్ని అమలు చేశారు.

**పది ప్రత్యేక బృందాల ఏర్పాటు: సిపి అవినాష్ మహంతి**

ఖజానా జ్యుయెలరీ బంగారం షాప్ దొంగతనం కేసులో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ సీపీ అవి నాష్ మహంతి తెలిపారు. విషయం తెలిసి ఘటనాస్థలానికి చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10.35 గంటలకు బైక్‌లపై వచ్చిన ఆరుగురు నిందితులు మాస్క్‌లు ధరించి షాప్‌లోకి చొరబడ్డారని, అందులో ముగ్గరి వద్ద గన్‌లు ఉన్నట్లు తెలిపారు. 10.35 నిమిషాల నుండి 10.45 నిమిషాల వరకు నిందితులు షాప్‌లోనే ఉన్నారని, షాప్‌లోకి చొరబడిన నిందితులు ముందుగా సీసీటీవీ కెమెరాపై కాల్పులు జరిపారని అన్నారు. అనంతరం లాకర్ తాళాలు ఇవ్వాలంటూ అసిస్టెంట్ మేనేజర్ సతీష్ కుమార్‌పై కాల్పులు జరిపారని అతని కాలుకు గాయాలు అయినట్లు తెలిపారు. ఘటన స్థలంలో రెండు ఖాళీ క్యాట్రిడ్జ్‌లు దొరికాయని అన్నారు. బంగారు అభరణాల కౌంటర్లను మాత్రం దుండగులు తెరువలేదన్నారు. దోపిడీకి పాల్పడిన సమయంలో దుండగులు రెండు రౌండ్ల కాల్పులు జరిపారని, షాపులో వెండి అభరణాలు ఉన్న కౌంటర్లను ధ్వంసం చేసి వెండి వస్తువులనుమాత్రమే ఎత్తుకెళ్లారని, వాటి విలువ ఎంత ఉంటుందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. బుల్లెట్ గాయాలైన అసిస్టెంట్ మేనేజర్ సతీశ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. నిందితులు జహీరాబాద్‌వైపుకు పారిపోయినట్లు తెలుస్తుందని,వారిని పట్టుకునేందుకు పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. చుట్టుప్రక్కల జిల్లాల పోలీసులను, టోల్ గేట్ల వద్ద కూడా ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నిందితులు ఎవరు, ఎక్కడి నుండి వచ్చారు అనేదానిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



మంగళవారం పులివెందులలో ఓటు వేయడానికి వచ్చిన స్థానికులు

# బాక్సుల్లో తీర్పు భద్రం

## ప్రశాంతంగా ముగిసిన జడ్‌పిటిసి ఉపఎన్నికలు

### పులివెందులలో ఎంపి అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ హౌస్ అరెస్టు

### ఒంటిమిట్టలో ఉద్రిక్త వాతావరణం

**కడప, ఆగస్టు 12, ప్రభాతవార్త బ్యూరో:** స్వల్ప ఘటనల మినహా మంగళవారం పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలపోలింగ్ ప్రశాంతంగాముగిసింది. పులివెందులలో ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కడప ఎంపి అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి లను హౌస్ అరెస్టు చేయగా ఒంటిమిట్టలో వైఎస్సార్సీ నేతలు వర్సెస్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నట్టుగా పోలింగ్ జరిగింది. పులివెందులలో పోలింగ్ ప్రశాంతంగా జరగగా, ఒంటిమిట్టలో మాత్రం కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొన్ని చోట్ల వైసిపి, టిడిపి నేతలు పరస్పర వాగ్వాదం చేసుకున్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సాలాబాగులోని 29, 30 పోలింగ్ కేంద్రాలకు వెళ్లారని తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ మంత్రి అంజాద్‌బాష, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు అక్కడకు చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం తలెత్తింది. ఎస్పీ రంగప్రవేశం చేసి అక్కడ నుండి ఇరువర్గాలవారిని పంపించారు. ఉదయం నుండి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పులివెందులలో 15 పోలింగ్ కేంద్రాల యందు 10601 ఓట్లు ఉండగా 80 శాతం పోలింగ్ నమోదైంది. కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని వైఎస్సార్సీ నేతలు విమర్శించారు. కొన్ని బూతుల్లో వైఎస్సార్సీ వర్గీయులు రిగ్గింగ్ చేస్తున్నారన్న సమాచారంతోనే తాము బూతుల వద్దకు వెళ్లాం తప్ప ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని టిడిపి నేతలు మీడియాకు వివరించారు. పులివెందులలో మొదటిసారి ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం చర్చనీయాంశంగామారింది. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలన్నింటి లోను ఇక్కడ ఏకగ్రీవాలు జరిగేవి. ఈసారి అందుకు భిన్నంగా ఎన్నికలు జరగడం చర్చనీయాంశం అయింది. కర్నూలు రేంజ్ డిఐజి ప్రవీణ్ పులివెందులలో మకాం పెట్టి ఎన్నికలను పర్యవేక్షించారు.

# ఉద్యోగుల రిటైర్మెంట్, ఇతర ప్రయోజనాలపై ఆర్‌బిఐకి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు స్టేట్ బ్యాంక్‌లో విలీనమైన నేపథ్యంలో ఆయా బ్యాంకుల నుండి వచ్చిన వారికి, ఎస్‌బిఐలో పనిచేస్తున్న ఉద్యోగులకు మధ్య రిటైర్‌మెంట్, ఇతర ప్రయోజనాల్లో వ్యత్యాసం ఉండటంపై వివరణ ఇవ్వాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు హైకోర్టు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఈమేరకు దీనికి సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఎస్బీఐలో విలీనమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్బీహెచ్), స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్, మైసూర్, పాటియాలా, ట్రావెన్‌కోర్ తదితర బ్యాంకుల ఉద్యోగులకూ ఎస్బీఐ ఉద్యోగుల తరహాలోనే ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ పలువురు అధికారులతో పాటు, ఆలిండియా స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై విచారణ చేసిన సింగిల్ జడ్జి నేతృత్వంలోని ధర్మాసనం ఆయా రిటైర్‌మెంట్, ఇతర ప్రయోజనాలకు పిటిషనర్లు అర్హులుకారని పేర్కొంటూ సదరు పిటిషన్‌ను కొట్టేసింది. అయితే సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్లు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటీషనర్ల వాదనలు విన్న ధర్మాసనం ఈ అంశంపై వివరణ ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ సెప్టెంబరు 10కి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

# ద.మ.రైల్వే సీనియర్ డిప్యూటీ జిఎంగా చేతనానంద్‌సింగ్ బాధ్యతల స్వీకారం

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 12, ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్(ఐ.ఆర్.ఎస్.ఈ.ఈ.) 1993 బ్యాచ్ అధికారి చేతనా నంద్ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. దక్షిణ మధ్య రైల్వేలో సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆయన తూర్పు రైల్వేలో అసన్సోల్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. చేతనా నంద్ సింగ్ భారతీయ రైల్వేలలో తూర్పు మధ్య రైల్వే, హాజీపూర్‌లోని గ్రీన్‌ఫీల్డ్ లోకోమోటివ్ ప్రాజెక్ట్‌లో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్; మెట్రో రైల్వేలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (రోలింగ్ స్టాక్); మెట్రో రైల్వే కోల్‌కతాలో జనరల్ మేనేజర్ కార్యదర్శి, అసన్సోల్ డివిజన్‌లో డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ వంటి వివిధ ముఖ్యమైన పదవులలో సేవలను అందించారు.



సీనియర్ డిప్యూటీ జిఎం చేతనానందర్ సింగ్

# ఉస్మానియా ఆసుపత్రి గోషామహల్ స్టేడియానికి తరలింపు

## కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 12:** ఉస్మానియా జనరల్ ఆసుపత్రిని గోషామహల్ స్టేడియానికి తరలించే అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గోషామహల్ స్టేడియంలో నూతన భవనం నిర్మించి ఉస్మానియా ఆసుపత్రిని అక్కడకి తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాము అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. స్టేడియానికి చెందిన స్థలాన్ని ఆసుపత్రికి బదలాయిస్తూ తీసుకున్న నిర్ణయం ఏకపక్షమని, ఇది పట్టణ ప్రాంతాల అభివృద్ధి చట్టాలకు విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. ఆ స్టేడియంలో పాఠశాల ఉందని, విద్యార్థులకు చెందిన ఆటస్థలంలో ఆసుపత్రి నిర్మాణం సరికాదని పేర్కొన్నారు. ప్రస్తుతం మైదానం కూల్చివేత పనులు జరుగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేసినట్లు అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. పేదలకు వైద్య సదుపాయం అందించడానికి ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని ఆయన అన్నారు. ఎంత స్థలంలో నిర్మాణం చేపడుతున్నారు? ఇంకా ఎంత ఖాళీ స్థలం ఉంది? వంటి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయడానికి గడువు కావాలని ఏజీ కోరగా, అందుకు అనుమతిస్తూ తదుపరి విచారణను సెప్టెంబర్ 26కు వాయిదా వేసింది.

# వీధికుక్కల వేట శాస్త్రీయ విధానాలకు తిరోగమనం!



## సుప్రీం తీర్పు తర్వాత విపక్ష నేత రాహుల్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోని వీధి కుక్కలన్నింటినీ వెంటనే పట్టుకుని షెల్టర్లకు తరలించాలంటూ సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ ఆదేశాలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఇది దశాబ్దాలుగా అనుసరిస్తున్న మానవతా, శాస్త్రీయ విధానాలకు తిరోగమనమని ఆయన మంగళవారం విమర్శించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ తన అభిప్రాయాన్ని పోస్టుచేసారు. ఈ మూగజీవాలు తొలగించాల్సిన సమస్యలు కావు. అన్నింటినీ ఒకేసారి తరలించడం క్రూరమైన, అవివేకమైన చర్య. షెల్టర్లు, సంతాన నియంత్రణ, వ్యాక్సినేషన్, సామాజిక సంరక్షణ ద్వారా వీధులను సురక్షితంగా ఉంచవచ్చు. ప్రజల భద్రత, జంతు సంక్షేమం రెండూ సమాంతరంగా సాధ్యమేనని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ప్రజల భద్రత, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై కుక్కల దాడుల గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, ఈ ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం పరిస్థితి తీవ్రంగా ఉందని వ్యాఖ్యానించింది. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్‌లోని మున్సిపల్ కార్పొరేషన్లు వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించింది. షెల్టర్లు లేనిచోట తక్షణమే నిర్మించి, 8 వారాల్లోగా నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. కుక్కల తరలింపును అడ్డుకునే సంస్థలు లేదా వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే జంతు హక్కుల కార్యకర్తలు, జంతు ప్రేమికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇండియా గేట్ వద్ద ఆందోళనకు దిగిన పలువురిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ తీర్పు దిగ్భ్రాంతికరమని, జంతు జనన నియంత్రణ (2003) చట్టానికి విరుద్ధమని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యానిమల్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్, పెటావంటి సంస్థలు ఆరోపించాయి. కుక్కలను వాటి ప్రాంతాల నుంచి తరలిస్తే, ఆ ప్రదేశంలోకి వ్యాక్సిన్లు వేయని కొత్త కుక్కలు వచ్చి చేరతాయని, దీనివల్ల సమస్య మరింత పెరుగుతుందని ఆ సంస్థలు వాదిస్తున్నాయి. ఈ తీర్పుపై నివాస సంక్షేమ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తుండగా, జంతు ప్రేమికులు మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

# రాష్ట్రంలో రూ.600 కోట్ల కోడిగుడ్ల కుంభకోణం

## కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు అడిగే కలెక్టర్లపై ఎసిబికి ఫిర్యాదు చేస్తాం

## బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 12:** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.600 కోట్ల కోడిగుడ్ల కుంభకోణానికి తెరలేపిందని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.

గురుకులాలు ఇతర పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే కోడిగుడ్ల ధరను కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5.50పైసల నుండి 7 రూపాయలకు పెంచిందని, గతంలో ఇచ్చిన కోడిగుడ్ల బరువు 50 నుండి 60 గ్రాములు ఉండగా, ప్రస్తుతం ప్రభుత్వం కోడిగుడ్ల బరువు 42 నుండి 50 గ్రాములకు తగ్గించిందని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం బిఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

గతంలో కోడిగుడ్ల కంట్రాక్టు రావాలంటే ఎలాంటి వార్షిక టర్నోవర్ చూపించాల్సిన అవసరం ఉండేది కాదని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం టర్నోవర్ కనీసం రూ.3 కోట్లు ఉన్న వారికే కాంట్రాక్టు ఇచ్చేలా జిఓ 17 తీసుకొచ్చిందని అన్నారు. గతంలో టెండర్ ఫాం కేవలం రూ.500 నుండి రూ.1000 ఉండేదని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్ ఫాం ధరను రూ. 25,000కు పెంచిందని పేర్కొన్నారు. గతంలో ఎస్‌సి, ఎస్‌టి కాంట్రాక్టర్లకు ఇ.ఎమ్.డిలో 40 శాతం రాయితీ ఉండేదని, కానీ ప్రస్తుత రేవంత్ సర్కార్ ఆ రాయితీని తొలగించిందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద వర్గాలు, చిన్న వ్యాపారులు కాంట్రాక్టర్లుగా ఉండకూడదని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని, అందుకే టెండర్ నిబంధనలు కొత్తగా బడా కాంట్రాక్టర్లతో కలిసి కఠినంగా రూపొందించిందని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీలో ఉన్న జానారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మెఘా కృష్ణ రెడ్డి,మాజీ ఎంపి రంజిత్ రెడ్డి, ఆంధ్ర ప్రాంతానికి చెందిన సిఎం రమేష్ వర్గీయులకే టెండర్లు వచ్చేలా రేవంత్ సర్కార్ కుట్రలు చేస్తుందని అన్నారు. గతంలో స్థానికంగా ఉండే పేదలకు కాంట్రాక్టర్లుగా అవకాశం ఇచ్చేవారని, కానీ ఇప్పుడు మండలాన్ని ఒక యూనిట్‌గా చేసి ఒక్కరికే కాంట్రాక్ట్ ఇచ్చేలా నిబంధనలు మార్చారని చెప్పారు. జిఓ 17 వల్ల సుమారు 20 వేల మంది పేద వర్గాల కాంట్రాక్టర్లు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో క్యాటరింగ్ కాంట్రాక్టుకు కేవలం రూ.75 వేల డిపాజిట్ చేయాల్సి ఉండేది, కానీ ఇప్పుడు సుమారు 5 లక్షల డిపాజిట్,వార్షిక టర్నోవర్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో టెండర్ ఆధారంగా అర్హులైన వారికి కాంట్రాక్ట్ లభించేదని, కానీ ఇప్పుడు వైన్ షాపుల మాదిరిగా లాటరీ తీసే పద్ధతిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు

# నిర్ణీత శిక్ష పూర్తిచేసుకున్న ఖైదీలను వెంటనే విడుదల చేయాలి

## రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. నిర్ణీత శిక్ష పూర్తి చేసుకుని మరే ఇతర కేసులో దోషిగా లేదా నిందితులుగా లేని ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. 2002లో ఢిల్లీలో నితీశ్ కటారా అనే వ్యాపారవేత్త హత్యకేసులో దోషిగా తేలిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ శిక్షాకాలం పూర్తయినందున అతడిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. శిక్షాకాలం పూర్తి చేసుకున్న ఖైదీలు ఇంకా జైల్లోనే ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. ఇదే వైఖరి కొనసాగితే దోషి జైల్లోనే మరణిస్తాడని జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా పహిల్వాన్‌ను ఇంకా జైల్లోనే ఉంచడంపై ప్రశ్నించిన ధర్మాసనం ఆయనతో సహా నిర్ణీత జైలు శిక్ష పూర్తయిన దోషులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గడువుకు మించి ఇంకా ఎవరైనా దోషులు లేదా నిందితులు జైల్లోనే ఉన్నారా? అనే విషయాన్ని తెలుసుకోవాలని, తాజా తీర్పు కాపీలను అన్ని రాష్ట్రాల హోంశాఖ కార్యదర్శులకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఢిల్లీలో 2002లో చోటుచేసుకున్న ఓ పరువుహత్య అప్పట్లో సంచలనం రేపింది. నితీశ్ కటారాను పెళ్లి మండపం నుంచే కిడ్నాప్ చేసిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ బృందం అతడిని హత్య చేశారు. ఈ కేసులో సుఖ్‌దేవ్‌కు జీవితఖైదు పడింది. 2015లో ఈ కేసును విచారించిన ఢిల్లీ హైకోర్టు శిక్ష తగ్గింపు లేకుండా 20 ఏళ్లపాటు జైల్లోనే ఉండాలని ఆదేశించింది. ఈ ఏడాది మార్చితో శిక్షాకాలం పూర్తికావడంతో తనను విడుదల చేయాలంటూ సుఖ్‌దేవ్ సుప్రీంను ఆశ్రయించాడు. విచారించిన సుప్రీం ధర్మాసనం సుఖ్‌దేవ్ పహిల్వాన్ అలియాస్ సుఖ్‌దేవ్ యాదవ్‌ను విడుదల చేయాలని జులై 29నే ఆదేశించింది. అయితే అతడి ప్రవర్తనను విశ్లేషించిన శిక్షా సమీక్ష బోర్డు విడుదల చేసేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై సర్వోన్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. 20 ఏళ్ల పూర్తయినందున పహిల్వాన్ విడుదల సాధ్యం కాదని, శిక్ష తగ్గించాలన్న అభ్యర్థనను ప్రభుత్వం అనుమతించినప్పుడే జైలు నుంచి బయటకు రాగలడని ఢిల్లీ ప్రభుత్వం చేసిన వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది.

# ఐటిబిల్లు, క్రీడలు, యాంటిడోపింగ్ బిల్లులకు రాజ్యసభ ఆమోదం!



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** కొత్త ఆదాయపు పన్ను బిల్లు2025 కొత్త వెర్షన్‌తో పాటు జాతీయ క్రీడా పాలన బిల్లు, నేషనల్ యాంటి డోపింగ్ బిల్లులకు పార్లమెంట్ ఆమోదం లభించింది. ముందు రోజు లోక్‌సభలో బిల్లులకు ఆమోదం లభించగా, మంగళవారం రాజ్యసభ కూడా వీటిని ఆమోదించింది. పార్లమెంట్ ఆమోదంతో వీటిని రాష్ట్రపతి వద్దకు పంపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం పొందగానే ఈ బిల్లులు చట్టరూపం దాల్చనున్నాయి. బీహార్ ఓటరు జాబితా సవరణకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల మధ్యే రాజ్యసభ కూడా ఈ బిల్లులకు ఆమోదం తెలిపింది. లోక్‌సభ ఆమోదం తెలిపిన 24 గంటల్లోనే ఈ బిల్లులకు ఎగువసభలో ఆమోదం లభించింది. నూతన ఆదాయపు పన్ను బిల్లు2025ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు రూపకల్పనకు 75 వేల పని గంటలు పట్టిందని సీతారామన్ అన్నారు. ముఖ్యమైన బిల్లుపై చర్చలో విపక్షాలు పాల్గొనకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. మరోవైపు జాతీయ క్రీడా పాలన బిల్లు సహా నేషనల్ యాంటి డోపింగ్ క్రీడా బిల్లులకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ రెండు బిల్లులను క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సభలో ప్రవేశపెట్టగానే బిల్లుపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు నిరసనలు చేశాయి. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే సహా విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ఈ బిల్లులను ఎగువ సభ ఆమోదించింది. క్రీడా బిల్లు క్రీడాకారుల పనితీరును మెరుగుపరుస్తుందని మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. అంతకుముందు సోమవారం లోక్‌సభలో మాట్లాడిన ఆయన, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జాతీయ క్రీడా బిల్లు అతిపెద్ద సంస్కరణ అని పేర్కొన్నారు.

# రాతి కట్టడాలతో ఆలయాలను అభివృద్ధి చేయండి

## కొడంగల్ ఆలయాల అభివృద్ధిపై సిఎం రేవంత్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 12:** కొడంగల్ నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధిపై అధికారులతో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష చేశారు. కొడంగల్ లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, దౌల్తాబాద్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గిలోని శివాలయం, వేణుగోపాల స్వామి ఆలయాలను సమూలంగా అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆరు ఎకరాల విస్తీర్ణంలో టీటీడీ తరహాలో కొడంగల్‌లోని చారిత్రక శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలను సిఎం ఆమోదించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన డిజైన్లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రాకార మండపం, మాడ వీధులు, భూ వరాహ స్వామి దేవాలయం, గర్భగుడి, మహా మండపం డిజైన్లను అధికారులు సీఎంకు చూపించారు. దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధికి సంబంధించిన డిజైన్లను సిఎం పరిశీలించారు. డిజైన్లపై అధికారులకు సిఎం పలు సూచనలు చేశారు. రాతి కట్టడాలతో ఆలయాలను అద్భుతంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సిఎం సూచించారు.

# సైబర్ నేరాల్లో దేశంలోనే తెలంగాణ టాప్

## జాతీయ సగటు కంటే 10 రెట్లు అధికంగా క్రైమ్ రేటు

## వెల్లడించిన జాతీయ నేర గణాంకాల సంస్థ డేటా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు12:** సైబర్ నేరాల విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధికంగా అప్రతిష్ఠను మూటగట్టుకుంది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ క్రైమ్ రేటుతో పోలిస్తే తెలంగాణలో దాదాపు 10 రెట్లు అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ షాకింగ్ విషయాలను జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) మంగళవారం విడుదల చేసిన 2022 మధ్యంతర డేటా వెల్లడించింది. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ రేటు సగటున 4.8 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది 40.3 శాతంగా నమోదైంది. దీంతో ఈ జాబితాలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే సైబర్ నేరగాళ్లు ఎక్కువగా క్రియాశీలంగా ఉన్నట్లు ఈ నివేదిక సూచిస్తోంది. తెలంగాణ తర్వాత కర్ణాటక రెండో స్థానంలో ఉంది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, మహారాష్ట్రలో సైబర్ క్రైమ్ రేటు 6.6 శాతంగా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 4.4, అసోంలో 4.9, ఉత్తరప్రదేశ్, ఒడిశాలలో 4.3 శాతం చొప్పున ఉంది. పెద్ద రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ కేవలం 0.4 శాతం క్రైమ్ రేటుతో మెరుగైన స్థానంలో నిలవడం గమనార్హం. కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఢిల్లీ 3.2 శాతం, పుదుచ్చేరి 3.9 శాతం క్రైమ్ రేటుతో సైబర్ నేరాలకు హాట్‌స్పాట్‌లుగా మారాయి. ఢిల్లీ పోలీసుల డేటా ప్రకారం, 2024లో సైబర్ మోసాల ద్వారా ఢిల్లీ వాసులు రూ. 817 కోట్లు నష్టపోయారు. 2025లో జూన్ 30 నాటికి మొదటి ఆరు నెలల్లోనే రూ. 70.64 కోట్లు కోల్పోయారు. దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల లోక్‌సభకు తెలిపారు. ఇందులో భాగంగా ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల కోసం ఖినేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్" (cyber-crime.gov.in) ప్రారంభించామని వివరించారు. దీంతో పాటు, మహిళలు, చిన్నారులపై జరిగే సైబర్ నేరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు పోలీస్ విభాగాల్లో ప్రత్యేక యూనిట్లను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# విద్యాసంస్థల వద్ద డ్రగ్స్ బానిసల కోసం వేట

## దాడుల్లో పట్టుబడ్డ వారికి కౌన్సెలింగ్‌తోపాటు పునరావాస కేంద్రాలకు తరలింపు

# డ్రగ్స్ స్మగ్లర్లపై 'ఈగల్' కొరడా

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ స్మగ్లర్ల భరతం పట్టేందుకు తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన ఈగల్ (నిన్నటి యాంటి నార్కో టిక్ బ్యూరో. టి.నాబ్) కొత్త ఎత్తుగడలను ఎంచుకుంది. ఇప్పటి వరకు మాదకద్రవ్యాల స్మగ్లర్లను పట్టుకునేందుకు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను వాడిన ఈగల్ పోలీసులు ఇప్పుడు వీరి మూలంగా విద్యా సంస్థల్లో చదువుకుంటూ బానిసలుగా మారిన విద్యార్థులను టార్గెట్ చేస్తున్నారు. వ్యసనపరుల వివరా లను పక్కాగా సేకరించి వారిని వరుస గా పట్టుకుంటూ వారు వెల్లడించే సమాచారం ఆధారంగా స్మగ్లర్ల భరతం పడుతున్నారు. మరోవైపు ఈగల్ దాడుల్లో పట్టుబడుతున్న వ్యసనపరుల్లో ప్రారంభ దశలో వున్న వారికి కౌన్సిలింగ్‌తో సరిపుచ్చుతున్న అధికారులు వీటికి బానిసలుగా మారిన వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ స్పెషల్ ఆపరేషన్‌ను మరింత పక్కాగా అమలు చేయాలని ఈగల్ పోలీసులు నిర్ణయి ంచారు.

ముల్లును ముల్లుతోనే తీయాలనే సామెతను ఈగల్ పోలీసులు డ్రగ్స్ స్మగ్లర్లను పట్టుకునేందుకు అనుసరిస్తున్నారు.

మామూలుగా మాదకద్రవ్యాల స్మగ్లర్లను ప ట్టుకునేందుకు పోలీసులతో పాటు అబ్కారీ శాఖ ఇన్‌ఫార్మర్ వ్యవస్థతో పాటు పాత నేరగాళ్ల నుంచి అందే సమాచారం, అనుమానిత ప్రాంతాలలో ఆకస్మిక దా డులు నిర్వహించడం పరిపాటిగా వుండడం తెలిసిందే. దీనివల్ల కేవలం మాదకద్రవ్యాల క్రయ, విక్రేతలు మాత్రమే పట్టుబడుతున్నారు. అయితే ఇదే సమయంలో వీరి కారణంగా వ్యసనపరులుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న వారు ముఖ్యంగా పాఠ శాలలు, కాలేజి విద్యార్థులు ఎక్కువగా వుంటున్నారు. ఒకడు అరెస్టయితే వాడితో పరిచయం వున్న మరో నేరగాడు అందుబాటులోకి వస్తుండడంతో వ్యసనపరులుగా మారిన విద్యార్థులు తమకు కావాలసిన సరుకును నిమిషాల్లో సమకూర్చుకుంటున్నారు. దీనివల్ల ఎన్నో కుటుంబాలు నాశనపవుతు న్నాయి. ఈ నేపథ్యంలోనే ఈగల్ పోలీసులు ఓవైపు మాదకద్రవ్యాల భరతం ప డుతూనే మరోవైపు వ్యసనపరుల్లో మార్పు తెచ్చేందుకు తమవంతుగా ప్రయత్నాలు చేయసాగారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలతో పాటు అనేక ఇంజనీరింగ్, మె డికల్ కాలేజీలు కొనేళ్లుగా డ్రగ్స్ మాఫియా ఉచ్చులో చిక్కుకు పోయాయని ఈగల్ గుర్తించింది. గంజాయి సహా కొకైన్, హెరాయిన్, సింథటిక్ డ్రగ్స్‌కు బానిసలు గా మారుతున్న వారిలో కాలేజి విద్యార్థులే ఎక్కువగా వుంటున్నారని అనేకమార్లు తేలింది. పోలీసులతో పాటు అబ్కారీ శాఖ అధికారుల దాడుల్లో పట్టుబడిన వ్యసనరుల్లో విద్యార్థుల సంఖ్య భారీగానే వుంటోంది. టీనేజి విద్యార్థులు కూడా ఇందులో వుండడం గమనార్హం. కాలేజిల్లో డ్రగ్స్ మాఫియా తిష్టను పారదోలా లని సర్కారు కృతనిశ్చయంతో వుండడంతో ఈగల్ పోలీసులు స్పెషల్ ఆపరేషన్ చేబట్టారు. ఇటీవల కాలంలో ఈగల్ పోలీసులు పక్కాగా వ్యవహరించి కాలేజీలను టార్గెట్ చేసుకుని అక్కడ డ్రగ్స్‌కు బానిసలుగా మారిన వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటూ వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇ స్తూనే చట్ట పరంగా చర్యలు తీసుకుంటున్న తీరు సంచలనం రేపుతోంది. డ్రగ్స్‌కు ఎక్కువగా బానిసలుగా మారిన వారిని ఈగల్ పోలీసులు పునరావాస కేంద్రాలకు పంపు తు వారికి కొత్త జీవితాలను ఇస్తున్నారు. ఇదే సమయంలో ఈగల్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్ విద్యా సంస్థల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. సికింద్రాబాద్‌లో ఇటీ వల ఓ కాలేజి వద్ద గంజాయి వ్యసనపరులను ఈగల్ పోలీసులు టార్గెట్ చేయగా కొందరు విద్యార్థులు పట్టుబ డ్డారు. ఈ దాడుల్లో ఇద్దరు స్మగ్లర్లు కూడా దొరికిపోయారు.

ఏడాది క్రితం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజి వద్ద నిర్వహించిన దాడుల్లో ఏకంగా ఇద్దరు ఎంబిబిఎస్ విద్యార్థులు గంజాయి కొంటూ దొరికిపోయారు. వైద్య విద్యార్థులు గంజాయి స్మగ్లర్ల నుంచి గంజాయి కొంటూ పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడం ఇదే తొలిసారి.

కాగా ఉస్మానియా మెడికల్ కాలేజిలో ఇద్దరు వైద్య విద్యార్థులు గంజాయి కొంటూ దొరికిపోయిన ఘటన కాలేజిలో రగడకు దారితీసింది. పట్టుబడ్డ ఇద్దరు తమ కాలేజి పూర్వ విద్యార్థులని, వారికి తమ కాలేజితో సంబంధం లేదని అధికారులు చెబుతుండ గా పూర్వ విద్యార్థులు కాలేజిలో గంజాయి స్మగ్లర్ల నుంచి గంజాయి కొనవచ్చా...? అని పోలీ సులు ప్రశ్నించారు. వైద్య విద్యార్థులు మాదకద్రవ్యాల కు బానిసలుగా మారితే భవిష్యత్తులో వారు వైద్య వృత్తిని ఎలా కొనసాగించగలరనే పోలీసులు ప్రశ్నిస్తున్నా న్నరు. మొత్తం మీద ఉస్మానియా మెడికల్ కాలేజిలో వైద్య విద్యార్థులు గంజాయితో దొరికిపోయిన ఘటన వైద్య విద్య విభాగంలో కలకలం రేపింది. రాబోయే రోజుల్లో ఇంజనీరింగ్, మెడికల్ కాలేజిలను లక్ష్యంగా చేసుకుని ఈగల్ పోలీసులు వరుసగా దాడులు చేసేందుకు వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు.

విద్యార్థులు డ్రగ్స్ కల్చర్ నుంచి పూ ర్తిగా బయటపడేందుకు, వారిలో మార్పు తెచ్చేందుకు మొదట పునరావాస కేంద్రాలకు తరలించి, ఆ తరువాత వారిలో మార్పు తెచ్చేందుకు చర్యలు చేబట్టేందుకు ఈగల్ నిర్ణయించింది.

# మానసిక వికలాంగుల భద్రత కోసం ఐరిస్ టెక్నాలజీ అమలుచేయాలి

## పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 12:** మానసిక వికలాంగుల భద్రత కోసం ఐరిస్ కెమెరా టెక్నాలజీని అమలు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మంగళవారం పార్లమెంట్ లో ప్రశ్నించారు. వరంగల్ వంటి గ్రామీణ ప్రాంతాల్లో మానసిక వికలాంగుల గుర్తింపు, భద్రత కోసం ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ సిస్టమ్ ప్రయోజనాలపై, పైలట్ ప్రాజెక్టులు, నిధుల కేటాయింపు అవకాశాలపై ఎంపీ కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరారు. దీనికి సమాధానంగా కేంద్ర సామాజిక న్యాయం సాధికారత శాఖ సహాయ మంత్రి బిఎల్ వర్మ ఈ టెక్నాలజీ అమలు చేయాలన్న ప్రతిపాదన ప్రస్తుతం మంత్రిత్వ శాఖ పరిశీలనలో లేదని తెలిపారు. ఈ సమాధానంపై డాక్టర్ కావ్య తీవ్ర నిరాశ వ్యక్తంచేశారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఐరిస్ టెక్నాలజీ వలన మానసిక వికలాంగుల భద్రతలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చు అన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీసం పైలట్ ప్రాజెక్టులు కూడా పరిశీలించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మానసిక వికలాంగుల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఐరిస్ కెమెరా టెక్నాలజీ పై సమగ్ర ప్రతిపాదనను సమర్పించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర అధికారులతో కలిసి ఈ టెక్నాలజీ అమలుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఎంపీ కోరారు.

# అందరు చూడాల్సి న సినిమా 'యూనివర్శిటీ పేపర్ లీక్': త్రివిక్రమ్



## టిల్లుస్క్వేర్‌లో 100శాతం కాన్ఫిడెంట్‌గా చేయలేదు

ఒకే హీరోయిన్ రెండు వెర్షన్‌లా చూడాల్సి వస్తే అది అనుపమ పరమేశ్వరం అనేలా చేసుకుంది అమ్మడు.అఆ, ప్రేమమ్ సినిమాలతో తెలుగు తెరకు పరిచయమైన అనుపమ తెలుగులో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. యువ హీరోల నుంచి టైర్ 2 హీరోల దాకా అనుపమ జత కడుతూ వచ్చింది. అమ్మడు ఇచ్చిన పాత్రలకు న్యాయం చేస్తూ మెప్పిస్తూ వచ్చింది. ఐతే ఎందుకో అమ్మడు ఆశించిన స్థాయి పాపులారిటీ తెచ్చుకోలేదు. అంతకుముందు అనుపమ గ్లామర్ షోకి దూరంగా మంచి రోల్స్ చేస్తూ వచ్చింది. టిల్లు స్క్వేర్‌లో లిప్ లాక్, స్కిన్ షో.. ఐతేసి ల్లఅయ్యాక అనుపమపూర్తిగామారి పోయింది. ఆమెగ్లామర్ షోతో ఫోటో షూట్స్ చేయడమే కాదు టిల్లు స్క్వేర్ లో తన లిప్ లాక్, స్కిన్ షోతో షాక్ ఇచ్చింది. టిల్లు స్క్వేర్ లో అనుపమని అలా చూసిన వాళ్లు షాక్ అయ్యారు.. నా ఫ్యాన్స్ కి ఆ రోల్ నచ్చలేదని తెలుసు. నేనుకూడా ఆ సినిమా చేయడానికి చాలా టైం తీసుకున్నా.. చెయ్యాలా వద్దాఅని ఆలోచించా.. కానీ చేసినా తప్పేముంది అనిపించింది. 'వార్ 2లో' వాడకం.. లిప్ సింక్ తో న్యూస్ట్రాటజీ! ఐతే డెసిషన్ తీసుకున్నాకూడా అలా చేయడం కాస్త కష్టమైంది. అందుకే ఆ సినిమాలో 100 శాతం కాన్ఫిడెంట్‌గా చేయలేదని అంటుంది అనుపమ. సినిమాలోనే కాదు ప్రమోషన్స్‌లో కూడా అలాంటిడ్రస్సులువేసు కోవడం కంఫర్ట్ అనిపించలేదు.ఐతేదాని ఒక ఛాలెంజ్‌లా తీసుకునిచేశాఅన్నది అనుపమ .ఆరోల్‌చేస్తే ఏమనుకుంటారా అన్న డౌట్ ఉంది. సినిమాలో ఆ రోల్ చాలా స్ట్రాంగ్ అని భావించే చేశానని అన్నది అనుపమ. అనుపమ పరమేశ్వరన్ విమర్శలకు రెడీ టిల్లు స్క్వేర్ రిలీజ్ అయ్యాక హీరోకి ఈక్వల్‌గా ఉందని అన్నారు. అందుకే అలాంటి పాత్రలు వదుకోదల్చుకో లేదని అన్నది అనుపమ. ఐతే సినిమా చేయడానికి ఫిక్స్ అయినప్పుడే విమర్శలకు తాను రెడీ అయ్యానని చెప్పుకొచ్చింది అమ్మడు. మొత్తానికి అనుపమ పరమేశ్వరన్ టిల్లు స్క్వేర్ పై తనకున్న ఒపీనియన్‌ని బయట పెట్టింది.



ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు వస్తున్న పీపుల్స్ స్టార్ ఆర్ నారాయణ మూర్తి యూనివర్సిటీ పేపర్ లీక్.. స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్ లో ఆర్ నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం యూనివర్సిటీ (పేపర్ లీక్). ఈ చిత్రం ఆగస్టు 22 న ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా ప్రసాద్ ల్యాబ్ లో ప్రత్యేకంగా వీక్షించిన స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ మీడియా తో మాట్లాడారు. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ: ఆర్ నారాయణ మూర్తి అది ఆయన తాలూకు శైలి. అది ప్రత్యేకం. ఈ సినిమాకి వచ్చినప్పుడు కూడా నేను ఈ యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమా ఎలా వుంది అని చెప్పాలి అంటే కార్డు పడిన వెంటనే రెండున్నర గంటలపాటు సినిమా చూడాలా అనిభయపడ్డాను. ఎందుకంటే కరోనా తరువాత అందరూ కూడా ఏ సినిమా అయిన ఇరవై నిమిషాలు ముప్పై నిమిషాలు చూడలేకపోవడం అనే ఒక ఆసహనంలో వుంది ప్రపంచం. అలాంటి సినిమా రెండు గంటలు చూస్తే అలా పరిగెత్తుకెళిపోయింది. పేపర్ లీక్ లు యూనివర్సిటీలు లేదంటే కాలేజీ రోజులు నుంచి విద్యాబోధన ఇంగ్లీషులో జరగాలా? తెలుగులో జరగాలా? విద్యార్థులు ఉద్యోగాల కోసం జాబ్ క్యాలెండర్స్ కోసం వెయిట్ చేయడం, అక్కడ కూడా లంచాలు ఇచ్చిన వాళ్ళకే ఉద్యోగాలు వస్తుంటే మిగతా వాళ్ల తాలూకు స్టూడెంట్స్ నిస్పృహాఇందులో ఏది కూడా మనల్ని ఇమిడేట్ గా ఉత్తేజ పరిచే అంశాలు కాదు. ఆలోచింప అంశాలు లేకపోతే నిరాశపరిచే అంశాలు అయినప్పటికీ కూడా సినిమాని బలంగా పట్టుగా నడిపించారు. నేను అనుకోవడం నారాయణ మూర్తి సిన్సియారిటీ అనుకుంటున్నా. కేవలం మీ సిన్సియారిటీ మూలంగానే దాన్ని మేము దాన్ని మాట అనలేకపోతున్నాము. నారాయణమూర్తిని అందరం ఎందుకు గౌరవిస్తారు అంటే వారి అభిప్రాయం నచ్చే నచ్చకో ఈ రెండు కాదు. ఆయన చెప్పే తీరు. మీ అభిప్రాయాన్ని మీరు ముందుకు తీసుకెళ్లడంలో మీకున్న నిబద్ధత మీకున్న సిన్సియారిటీ దాన్ని మాత్రం ఎవ్వరు ప్రశ్నించలేరు. అది మాత్రం నారాయణ మూర్తి సొంతం. అలాంటి వాటి కోసమే నేను ఇపుడు వచ్చి మీ పక్కన నుంచున్నాను. కేవలం మీ నిబద్ధత నచ్చే దానికి గౌరవం ఇచ్చే. ఇంతలా రాజీ పడకుండా బతకడం అందరి వల్ల కాదు నేను చాలా సార్లు రాజీ పడ్డాను. . ఏర్ సినిమా గురించి మాట్లాడమని అవకాశం కల్పించినందుకు నేను మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియపరుస్తున్నాను. ఈ సినిమా ఆగస్టు 22 న రిలీజ్ అవుతోంది. దీన్ని థియేటర్స్ లో చూడండి. ఇలాంటి సినిమాలు ఎందుకు బతకాలి అంటే ఆర్ నారాయణ మూర్తి మరిన్ని సినిమాలు తీయాలి. . నేను కూడా రెండు గంటలపాటు ఎందుకు గౌరవించి చూసి ఇక్కడకొచ్చి మాట్లాడుతున్నాను అంటే దానికోసమే. ఈ సినిమా ఆడాలి. నెక్స్ట్ సినిమా ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టి ఇంకా మంచి ప్రొడక్షన్ వాల్యూస్ తో తీయడానికి అవకాశం కలిగేలా ఈ సినిమా మీకివ్వాలి అని అలాంటి సక్సెస్ వస్తుందని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో గద్దర్ పాట నాకు బాగా నచ్చింది. నేను కూడా ఇంజనీరింగ్ లో ప్రవేట్ కాలేజ్ లో ర్యాంక్ వచ్చింది. మేము నలుగురు పిల్లలం. మా నాన్న చదివించలేను అన్నారు. ఆయన తేలికగా చెప్పారో లేక నేను తేలికగా తీసుకున్నానో పట్టించుకోకుండా నేను బియాస్సీ చదివేశాను. కానీ ఇప్పుడు చూస్తుంటే అప్పుడున్నంత తేలికగా సమాజం లేదు మనుషులు కూడా అంత తేలికగా సుఖంగా లేరు ఎందుకంత బరువుగా వున్నారు. అంటే మనం పిల్లలమీద అంతా ఒత్తిడిపెట్టేస్తున్నాం. ఈ సినిమాలో పెట్టారు అన్నం తినే టైమ్ లో పుస్తకం చదివితే బెటర్ కదా అని మదర్ చెప్పడం ముద్ద నేను కలిపి పెడతాను నువ్వు చదువుకో అంటుంది. అంతా ఒత్తిడి పిల్లల మీద ఎందుకు పెట్టేస్తున్నారు? పిల్లల భవిష్యత్ గురించి పెద్ద వాళ్ళ వర్తమానాన్ని ఎందుకు తాకట్టు పెట్టేస్తున్నారు? ఆ పాయింట్ నాకు బాగా నచ్చింది ఈ సినిమాలో. అందరూ ఈ సినిమా తప్పకుండా చూడండి అని అన్నారు.పీపుల్స్ స్టార్ ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ: నేను అడిగిన వెంటనే ఒప్పుకొని ఇక్కడకు వచ్చి నేను తీసిన యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమా చూసిన ప్రముఖ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ గారి కి ధన్యవాదములు. సినిమా నచ్చింది అని చెప్పారు సంతోషం. విద్యను ప్రవేటు మాఫియా కబంధ హస్తాల నుంచి విముక్తి చేసి విద్యను జాతీయం చేయాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి.అని చాటి చెప్పేదే ఈ యూనివర్సిటీ పేపర్ లీక్ చిత్రం. ఆగస్టు 22 న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాము అని అన్నారు.నటీనటులు ఆర్. నారాయణ మూర్తి, వైఎస్ కృష్ణేశ్వర్ రావు, తిరుపతి నాయుడు, విజయ్ కుమార్ , నూతన తారాగణం.పాటలు : గద్దర్ జలదంకి సుధాకర్, వేల్పుల నారాయణ.మోటపలుకులు రమేష్, ఎడిటింగ్ : మాలిక్ కెమెరా: బాబూరావు దాస్,కథ,స్క్రీన్ ప్లే , మాటలు , సంగీతం : దర్శకత్వం: నిర్మాత: ఆర్. నారాయణ మూర్తి.

## మెలోడీ ట్యూన్‌తో ఆకట్టుకుంటున్న ..చిత్తూరు పిల్ల సాంగ్..!



లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం సతీ లీలావతి
ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. భార్య, భర్త మధ్య ఉండే అనుబంధాన్ని ఎమోషనల్‌గానే కాకుండా ఎంటర్‌టైనింగ్‌గానూ తెరకెక్కించినట్టుగా ఆ మధ్య విడుదలైన టీజర్‌ను చూస్తే అందరికీ అర్థమై ఉంటుంది.
ఇక తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు...చిత్తూరు పిల్ల..అంటూ సాగే ఈ పాటను చిత్ర యూనిట్ తాజాగా రిలీజ్ చేసింది.
ఈ పాటను వనమాలి రచించగా.. నూతన మోహన్, కృష్ణ తేజస్వీ, రితేజ్ జి రావు సంయుక్తంగా ఆలపించారు. మిక్కీ జె మేయర్ అందించిన బాణీ సుతిమెత్తగా అందరినీ గుండెల్ని తాకేలా ఉంది. ఇక బృందా మాస్టర్ కొరియోగ్రఫీతో ఈ లిరికల్ వీడియో ఎంతో చూడముచ్చటగా మారింది. పెళ్లి సంబరాల్లో ఈ పాటను ప్లే చేసేలా మేకర్లు తెరకెక్కించారు.షూటింగ్ పూర్తి చేసుకున్న ..సతీ లీలావతి.. సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అనుకున్న ప్లానింగ్ ప్రకారం మేకర్స్ సినిమాను శరవేగంగా పూర్తి చేసి విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఫీల్ గుడ్ మూవీగా అందరినీ ఆకట్టుకునేలా, అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

## 'రావు బహాదూర్'‌ మెజస్టిక్ ఫస్ట్‌లుక్



జీఎమ్‌బి ఎంటర్‌టైన్‌మెంట్ ప్రజెంట్స్, సత్య దేవ్, వెంకటేష్ మహా ఎ+ఎస్ మూవీస్ శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ 'రావు బహదూర్' మెజెస్టిక్ ఫస్ట్‌లుక్ రిలీజ్, ఇండిపెండెన్స్ డే కి "నాట్ ఈవెన్ ఎ టీజర్' రిలీజ్‌సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జీఎమ్‌బి ఎంటర్‌టైన్‌మెంట్, దిగ్గ్ కంచరపాలెం, ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్యచిత్రాలతో పేరు తెచ్చుకున్న డైరెక్టర్ వెంకటేష్ మహా తాజా చిత్రం 'రావు బహదూర్'‌ను గర్వంగా ప్రజెంట్ చేస్తున్నారు. వర్సటైల్ యాక్టర్ సత్య దేవ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఎ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్నాయి. ఇవి తెలుగు సినిమాలోని అత్యంత విజయవంతమైన నిర్మాణ సంస్థలు. ఎ+ఎస్ మూవీస్ ఇంతకుమందు పాన్‌ఇండియా బ్లాక్‌బస్టర్ మేజర్‌లో జీఎమ్‌బి ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి పనిచేశాయి, శ్రీచక్రాస్ ఎంటర్ టైన్‌మెంట్స్ విమర్శకుల ప్రశంసలు పొందిన క కి మద్దతు ఇచ్చాయి.
రావు బహదూర్ కథ నచ్చి మహేష్ బాబు, నమ్రత ప్రొడక్షన్‌లోకి వచ్చారు.మంచి కంటెంట్ ఉన్న కథలకు వీరి మద్దతు ఎప్పుడూ వుంటుంది. సక్సెస్ ఫుల్ బ్యానర్స్ కలిసి రావడంతో ఈ సినిమా ను భారీబడ్జెట్‌తో, అద్భుతమైన ప్రొడక్షన్ విలువలతో, వరల్డ్ క్లాస్ టెక్నికల్ స్టాండర్డ్స్‌తో రూపొందిస్తున్నారు.రావు బహదూర్ ఓ సైకలాజికల్ డ్రామా. ఓ రాజవంశం నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం, ఎడిటింగ్ వెంకటేష్ మహా. గొప్ప విజువల్స్, భావోద్వేగాలు, చరిత్రాసంస్కృతి కలిపిన ప్రపంచాన్ని చూపించబోతున్నారు. తెలుగు కథ గ్లోబల్ ఆడియెన్స్ కోసం రెడీ అవుతోంది.ఈరోజు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సత్యదేవ్‌ను అరిస్టోక్రాటిక్ డ్రెస్‌లో, చుట్టూ నెమలి పింఛాలు, తీగలు, చిన్నచిన్న బొమ్మల మధ్య కనిపించడం చాలా క్యూరియాసిటీని పెంచింది.
ఆగస్టు 15న థియేటర్స్‌లో "నాట్ ఈవెన్ ఎ టీజర్.. అనే స్పెషల్ వీడియో రిలీజ్ అవుతుంది. ఆ తర్వాత ఆగస్టు 18న డిజిటల్‌లో వస్తుంది.దర్శకుడు వెంకటేష్ మహా మాట్లాడుతూ.. ఇది ప్రపంచానికి వినిపించాల్సిన తెలుగు కథ.సత్యదేవ్ మాట్లాడుతూ, ఒక యాక్టర్‌గా, రావు బహదూర్ లాంటి సినిమా దొరకడం అరుదు. ప్రతి ఉదయం ఐదు గంటల మేకప్.నేను కేవలం నటించలేదు, నిజంగానే రావు బహదూర్‌గా బతికాను. ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం ఈ సినిమా పని చేస్తున్నారు. కార్తీక్ పర్మార్ సినిమాటోగ్రఫీ, స్మరణ్ సాయి సంగీతం, రోహన్ సింగ్ ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేస్తున్నారు.
పవర్‌ఫుల్ ప్రొడ్యూసర్స్, విజనరీ డైరెక్టర్, అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇస్తున్న హీరో ఇవన్నీ కలిపి రావు బహదూర్ మోస్ట్ అవైటెడ్ ఇండియన్ సినిమాలలో ఒకటిగా నిలిస్తోంది.ఈ చిత్రాన్ని 2026 వేసవిలో తెలుగు, మల్టీపుల్ లాంగ్వేజెస్ సబ్‌టైటిల్స్‌తో గ్లోబల్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు.
తారాగణం: సత్య దేవ్
సాంకేతిక సిబ్బంది:
రచన, దర్శకత్వం, ఎడిటర్: వెంకటేష్ మహా
ప్రజెంట్స్: మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ జీఎమ్‌బి ఎంటర్‌టైన్‌మెంట్
నిర్మాతలు: చింతా గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి శరత్ చంద్ర
ప్రొడక్షన్ బ్యానర్స్: ఎ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ఎగ్జిక్యూటివ్ నిర్మాత: దినేష్ యాదవ్ బి
డీవోపీ: కార్తీక్ పర్మార్
సంగీతం: స్మరణ్ సాయి
ప్రొడక్షన్ డిజైనర్: రోహన్ సింగ్
పిఆర్ఓ: వంశీశేఖర్,
పబ్లిసిటీ డిజైన్స్: ఎల్లో టూత్స్.



## కుటుంబం కోసమే దీపిక స్పీడ్ తగ్గిస్తుందా..

దీపికా పదుకొణే సినిమాల స్పీడ్ తగ్గించిందా కొత్త కమిట్ మెంట్ల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది దీపికా పదుకొణే సినిమాల స్పీడ్ తగ్గించిందా? కొత్త కమిట్ మెంట్ల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. ఏడాది కానీ ఎనిమిది నెలల కాలగా దీపిక స్తబ్దుగా ఉంది. ఇటీవలే సొంత నిర్మాణ సంస్థలో అమెరికన్ కామెడీ డ్రామా ది ఇన్ టెన్ ని రీమేక్ చేస్తున్న ట్లు ప్రకటించింది. ఇదే సినిమాలో దీపిక కూడా నటిస్తుందని ప్రచారం జరిగింది. లెజెండరీ నటుడు అమి తాబచ్చన్ భాగమవ్వడంతో ఆయనతో దీపిక కూడా తెరను పంచుకుంటుందని అభి మానులు ఆశించారు. దీపిక కూడా సానుకూలంగానే స్పందించింది. కానీ అమ్మడిప్పుడు ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పు కున్నట్లు వార్తలొస్తున్నాయి.కానీ సొంత నిర్మాణ సంస్థలో సినిమాకు కూడా మ్యాకప్ వేసుకోవడానికి సిద్దంగా లేకపోవడం సర్వత్రా చర్చకు దారి తీస్తోంది. దీంతో దీపిక కుటుంబం కోసమే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుందా? అన్న అంశం తెరపైకి వస్తోంది.


## 'సుందరకాండ'‌ ఆగస్టు 27న విడుదల

సందీప్ పిక్చర్ ప్యాలెస్ సుందరకాండ హిలేరియస్ ఫన్ లవ్ రైడ్ ర్యాప్ ట్రైలర్ హీరో నారా రోహిత్ మైల్ స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ' ఆగస్టు 27న విడుదలకు సిద్ధమవుతోంది. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఎస్‌పిపి బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. టీజర్, పాటలు స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ సుందరకాండ ర్యాప్ ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ హిలేరియస్ ఫన్ లవ్ రైడ్ ని ప్రామిస్ చేసింది.ఓ మిడిల్ ఏజ్ బ్యాచిలర్



తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఉండాల్సిన అయిదు క్వాలిటీస్ కోసం సెర్చ్ చేయడం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ జర్నీ లో అతని కాలేజ్ డేస్ లవ్ స్టోరీ, ప్రజెంట్ లవ్ స్టోరీ.. ఇలా రెండు ప్రేమకథలతో హిలేరియస్ గా సాగు తుంది . ట్రైలర్‌లో ఈ రెండు టైమ్‌లైన్‌ల మధ్య లవ్ టగ్‌ఆఫ్‌వార్‌ని ఫన్, మనసుని హత్తుకునే ఎమోషన్‌తో అద్భుతంగా చూపించారు. ర్యాప్ స్టైల్లో కట్ చేసిన ఈ ట్రైలర్ ఫ్రెష్‌గా, సినిమా లైట్‌హార్టెడ్ వైబ్‌ని ప్రజెంట్ చేసింది. నారా రోహిత్ కామెడీ టైమింగ్ అదిరిపోయింది. ఆయనకి తోడు నరేష్, సత్య, వీటీవీ గణేష్,అభినవ్‌గోమటంస్క్రీన్ మీద ఎంటర్‌టైన్‌మెంట్ పుష్కలంగాపండించారు. డైరెక్టర్ వెంకటేశ్ రాసిన సీన్‌లు క్రిస్ప్‌గా, సిట్యుయేషనల్ కామెడీ, ఎమోషనల్ బీట్స్‌కి స్మార్ట్ బ్యాలెన్స్ చేశాయి. పదీప్ ఎం. వర్మ సినిమాటోగ్రఫీ కలర్ ఫుల్‌గా వుంది, లియాన్ జేమ్స్ మ్యూజిక్‌లో రాప్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకి స్పెషల్ ఫీల్ ఇచ్చింది. ప్రొడక్షన్ వాల్యూస్ టాప్ క్వాలిటీలో వున్నాయి. రాజేష్ పెంటకోట ఆర్ట్ డైరెక్టర్‌గా, సుందీప్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు.ఇంకో రెండు వారాల్లో రానున్న సినిమాపై మంచి అంచనాలు పెంచింది. తారాగణం: నారా రోహిత్, వృతి వాఘాని, శ్రీ దేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, సత్య, అజయ్,వీటీవీ గణేష్, అభినవ్ గోమటం, విశ్వంత్, రూప లక్ష్మీ, సునైనా, రఘు బాబు, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: వెంకటేష్ :నిమ్మలపూడి,నిర్మాతలు: సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్‌రెడ్డి, రాకేష్ మహంకాళి,బ్యానర్:సందీప్‌పిక్చర్ ప్యాలెస్ (ఎస్‌పిపి) డిఓపి:ప్రదీప్‌ఎంవర్మ, సంగీతం: లియోన్ జేమ్స్,ఎడిటర్: రోహన్ చిల్లాలేఆర్ట్ డైరెక్టర్: రాజేష్ పెంటకోటసాహిత్యం: శ్రీహర్ష,

## ఇలాంటి ఆదర్శమైన చిత్రాలు మరెన్నో రావాలి



సముద్ర, శివిక, కుసుమ, సుప్రి య, నవీన్ మట్టా, రోహిల్, ఆదిల్, రూపేష్, కీలక పాత్ర ధారు లుగా తెరకెక్కుతున్న చిత్రం అన్నపూర్ణ తల్లి బువమ్మ. గోరి బ్రదర్స్ మీడియా, బ్లాక్ అండ్ వైట్ మూవీ మార్క్ వ తా కా ల పై సిరాజ్ ఖాదరన్ గోరి నిర్మిస్తున్నరు.సురేష్ లంకలపల్లి దర్శకత్వం వహిస్తున్నారు.
ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, రాధికాపతి దాస్ ప్రభు, సాయి విజయేందర్ సింగ్ తదితరులు హాజరయ్యారు. బాలినేని శ్రీనివాసరెడ్డి టీమ్ అందరికీ షీల్డ్‌లు అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ,అన్నపూర్ణమ్మ అయిన డొక్కా సీతమ్మ గురించి ఇంతకు ముందు ఎవరికీ పెద్దగా తెలీదు. పవన్ కల్యాన్ వల్ల ఆమె పేరు ఇప్పుడు అందరికీ తెలిసింది. ఏ సమయంలో అయిన ఆమె వండి వార్చి వడ్డించేదని చెబుతుంటారు. అలాంటి వ్యకి కథతో సినిమా చేయడం ఆనందంగా ఉంది. ఆంధ్రాలో మధ్యాహ్నం పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం హర్షించదగ్గ విషయం.
పవన్‌కల్యాణ్‌గారి స్ఫూర్తితో నేను కూడా ఒంగోలులో డొక్కా సీతమ్మ పేరున అన్నదానం మొదలుపెడతారు. ఈ సినిమా విషయానికొస్తే.. ఇలాంటి మంచి వ్యక్తి కథలు జనాలకు తెలియాలి. పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో చక్కని సందేశంతో తీసిన ఈ సినిమా విజయవంతం కావాలి. ఇలాంటి ఆదర్శవంతమైన చిత్రాలు నేటి సమాజానికి అవసరం అని అన్నారు.డొక్కా సీతమ్మ పాత్రధారి శివిక మాట్లాడుతూ,నా తొలి చిత్రమది. నటిగా లాంచ్ అవ్వడానికి ఇంతకన్నా మంచి టీమ్ దొరకదు. అద్భుతమైన పాత్ర ఇచ్చారు. న్యాయం చేశాననే అనుకుంట ున్నా అన్నారు. వి. సముద్ర మాట్లాడు తూ,డొక్కా సీతమ్మగారి జీవిత కథ ఈ సినిమా.ఇలాంటి సినిమాలు తీయడంకొందరు నిర్మాతలకే దక్కుతుంది. ఈ నిర్మాతలకు జీవిత కాలం చెప్పుకునే సినిమా అవుతుంది.ఇందులో సీతమ్మ గారి భర్తగా నటించడం అదృష్టం. నేను ఎంతోమంది స్టార్‌లను డైరెక్ట్ చేశాను. కానీ సినిమా లో నటించ డం ఆనందంగా ఉంది. దర్శకుడు సురేశ్ బాగా తీశాడుఅని అన్నారు.
దర్శకుడు సురేశ్ లంకలపల్లి మాట్లా డుతూ, మంచి టీమ్ కుదిరింది. నా టీమ్ బాగా చేసిందని చేను చెప్పను. తెరపై వాళ్ల పెర్‌ఫార్మెన్స్ చూసి ప్రేక్షకులే చెబుతారు. మంచి సినిమా తీశానని ,ప్రేక్షకులు ఆ ద రి స్తా ర ని న మ్మ కం గా చెప్పగలను అని అన్నారు. నిర్మాతలు మాట్లా డుతూ, సినిమా పూర్తయింది. గుమ్మడి క ాయ కొట్టేశాం. త్వరలో పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను విడుదల చేస్తాంఅని అన్నారు.నటీనటులు సాంకేతిక నిపుణులు: సముద్ర, శివిక, కుసుమ, సుప్రియ, నవీన్ మట్టా, రోహిల్,దిల్,రూపేష్, వైష్ణవి,సిరాజ్, ఖాదర్ గోరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎం. నాగేశ్వరి,సంగీతం: సాకేత్ వేగి, కెమెరా: ఆర్యసాయి కృష్ణ,డైలాగ్స్: రాంప్రసాద,పి.ఆర్.ఓ: విఆర్ మధు, స్క్రీన్ ప్లే దర్శకత్వం: సురేష్, లంకలపల్లి.




## పరదాపై పూర్తి కాన్ఫిడెన్స్.. వెనకడుగు వేయనంటున్న అనుపమ

టాలీవుడ్‌లో తె ర కె క్కి న లేటెస్ట్ చిత్రం 'పరదా' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీఅయింది. ఈ సినిమాను దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల డైరెక్ట్ చేస్తుండగా అందాల భామ అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో సక్సెస్ అయింది. ఇక ఈ సినిమాను ఓ సామాజిక అంశంతో దర్శకుడు తెరకెక్కించినట్లు ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమా కథపై చిత్ర యూనిట్ పూర్తి ధీమాగా ఉన్నారు. అందుకే ఈ చిత్ర ప్రమోషన్స్‌ను తామే నిర్వహిస్తూ బిజీగా ఉన్నారు. అయితే, ఇదే విషయంపై తాజాగా అనుపమ కూడా ఓ క్లారిటీ ఇచ్చింది. తమ సినిమా కంటెంట్‌పై తాము పూర్తి నమ్మకంగా ఉన్నామని.. అందుకే పీఆర్ ప్రమోషన్స్ కాకుండా తామే చేసుకుంటున్నామని ఆమె ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. దీంతో ఈ సినిమాపై ఆమె ఎంత కాన్ఫిడెంట్‌గా ఉందో అర్థమవుతుంది. ఇక ఈ సినిమాలో దర్శన రాజేంద్రన్, సంగీత ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.
ఈ చిత్రాన్ని ఆగస్టు 22న గ్రాండ్ రిలీజ్ చేస్తుండగా యూఎస్‌లో ఆగస్టు 21న ప్రీమియర్స్ వేస్తున్నారు.

# తెలియకుండానే ఖర్చు ..



ఆన్‌లైన్‌లో తగ్గింపు అని కనిపించినా, సరదాగా బయటికి వెళ్లినా ఒకటో రెండో డ్రెస్సులు వెంట బెట్టుకొచ్చేస్తారు. అప్పటికే బోలెడు క్రీములు ఇంట్లో ఉన్నా.. ఎవరో సిఫారసు చేశారనో, తక్కువకే వస్తున్నా యనో మరిన్ని తెచ్చేస్తుంటారు. అప్పుడు అమ్మల నుంచి ఎదురయ్యే ప్రశ్న ఇప్పటికే ఉన్నాయిగా? మళ్లీ ఇవన్నీ ఎందుకు? దండగ ఖర్చు కాకపోతే' అనే కదూ! నిజంగానే ఎందుకిలా కొనేస్తాం?

కొన్ని వస్తువులు, దుస్తులు ఎంత నచ్చినా ఆర్థిక పరిస్థితి అనుకూలించక కొనలేరు కొందరు. అతలా మనసులో నాటుకుపోతుందేమో.. సొంతంగా సంపాదించడం మొదలు పెట్టాక తెలియకుండానే అలా ఖర్చు చేస్తుంటారు. కొందరికి ఆర్థిక పరిస్థితులు బాగున్నా అలమరాలు నింపేస్తారుగా అంటే.. దానికీ కారణముంది అంటున్నాయి కొన్ని పరిశోధనలు. ఆత్మ విశ్వాసంగా కనిపించడానికి అమ్మాయిలు ఎంచుకునే మార్గాల్లో దుస్తులూ ఒకటి. వాళ్ల వ్యక్తిత్వం, స్టైల్‌ని వాటి ద్వారా వ్యక్తపరుస్తారట. అందుకే ఎన్ని ఉన్నా తాజా ధోరణులను తెలుసుకుని మరీ వేసుకున్నా వేసుకోక పోయినా దుస్తులు, చెప్పులు వగైరా కొంటూనే ఉంటారు. ఇంకొందరైతే అలా కొనడం ద్వారా ఒత్తిడి దూరమైనట్లుగా భావిస్తారు. అందుకే 'ఎందుకింత ఖర్చు' అన్నా తీరు మాత్రం మార్చుకోలేరు. బ్యూటీ ఉత్పత్తుల మాటేంటి? ముఖ్యమైన సందర్భం.. అందంగానో, నలుగురిలో ఉత్తమంగానో కనిపించాలనుకుంటారు. తీరా ఏ కాటుకో, మరేదో కనిపించదు.. చూసేవాళ్లకు చిన్నగానే కనిపిస్తుంది. మనసులో ఆ లోటు వాళ్లకి తెలుస్తూనే ఉంటుంది. సందర్భమేదైనా 'పర్‌ఫెక్ట్'గా ఉండాలనుకునే అమ్మాయిలే ఎక్కువ. అలాంటివాళ్లు వీటినెలా తట్టుకుంటారు చెప్పండి. అందుకని ముందుగానే సిద్ధంగా ఉండాలన్న తాపత్రయంలో తెలియకుండానే ఇలా ఖర్చు చేస్తుంటారు.

ఈ తీరు ఇబ్బంది కదా! అంటే.. అవుననే అంటున్నాయి అధ్యయనాలు. ఖర్చు పెట్టే స్థోమత ఉందన్న ధైర్యం, అందుబాటులో ఉన్న క్రెడిట్ కార్డు అనవసర ఖర్చేమో అన్న ఆలోచనే రానీయడం లేదట. కాబట్టి, నెలకి దుస్తులు, సౌందర్య ఉత్పత్తులకు ఇంత అని బడ్జెట్ పెట్టుకోవాలి. దాన్ని తు.చ. తప్పకుండా పాటించడమే దీనికి సరైన పరిష్కారం అంటున్నారు నిపుణులు. ఒకవేళ దానిలో మిగిలితే మరుసటి నెలకు బదిలీ చేసుకోవచ్చు. పరిధి దాటితే మాత్రం అడ్డుకట్ట వేసుకోవడం ఒక్కటే మార్గం. ప్రయత్నిస్తారా మరి? □

# భారతీయ వీరనారి అహల్యాదేవి హోల్కర్

300వ వర్ధంతి సందర్భంగా..



ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న అహల్యానగర్ జిల్లాకు చెందిన చోండీ గ్రామంలో పాటిల్ లేదా చీఫ్ అయిన సుశీల మంకోజి షిండే దంపతులకు 31 మే 1725న జన్మించింది అహల్యాబాయి. నాటి కాలంలో బాలికలు పాఠశాలకు వెళ్లే వారుకానప్పటికీ తల్లితండ్రుల చొరవతో చదవడం, రాయడం నేర్చుకుంది. నిరాడంబర కుటుంబంలోంచి ఎదిగిన 8 ఏండ్ల అహల్యాబాయి ఆలయ సేవలను, భక్తిని, ప్రవర్తనను గమనించిన మాల్వా ప్రాంత సైనిక కమాండర్ మల్హర్ రావు వెంటనే తన 10 ఏండ్ల కుమారుడు ఖండేరావుకు తగిన వధువుగా ఎంపిక చేసుకొని వివాహం జరిపించారు. 1745లో ఆ యువ జంటకు మలేరావు అనే కుమారుడు, 1748లో ముక్తాబాయి అనే కూతురు జన్మించారు.

**మహారాణిగా ఎదిగిన:** 1754లో కుంబేర్ ముట్టడి సమయంలో జరిగిన ఫిరంగుల కాల్పుల్లో ఖండేరావు మరణించగా నాటి ఆచారం ప్రకారం సతీ సజీవ దమనం చేసుకోవడానికి సిద్ధపడిన అహల్యాబాయిని మామ గారైన మల్హర్‌రావు ఒప్పించి తన కోడలిని కాపాడారు. విధవరాలైన అహల్యాబాయికి రాజ నీతి, రాజ్య పాలన, యుద్ధ నైపుణ్యాలు, ప్రజా సంక్షేమాల్లో శిక్షణ ఇవ్వడంతో ఆమె రాజ్య వ్యవహారాలను చక్కగా చూసుకోవడంజరిగింది. 1766లో మామగారైన మల్హర్‌రావు మరణించడంతో తన కుమారుడు మలేరావు రాజ్య బాధ్యతలను తీసుకోవడం, మానసిక అనారోగ్యంతో తన కుమారుడు మరణించడంతో దెబ్బ మీద దెబ్బ పడినట్లు అహల్యాబాయిని సమస్యలు వెంటాడాయి. నాడు స్త్రీలను రాజ్య పాలనకు అనర్హులుగా పరిగణించాడే వారు. కాని అహల్యాబాయి శక్తి, యుక్తి, పాలనా పటిమ, ప్రవృత్తిలాంటి పలు సామర్థ్యాన్ని గుర్తించిన నాటి మరాఠా ముఖ్యులు ఆమె సింహాసనం స్వీకరించడానికి అంగీకరించడం విశేషం. మహారాణిగా అహల్యాబాయి హోల్కర్ మహారాణిగా పదవి చేపట్టిన తర్వాత తన సైన్యాన్ని ఆధునీకరిస్తూ బలోపేతం చేయడం, దౌత్య సంబంధాలను పటిష్ట పరచడం,పరిపాలనలో తనదైన ముద్రను చూపడంతో పాటు నిర్మాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చేది. ఆమె సమర్థవంతమైన పాలనలో ప్రజలు శాంతి, స్థిరత్వం, పురోగతి, ఆధ్యాత్మిక వికాసం లాంటి అంశాలను రుచి చూడగలిగారు. ప్రజలతో మమేకం అవుతూ వారి యోగక్షేమాలు చూసుకుంటూ రామరాజ్య స్థాపన చేసిన అహల్యాబాయి మహారాణి నాటి ప్రజల ఆరాధ్య దైవంగా మారిపోయారు. నాడు మహిళలు పాటించే పర్దా లేదా స్త్రీల ఏకాంతవాసం ఆచారాన్ని పాటించకుండా ప్రజలతో నేరుగా ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉండేది. వివాదాల పరిష్కారం కోసం కోర్టులను కూడా స్థాపించడం అహల్యాబాయి మహారాణికి మాత్రమే ప్రత్యేకం. యుద్ధ భూమిలో తనసామర్థ్యాన్ని ప్రదర్శించిన ఒక సామాన్య వ్యక్తికి తన కూతురును ఇచ్చి వివాహం జరిపించడం అహల్యాబాయి దార్శనికతకే నిదర్శనం.

**దేవాలయాల పునరుద్ధరణ:** మహారాణిగా అహల్యాబాయి అనేక కోటలు, రోడ్లు, బావులు, ధర్మశాలలు, హిందూ దేవాలయాలు, విశ్రాంతి గృహాలను నిర్మించడంతో పాటు నర్మదా నది ఒడ్డున తన రాజధానిగా మహేశ్వర్(శివుని నివాసం, నేటి మధ్యప్రదేశ్‌లో)ను నిర్ణయించింది. అనేక మంది కళాకారులు, శిల్పులకు ఉపాధి కల్పించడమే కాకుండా వారణాసి, ఘృష్ణేశ్వర్, త్రయంబక్, గయా, పుష్కర్, ద్వారక, ఉజ్జయిని, రామేశ్వరం, అయోధ్య, హరిద్వార్, మథుర, శ్రీశైలం, బృందావన్, నాథద్వారా, బద్రీనాథ్, కేదార్‌నాథ్ లాంటి పలు ఆలయాలను పునర్నిర్మించడం జరిగింది. శివుడికి నివాళిగా దేశవ్యాప్తంగా జ్యోతిర్లింగాలను పునరుత్థానం చేసింది. మొగుల్ చక్రవర్తి ఔరంగాజేబు కాశీ ఆలయాన్ని నాశనం చేసిన శతాబ్దం తర్వాత, ఆమె 1780లో కాశీ ఆలయాన్ని పునర్నిర్మించింది. మహేశ్వర్‌లో వస్త్ర పరిశ్రమను స్థాపించడం జరిగింది. 13 ఆగస్టు 1795న అహల్యాబాయి హోల్కర్ మహారాణి మరణించడంతో మల్హర్ రావు దత్తపుత్రుడు తుకోజీ రావు సింహాసనం అధిష్టించిన రెండు ఏండ్ల తర్వాత తన కుమారుడు జస్వంత్ రావుకు సింహాసనం అప్పగించారు. 1804లో బ్రిటీష్ వారితో యుద్ధంలో ఓడిపోయిన చివరి హోల్కర్ పాలకుడిగా మిగిలి పోయారు. మహారాణి అహల్యాబాయి హోల్కర్ బహుముఖ ప్రజ్ఞకు గుర్తుగా ఇండోర్ విమానా శ్రయానికి అహల్యాబాయి హోల్కర్ విమానాశ్రయంగా, ఇండోర్‌లోని విశ్వవిద్యాలయానికి దేవి అహల్యాబాయి యూనివర్సిటీగా, సోలాపూర్‌లోని విశ్వవిద్యాలయానికి పుణ్యశ్లోక్ అహల్యాదేవి హోల్కర్ యూనివర్సిటీగా పేరు పెట్టడం జరిగింది. పాలనలో దాతృత్వం, సామాజిక సంస్కరణలు, కళలు, సంస్కృతికి మద్దతుగా నిలిచిన అహల్యాబాయి నేటి ఇండోర్ నగర అభివృద్ధికి నాడే పటిష్ట బీజాలు నాటారు. వితంతువులకు ఆస్తి హక్కు, మహిళా సాధికారతలకు పెద్ద పీట వేశారు. రాజమాత అహల్యాదేవి హోల్కర్‌గా ప్రసిద్ధి గాంచి భారత స్వాతంత్ర్యానికి ముందు అత్యంత శక్తివంతమైన మహిళగా రుజువు చేసుకున్నారు. తత్వవేత్తగా, మహారాణిగా, సమర్థురాలైన పాలకురాలిగా కీర్తించబడిన అహల్యాబాయి భక్తురాలిగా, ధైర్యం కలిగిన నాయకురాలిగా కీర్తించబడ్డారు. ఆమె విలక్షణ సుపరిపాలన, సామాజిక సంస్కరణలు, సైనిక విజయాలను విస్మరించిన నాటి పాలకులు చరిత్ర పుస్తకాల్లో అహల్యాబాయి హోల్కర్ ప్రస్తావనలకు చాలా తక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అహల్యాబాయి 300వ వర్ధంతి సందర్భంగా నేటి యువత, ముఖ్యంగా యువతులు ఆమె జీవిత చరిత్రను ఆకళింపు చేసుకొని ఆమె చూపిన బాటలో పయనించాలని కోరుకుందాం.

- బి.ఎం.ఆర్

# ఎంత డిటర్జెంట్ వాడుతున్నారు?




**దుస్తులు చేత్తో ఉతుకుతున్నా, వాషింగ్ మెషీన్లో వేస్తున్నా... మోతాదుకు మించి డిటర్జెంట్ వాడొద్దు. అలా చేస్తే డబ్బుతోపాటు వనరుల్నీ వృథా చేస్తున్నట్టే!**

బట్టలకు మురికి, చెమట, మరకలు ఎక్కువగా పడితే చేత్తో ఉతికినా, వాషింగ్ మెషీన్లో వేసినా డిటర్జెంట్ కాస్త ఎక్కువ వేయడానికి చూస్తాం. ఈ అదనపు డిటర్జెంట్ వల్ల అదనపు శుభ్రత లభిస్తుందన్న ఆలోచనతో ఇలా చేస్తాం. నిజానికి దీనివల్ల లాభంకంటే నష్టమే ఎక్కువ. ఎక్కువ డిటర్జెంట్ వాడటంవల్ల నురుగు అధికంగా తయారవుతుంది. కానీ దాన్ని పోగొట్టడానికి అవసరమైనట్లు వాషింగ్మెషీన్ ఎక్కువసార్లు తిరగలేదు. మెషీన్ లోపల దుస్తులు ఒకదానికొకటి రుద్దుకోవడంవల్లనే వాటికుండే మురికి పోతుంది. ఎక్కువ డిటర్జెంట్ ఉండటంవల్ల దుస్తులు అలా రుద్దుకోకుండా జారిపోతాయి. దాంతో అది బట్టలపైనా, వాషింగ్ మెషీన్లోనూ మిగిలి పోతుంది. చేత్తో ఉతికినప్పుడు ఎక్కువ డిటర్జెంట్ ఉంటే ఎక్కువ నీటిని ఉపయోగించాల్సి వస్తుంది. దీనివల్ల నీరు, విద్యుత్ వృథాతోపాటు పర్యావరణానికీ నష్టమే. ఎక్కువ డిటర్జెంట్ సరఫరా ఎలా తెలుస్తుందంటారా? ఉతకడం కాస్త ఉంటాయి, దుస్తులను పట్టుకుంటే జిడ్డుగా, చేతికి అంటుకుంటున్నట్లు. బట్టలు రంగులు పోయి త్వరగా వెలిసిపోతాయి. సాధారణంగా ఒక లోడ్ వేసేటప్పుడు టేబుల్ స్పూన్ లిక్విడ్ డిటర్జెంట్ లేదా పావు కప్పు పౌడర్ వేయాలి. జాగ్రత్తగా గమనిస్తే తక్కువలో ఎంత వేయొచ్చో మీకే నిర్ధారణ అవుతుంది. □

**చెలి చిట్కా** చపాతీలు చేసేటప్పుడు గోధుమపిండిలో నీళ్లకు బదులుగా పాలు కలిపి చపాతీలు చేసి చూడండి చాలా రుచిగా ఉంటాయి. □

# స్నేహితురాలు ఉండాల్సిందే..



పనిలో బిజీగా ఉన్నా, కుటుంబ బాధ్యతల్లో పడిపోయినా కొంతమంది అమ్మాయిలు మొదట త్యాగం చేసేది స్నేహితులనే కానీ, మనల్ని మన మలుచుకోవాలన్నా, భావోద్వేగాలను పంచుకోవాలన్న స్నేహానికి మించిన బంధం ఏముంటుంది చెప్పండి. నిజానికి అమ్మాయిల మధ్య ఉండే స్నేహం ఒకింత ప్రత్యేకమైంది. ఎందుకంటే, మనసువిప్పి మాట్లాడుకోవడానికి ప్రతిఒక్కరికీ ఓ స్నేహితురాలు ఉండాల్సిందే. యూసిఎల్ఎ పరిశోధన ప్రకారం, మహిళలకు ఒత్తిడి కలిగినప్పుడు.. దాన్ని ఎదుర్కోవడంలో భాగంగా మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. వాటిలో ఆక్సిటోసిన్, ఈస్ట్రోజన్ కొన్ని. అవే మనం పిల్లలతో ఆడుకునేలా, ఇతర మహిళలతో స్నేహం చేయడానికి కారణమవుతాయట. దాంతో ఒత్తిడి దూరమై ప్రశాంతంగా ఉండగలుగుతాం. అయితే, ఈ కామింగ్ ఎఫెక్ట్ మగవారిలో ఉండదట. ఎందుకంటే వాళ్లు ఒత్తిడికి గురైనప్పుడు టెస్టోస్టిరాన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తయ్యి, ఆక్సిటోసిన్ ప్రభావాన్ని తగ్గిస్తుందట. కాబట్టి, ఒత్తిడి ఎదురైనప్పుడు అబ్బాయిలూ, అమ్మాయిలూ వేరుగా స్పందిస్తారట. అంతేకాదు, స్నేహితులతో ఎక్కువ సమయం గడిపే మహిళల్లో వయసు పైబడ్డాక వేధించే శారీరక బలహీనతలు వచ్చే అవకాశం తగ్గుతుందని హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధనలో తేలింది. అంతేనా, మన భావాలు పంచుకునే స్నేహితులు లేకుంటే, ఒత్తిడి గూడుకట్టుకు పోయి బరువు పెరిగే అవకాశాలు ఉన్నాయట. ఇక, సుమారు తొమ్మిదేళ్లపాటు స్నేహితులతో నాణ్యమైన సమయం గడిపిన వారిలో మరణించే ప్రమాదం 60శాతానికి పైగా తగ్గిపోతుదనీ పరిశోధనలు చెబుతున్నాయి. దీన్నిబట్టి దీర్ఘాయుష్షును అందించే జీవనమంత్రం స్నేహమే అని అర్థమవుతుంది. □

# క్యాలీఫ్లవర్ పకోడీ

**కావలసిన పదార్థాలు :** చిన్నగా తుంచిన క్యాలీఫ్లవర్ పూలు-రెండు కప్పులు, శనగపిండి-కప్పు, ఉప్పు, పసుపు-పావు చెంచా చొప్పున, అల్లం వెల్లుల్లి ముద్ద-అరచెంచా, కొత్తిమీర తరుగు చారెడు, కచ్చాపచ్చాగా నూరిన పచ్చిమర్చి-చెంచా, నూనె-వేయించేందుకు సరిపడా. **తయారీ :** ఒక పాత్రలో శనగ పిండి,ఉప్పు, పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, నూరిన పచ్చిమర్చి, కొత్తిమీర తరుగు వేసి కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ కొంచెం గట్టిగా కలుపుకోవాలి పూలను పిండిలో ముంచి తీసి కాగిన నూనెలో దోరగా వేయించుకుంటే సరిపోతుంది. కమ్మటి క్యాలీఫ్లవర్ పకోడీ చిన్నా పెద్దా అందరికీ నచ్చుతాయి. □



# వానలో పిల్లలు జాగ్రత్త !



చిటపట చినుకుల్లో తడవడం.. బురద నీటిలో గంతులేయడం. పారే నీటిలో పడవలు చేసి వదలడం! ఎంత వద్దన్నా చిన్నారులు చేసే పనులే ఇవి. నిజానికి నీటితో తనివితీరా ఆడుకోవచ్చనే ఈ కాలం అంటే ఇష్టపడతారు కూడా. వర్షాకాలమంటే వానలేనా..వాటితో మోసుకొచ్చే అనారోగ్యాలూ బోలెడు. వాటి బారిన మన పిల్లలు పడొద్దంటే..

**నీళ్లు గుర్తుచేయండి...** వాతావరణం చల్లగా ఉంటే మనకే నీళ్ల సంగతి గుర్తుండదు. ఇక పిల్లల మాట వేరే చెప్పాలా? అలాగని అశ్రద్ధ చేయొద్దు. తప్పక తాగించండి. అప్పుడే శరీరంలోని మలినాలు బయటకు పోతాయి. ఈ కాలంల నీళ్లే డయేరియా, కలరా వంటి అనారోగ్యాలకు ప్రధాన కారణం. కాబట్ట, శుభ్రమైన వాటికే ప్రాధాన్యమివ్వండి. అవసరమైతే కాచి వడకట్టి ఇవ్వండి. చలిగా ఉంటే గోరువెచ్చని నీటిని తాగిస్తే ఇంకా మంచిది. గొంతు ఇన్‌ఫెక్షన్లు, జలుబు, దగ్గు వగైరా దరిచేరకుండానూ ఉంటాయి.

**ఆహారం జాగ్రత్త...** ఈ కాలం జంక్‌ఫుడ్, బయటి ఆహారాలకు చిన్నారులను దూరంగా ఉంచండి. పొరపాటున పాడైన నిల్వ ఉన్న ఆహారం తిన్నారంటే అనారోగ్యాల బారిన పడతారు. కాబట్టి ఇంటి భోజనానికే ప్రాధాన్యమివ్వండి. వేడి వేడి సూపులు, పాలు పెరుగు స్మూతీలు, వంటివీ ఇవ్వాలి. కాలానికి అను గుణంగా దొరికే పండ్లు, కాయగూర లను ఎక్కువగా తినిపించండి. ముఖ్యంగా సి విటమిన్ ఎక్కువగా దొరికే నిమ్మ, నారింజ, జామ, క్యారెట్ వంటివాటికి ఎక్కువ ప్రాధాన్య మివ్వండి. ఇవి శరీరానికి కావాల్సన పోషకాను అందివ్వడమే కాదు, రోగ నిరోధకతను పెంచడంలోనూ సాయపడ తాయి. చల్లదనానికి స్తబ్ధుగా అనిపిస్తుంది. అలాగని ఊరుకుంటే ఆకలి మందగించడమే కాదు బద్ధకం గానూ తయారవుతారు. కాబట్టి, వ్యాయామం తప్పనిసరి. ఇంట్లోనే డ్యాన్స్, చిన్న చిన్న వ్యాయామాలు ప్లాన్ చేయండి. ఆటలూ ఆడనివ్వండి. అయితే బయటికే వెళ్లనీయొద్దు. బదులుగా ఇంట్లోనే బోర్డు గేమ్స్, పజిల్స్, క్రాఫ్ట్ వంటివి ఇస్తే మేలు. కథలు, యాక్టివిటీ పుస్తకాలు తెచ్చిస్తే బోరు కొడుతుందంటూ నస పెట్టరు. □

# ఆ మాయలో పడ్డారో..

ఆ బుల్లి పెట్టెలో ఏ మాయ ఉందో కానీ, నెలల పిల్లాడైనా కళ్ల ముందు మొబైల్ కనపడితే దానివైపు సమ్మోహ్నంగా చూస్తాడు. ఆ రంగుల కాంతి సహజంగానే వారిని ఆకర్షించేస్తుంది. అంతెందుకు ఒక అబ్బాయికి ఏడాదే. ఫోన్ చకచకా వాడేస్తాడు. తనకు నచ్చిన వీడియోలు వాడే పెట్టుకుంటాడని గొప్పగా చెప్పుకొంటాం కానీ అది ఆ చిన్న బుర్రలపై చూపే చెడు ప్రభావం చాలానే. జపాన్‌కి చెందిన ఓ విశ్వవిద్యాయలం చేసిన అధ్యయనం.. ఫోన్‌కి అలవాటుపడ్డ రెండేళ్లలోపు చిన్నారుల్లో కమ్యూనికేషన్, సమస్యా పరిష్కార నైపుణ్యాల్లో లోపాలు కనిపిస్తున్నా యని చెబుతోంది. రోజులో గంటకు మించితే చుట్టూ ఉన్నవాళ్లతో గడపడానికీ చిన్నారులు ఇష్టపడటం లేదంటోంది మరో పరిశోధన. మరీ చిన్నపిల్లల్లోనే ఈ సమస్య కాస్త పెద్దవాళ్లకు పర్లేదు అనుకుంటున్నారేమో!



కాస్త ఆ ఫోన్ పక్కనపెట్టు అన్నప్పుడు పిల్లలు మనకే ఎదురు తిరగడం, ఏడవడం, అరవడం లాంటివి గమనించారా? అది వాళ్ల మెదడుపై చూపుతున్న తీవ్ర ప్రభావానికి నిదర్శనమే అంటారు నిపుణులు. ఫోన్ టివి, ట్యాబ్, కంప్యూటర్ అన్నీ ఈ కోవలోకి వచ్చేవే. చదువు, పరిజ్ఞానం పెంచుకుంటారని మనం చేతికందించే ఆ సాంకేతికత ఒత్తిడి, ఊబకాయం, నిద్రలేమి లాంటి ఎన్నో తీవ్ర ప్రభావాలకు కారణమవుతోంది.

**ఎలా దూరం చేద్దాం ?...** ఇంట్లో స్క్రీన్ ఫ్రీ జోన్స్ ఏర్పాటు చేయండి. భోజనం, పడక గదుల్లో ఫోన్ వాడటం నిషిద్ధమ నండి. అయితే అది పెద్దవాళ్లూ పాటించాలి. వారానికోసారి మీరు 'డిటాక్స్ డే పాటించి, వాళ్లతో గడిపితే సరి. మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొని వాళ్లూ పాటిస్తారు. ఏమీ తోచడం లేదు అతి ఏదైనా ప్రమాదమే! పిల్లలు తెర సమయం కోసంచూపే సాకే ఇది. దాన్ని దూరం చేయడానికి ఇతర వ్యాపకాలను పరిచయం చేయండి. పుస్తకాలు చదివించండి. వాళ్లకు నచ్చినవి వాళ్లనే ఎంచుకోనిస్తే సరి. మరీ చిన్నపిల్లలైతే రంగు వేయడాన్ని ప్రోత్స హించొచ్చు. దెబ్బలు తగిలించు కుంటారు. అలర్జీలొస్తాయని ఆటలకు దూరం చేయొద్దు. ఆడనివ్వండి. నలుగురితో కలవనివ్వండి. శరీరానికీ వ్యాయామం, సామాజిక నైపుణ్యాలూ అలవడతాయి. షాపింగ్‌కి వెళ్లినపుడో, ఇంటికెవరైనా అతిథులొస్తేనో మిసిగించకుండా ఉంటారనీ ఫోన్ చేతికిస్తాం. కానీ సైబర్ వలలో పడేది అప్పుడు. తీరా వాళ్లేదో తెలియక నొక్కినా, డబ్బులు పోయినా నిందిస్తూ కూర్చుంటాం. ఇల్లంతా చెత్త అనుకోకుండా బొమ్మలు, వాళ్ల మెదడును పరీక్షించే ఆటవస్తువులు, పజిళ్లు కొనిస్తే సరి. వీలుండే సంభాషణల్లో వస్తువుల ఎంపికలో వాళ్ల అభిప్రాయాలకీ చోటివ్వండి. ఖర్చు, నాణ్యత వంటివి చర్చిస్తే భవిష్యత్తులో వాళ్లకీ ఉపయోగపడతాయి. వద్దు అన్నవి పిల్లలను మరింత ఆకర్షిస్తాయి. అందుకే అవే కావాలంటారు. కాబట్టి, వద్దన్న రోజులో స్క్రీన్ సమయం ఇంతసేపే'నన్న నిబంధన పెడితే. అయితే అదీ గంటకు మించొద్దు. దీనికోసం సమయం పూర్తయ్యాక ఫోన్ దానంతట అదే ఆఫ్ అయ్యేలా, ఏం చూస్తున్నారో అన్న బెంగ లేకుండా పేరెంటల్ కంట్రోల్ యాప్‌లు ప్రయత్నించవచ్చు. □

ఆధ్యాత్మికం

# జీవితాంతం నేర్చుకోవాలి



ఆధ్యాత్మిక గురుస్వామి రామతీర్థ ఒకసారి ఓడలో జపాన్ బయల్దేరారు. అదే ఓడలో 90 ఏళ్ల జపాన్ దేశస్థుడు ఉన్నాడు. అంత వయసులోనూ ఆయన చైనా భాషలో ఏదో రాసుకుంటూ వేస్తున్నాడు. రామతీర్థ ఆశ్చర్యంగా ఆయన వద్దకు వెళ్లి 'మహాశయా! ఇంతవార్ధక్యంలోనూ ఏదో రాస్తున్నారు? ఏమైనా సాయం కావాలా? అనడిగారు. అప్పుడా పెద్దాయన 'అయ్యా' నేను చైనా భాష నేర్చుకుంటు న్నాను. పలుకుతూ గనుక రాస్తే.. ఏ భాష అయినా చక్కగా ఉంటుంది కదా అని చిరునవ్వుతో సమాధానమిచ్చారు. ఈ వయసులో మీరు విశ్రాంతి తీసుకోకుండా ఇంత కష్టపడాలా? పైగా చైనా భాష చాలా కష్టమంటారు! అన్నారు. రామతీర్థ. ఆ కాగితాన్ని మడిచి, పక్కన పెట్టి.. జీవితమంటే ప్రవాహం, అది ఆగితే పాకుడు పడుతుంది. నిరంతరం సాగుతుండాలి. నేర్వాలన్న తపనే ఆ ప్రవాహాన్ని తేటగా ఉంచుతుంది. జ్ఞానం కూడా ఆధ్యాత్మికతలో భాగమే. బతికినన్నాళ్లూ ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉండాలి. ఇవి మాటలు కాదు.. మా జెన్ గురువు ప్రబోధాలు, అందుకే.. నేను సజీవంగా ఉన్నంత వరకూ నేర్చుకుంటూనే ఉంటాను అని వివరించారు. ఆ మాటలు విన్న స్వామి రామతీర్థకు ఓ కొత్తపాఠం. నేర్చుకున్నట్లయింది. రామకృష్ణ పరమహంస చెప్పిన ఎంత కాలం జీవిస్తానో, అంతకాలం నేర్చుకుంటూనే ఉంటాను అన్న బోధ మనసులో మెదిలింది. □

# కెరియర్ మారాలంటే భయమా !



2024లో విడుదల చేసిన నివేదికల ప్రకారం... మనదేశంలో దాదాపు 70 శాతం మంది మహిళలు పనిమీద, ఆఫీస్ వాతావరణం మీద ఆసక్తి లేకుండానే కార్యాలయాలకు వెళ్తున్నారట. వీరిలో 54 శాతం మంది ఉద్యోగాలు వదిలేయాలని కూడా అనుకుంటున్నారట. కానీ ఆది నుంచి మొదలు పెట్టాలంటే ఎవరికైనా కష్టమే. అందుకే చేస్తోన్న ఉద్యోగం నచ్చడం లేదు. జీతం సరిపోవడం లేదు. రోజుకి పది కిలోమీటర్లు ప్రయాణం చేయలేకపోతున్నా. కొత్తగా, ఏదైనా ప్రయత్నించాలి. ఇలా వేరే ఉద్యోగం వెతుక్కోవడానికి కారణాలెన్నో. కానీ మారాలంటేనే భయం. రక్షణ, పనివేళలు, కొత్త బాధ్యతలు, వర్క్ లైఫ్ బ్యాలెన్స్ లాంటి విషయాలను ఆలోచిస్తూ ఆగిపోతున్నారు మహిళలు. 'హ్యాపియెస్ట్ ప్లేస్ టు వర్క్' ఆర్గనైజేషన్ చాలామంది ఉద్యోగినులు రాజీనామా చేయడానికి సంకోచిస్తున్నారట. అయితే, ఈ ఆలోచనలు ఇచ్చే ఒత్తిడి కన్నా వేరే దానికి వెళ్లడమే మంచిది అంటున్నారు కెరియర్ నిపుణులు. కాకపోతే, పక్కా ప్రణాళికతో ముందడుగు వేయమంటున్నారు. □

# వరల్డ్ గేమ్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు సౌరవ్, శివం

**న్యూఢిల్లీ:** వరల్డ్ గేమ్స్-2025లో భారత్ క్యూయిస్టులు సౌరవ్ కొఠారి, శివం అరోరా క్వార్టర్ ఫైనల్స్ కు చేరుకోగా, కమల్ చావ్లా, నటాషా చేతన్ ఎలిమినేట్ అయ్యారు. ప్రపంచ క్రీడల్లో తీవ్రమైన పోటీ నెలకొన్న మంగళవారం భారత క్యూయిస్టులు సౌరవ్ కొఠారి, శివం అరోరా తమ తమ విభాగాల్లో క్వార్టర్ ఫైనల్స్‌లో తమ స్థానాలను కైవసం చేసుకున్నారు. అయితే, వారి సహచర కమల్ చావ్లా, నటాషా చేతన్ ఓటమితో నిష్క్రమించారు. ఉత్కంఠభరితంగా సాగిన స్నూకర్ ప్రిలిమినరీ గ్రూప్ మ్యాచ్‌లో చివరి బ్లాక్ వరకు, సౌరవ్ కొఠారి, గ్రేట్ బ్రిటన్‌కు చెందిన డారిల్ హిల్ చేతిలో 1-2 తేడాతో ఓడిపోయినప్పటికీ, చివరి ఎనిమిది స్థానాలకు చేరుకున్నాడు. హిల్, జాక్ కాస్కర్‌లతో జరిగిన త్రీవే టైలో అత్యుత్తమ ఫ్రేమ్ యావరేజ్ (+1) ఫలితంగా కొఠారి పురోగతి సాధించాడు. గతంలో కొఠారి చేతిలో ఓడిపోయిన కాస్కర్, హిల్‌ను 2-0 తేడాతో ఓడించి గ్రూప్‌లో రెండవ స్థానంలో నిలిచాడు. హేబాల్‌లో కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత శివమ్ అరోరా తన ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో స్వీడన్‌కు చెందిన కెవిన్ జరేకానిని 5-1 తేడాతో ఓడించి ఆధిపత్య ప్రదర్శన ఇచ్చాడు. మహిళల 6రెడ్ స్నూకర్‌లో మరో ఇద్దరు భారత క్యూయిస్టులు కమల్ చావ్లా, నటాషా చేతన్ ముందుకు సాగలేకపోయారు.

# మహిళల ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి దీప్తి

**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బౌలర్ దీప్తి శర్మ రెండో స్థానానికి చేరుకోగా, బ్యాట్స్‌మెన్‌లో ఓపెనర్ స్మృతి మంధాన రెండో స్థానానికి పడిపోయింది. పాకిస్థాన్‌కు చెందిన సాదియా ఇక్బాల్‌తో కలిసి ఆ స్థానాన్ని పంచుకున్న దీప్తి 732 రేటింగ్‌తో 2వ స్థానానికి ఎగబాకింది.





ఆస్ట్రేలియాకు చెందినఅన్నాబెల్ సదర్లాండ్ కంటే నాలుగు పాయింట్లు వెనుకబడి. తొలిసారి టీ20 బౌలర్‌గా నంబర్ 1గా నిలిచింది. పాకిస్తాన్ మహిళలు 1-2 తేడాతో ఓడిపోయిన ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసిన తర్వాత ఇక్బాల్ రేటింగ్ పాయింట్లు కోల్పోయి అగ్రస్థానాన్ని వదులుకుంది. మార్చిలో న్యూజిలాండ్‌పై నాలుగు వికెట్లు తీసిన తర్వాత సదర్లాండ్ ఈ చిన్న ఫార్మాట్‌లో ఆడలేదు, కానీ ఆమె రేటింగ్ పాయింట్లు (736) మారలేదు. దీప్తి 387 రేటింగ్ పాయింట్లతో ఆల్‌రౌండర్ జాబితాలో వెస్టిండీస్‌కు చెందిన హేలీ మాథ్యూస్ (505), న్యూజిలాండ్‌కు చెందిన అమేలియా కెర్ (434) తర్వాత మూడవ స్థానంలో నిలిచింది. స్టైలిష్ సౌత్‌పా స్మృతి మంధాన 728 రేటింగ్ పాయింట్లతో రెండవ స్థానానికి పడిపోయింది. ఇంగ్లాండ్‌కు చెందిన నాట్ స్కివర్‌బ్రంట్ (731) తర్వాత భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 10 స్థానాలు ఎగబాకి టాప్ 10లో నిలిచింది. ఆమె ప్రస్తుతం 11వ స్థానంలో ఉంది. ఐర్లాండ్ ఆల్ రౌండర్ ఓర్లా ప్రెండర్‌గాస్ట్ 19వ స్థానానికి చేరుకుంది.



# సబలెంకాకు సిన్సినాటి టైటిల్

## ఎమ్మా రాడుకానుపై మారథాన్ విజయం

**న్యూఢిల్లీ:** ఎమ్మా రాడుకానుపై 7-6 (3), 4-6, 7-6 (5) తేడాతో మారథాన్ విజయం సాధించిన అరినా సబలెంకా సిన్సినాటి టైటిల్‌ను కాపాడుకుంది. మంగళవారం దాదాపు మూడు గంటల తొమ్మిది నిమిషాలు పాటు జరిగిన ఈ మ్యాచ్ సబలెంకా కెరీర్‌లో నాల్గవ అతి ఎక్కువ సమయం కలిగినదిగా నమోదైంది. రాడుకాను వరుసగా ఎనిమిది పాయింట్లు గెలుచుకోవడం ద్వారా మ్యాచ్‌ను ప్రారంభించి డబుల్ ఫాల్ట్ అయింది. వరుసగా నాలుగు గేమ్‌లను కోల్పోయిన తర్వాత, రాడుకాను సర్వీస్‌ను నిలబెట్టుకుని స్కోరును 4-3తో ముగించింది. సబలెంకా బ్యాక్‌హ్యాండ్ తప్పిదం తర్వాత, మ్యాచ్ ముప్పై నిమిషాల్లోనే, రాడుకాను స్కోరును 4-ఆల్‌తో సమం చేసింది. రెండు బ్రేక్ పాయింట్లను ఆదా చేసుకుని, రాడుకాను 5-4 ఆధిక్యంలో నిలిచింది. 5-ఆల్ వద్ద సర్వ్ చేస్తూ, రాడుకాను తన అత్యుత్తమ ఆటను ఆడి, భారీ క్రాస్‌కోర్ట్ ఫోర్‌హ్యాండ్ విన్నర్, ఏస్‌తో ముగించింది. సబలెంకా కూడా టైబ్రేక్‌లోకి ప్రవేశించి రెండవ సెట్ ఆరు ఆటల పాటు స్థిరంగా సాగేలా చేసింది. అయితే రాడుకాను మూడు బ్రేక్ పాయింట్లు సంపాదించి చివరిదాన్ని గోల్‌గా మార్చే వరకు. రెండవ సెట్‌లో నమోదైన ఏకైక బ్రేక్ ఇది. మూడవ సెట్ వరుసగా ఏడు సులభమైన సర్వీస్ హోల్డ్‌లతో ప్రారంభమైంది. రడుకాను నాలుగు బ్రేక్ పాయింట్లను సేవ్ చేసి మొదటి సర్వ్‌ను కొట్టినా, సబలెంకా మూడవ సెట్‌లో ఎటువంటి విరామాలు లేకుండా సబలెంకా ముగించింది. దీంతో టైబ్రేకర్లలో ఆమె 11-0కి మెరుగుపడింది. ఆమె బుధవారం వైల్డ్ కార్డ్ టేలర్ టౌన్‌సెండ్‌పై 6-4, 6-1 విజేత అయిన జెస్సికా బౌజాస్ మనీరోతో రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్ ఆడనుంది.

# టి20లో హ్యాట్రిక్ బౌలర్లు

## లిస్టులో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక.. టీమిండియాకు నో హ్యాట్రిక్ రికార్డు




**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్ అంటేనే ఫాస్ట్ బ్యాటింగ్, ఫోర్లు, సిక్సర్లు. కానీ ఒక బౌలర్ వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు తీసినప్పుడు మ్యాచ్ మలుపు తిరుగుతుంది. అటువంటి అంతర్జాతీయ క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించడం చాలా కష్టం. అయితే, ఒక బౌలర్ వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు తీసి హ్యాట్రిక్ సాధించినప్పుడు, మ్యాచ్‌లో ఉత్కంఠ పతాక స్థాయికి చేరుకుంటుంది.

కొందరు బౌలర్లు ఇటువంటి అరుదైన ఘనత సాధించి చరిత్రలో తమ పేరును లిఖించుకున్నారు. ఈ అద్భుతమైన విక్టరీని సాధించి చరిత్ర సృష్టించిన టాప్ బౌలర్లు ఉన్నారు. టీ20 క్రికెట్‌లో ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు తీసి జట్టుకు విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించిన ఐదుగురు దిగ్గజ బౌలర్లలో ఆస్ట్రేలియాకు చెందిన బ్రెట్ లీ ఒకడు. 2007లో బంగ్లాదేశ్‌పై తొలి టీ20 హ్యాట్రిక్ సాధించారు. అతని బౌలింగ్ వేగానికి బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్ తలవంచక తప్పలేదు. ఈ రికార్డు ఇప్పటికీ బ్రెట్ లీ పేరు మీదే ఉంది.

అలాగే, 2009లో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ జాకబ్ ఓరమ్, శ్రీలంకపై అద్భుతాన్ని సాధించాడు. అతని కచ్చితమైన యార్కర్లు, నియంత్రిత బౌలింగ్‌తో శ్రీలంక బ్యాట్స్‌మెన్‌లను వెనువెంటనే పెవిలియన్‌కు పంపించారు. ఈ జాబితాలో మరో న్యూజిలాండ్ బౌలర్ టిమ్ సౌథీ కూడా ఉన్నారు. అతను 2010-11లో పాకిస్తాన్‌పై హ్యాట్రిక్ సాధించాడు. ఫామ్‌లో ఉన్న యూనిస్ ఖాన్, మహమ్మద్ హాఫీజ్, ఉమర్ అక్మల్ వంటి కీలక బ్యాట్స్‌మెన్‌లను అవుట్ చేసి పాకిస్తాన్‌ను కష్టాల్లోకి నెట్టాడు. శ్రీలంకకు చెందిన తిసారా పెరెరా, 2015-16లో భారత్‌పై హ్యాట్రిక్ సాధించారు. ఒకే ఓవర్‌లో హార్దిక్ పాండ్యా, సురేశ్ రైనా, యువరాజ్ సింగ్ వంటి దిగ్గజాలను అవుట్ చేయడం అతని కెరీర్‌లో చిరస్మరణీయమైన ఘట్టం. ఈ జాబితాలో చివరిగా, లసిత్ మలింగ ఉన్నాడు. తన అరుదైన బౌలింగ్ శైలి, యార్కర్లతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన లసిత్ మలింగ, 2016-17లో బంగ్లాదేశ్‌పై హ్యాట్రిక్ సాధించారు. ఆ తర్వాత మరో వికెట్ తీసి వరుసగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు సాధించి చరిత్ర సృష్టించారు.

ఇక, ఎక్కువమందిఆటగాళ్లు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక జట్ల నుంచి ఒక్కో బౌలర్ ఉన్నారు. ఈ విధంగా ఈ మూడు దేశాలు సమానంగా ఉన్నాయి.భారతబౌలర్లకు ఇప్పటి వరకు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో హ్యాట్రిక్ రికార్డు లేదు.



# బాక్సింగ్‌లో భారత్‌కు 27 పతకాలు

## అండర్ 19, 20లో 2, 4వ స్థానాలు


**న్యూఢిల్లీ:** ఆసియా అండర్ 19, అండర్ 22 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్-2025లో మొత్తం 27 పతకాలతో భారత్ ప్రచారం ముగిసింది.

10 రోజుల పాటు జరిగిన ఈ రెండు కేటగిరీల ఛాంపియన్‌షిప్‌ల్లో భారత్ అండర్ 19 స్టాండింగ్స్‌లో మొత్తం మీద రెండవ స్థానంలోను, అండర్ 22లో నాల్గవ స్థానంలో నిలిచింది. అలాగే అండర్ 19 గ్రూప్ విభాగంలో మూడు స్వర్ణాలు, ఏడు రజతాలు, నాలుగు కాంస్య పతకాలతో సహా మొత్తం 14 పతకాలతో స్వదేశానికి చేరుతోంది. స్వర్ణాలలో ఉజ్బెకిస్తాన్ (ఏడు) కంటే రెండవ స్థానంలో ఉంది. ఇక అండర్ 22 బృందం నాలుగు రజత పతకాలను గెలుచుకుని మొత్తం 13 పతకాలతో తమ ప్రచారాన్ని ముగించింది. మహిళల 80+ కిలోల ఫైనల్లో రితిక ద్వారా ఏకైక స్వర్ణం లభించింది, అక్కడ ఆమె కజకిస్తాన్‌కు చెందిన అస్సెల్ టోక్టాసిన్‌ను ఓడించింది. చివరి రోజు ఉదయం సెషన్‌లో, మహిళల 57 కిలోల విభాగంలో యాత్రి పటేల్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ఖుమోరబోను మమజోనోవా చేతిలో ఓడిపోయి రజతంతో సరిపెట్టుకోగా, 60 కిలోల ఫైనల్‌లో చైనాకు చెందిన యు టియాన్‌తో ప్రియా చేసిన పోరాటం 2-3 తేడాతో ఓడిపోయింది. పురుషుల 75 కిలోల ఫైనల్‌లో నీరజ్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన షావ్‌కట్జోన్ బోల్టేవ్ చేతిలో, 90+ కిలోల స్వర్ణ పతక పోరులో ఇషాన్ కటారియా ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ఖలీమ్జోన్ మమసోలీవ్ చేతిలో ఓడి ఇద్దరూ రజత పతకాలు సాధించారు. ఈ సంవత్సరం ప్రారంభంలో, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో అండర్ 15, అండర్ 17 జట్లు కలిసి మొత్తం 43 పతకాలు సాధించాయి. అండర్ 15 పోటీలో భారత్ అత్యధిక స్వర్ణాలు సాధించింది. 15 బంగారు పతకాల పోరులో 10 కైవసం చేసుకుంది.

# వాణిజ్యం

## సెన్సెక్స్ నిఫ్టీలపై అమ్మకాల ఒత్తిళ్లు

**ముంబయి, ఆగస్టు 12:** దేశీయ స్టాక్ మార్కెట్‌సూచీలు మంగళవారం నష్టాల్లోముగిసాయి. లాభాల్లో ప్రారంభం అయిన సూచీలు రోజంతా ఒత్తిళ్లకు లోనయ్యాయి. చివరికి నష్టాల్లోనే ముగిసాయి. ఫైనాన్షియల్, ఎఫ్‌ఎంసిజి, రియాల్టీ షేర్లలో అమ్మకాలు సూచీలపై ప్రభావంచూపించాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు షేర్లలోఅమ్మకాలుసూచీలుపై ఒత్తిడినిపెంచాయి. జూలైనెలకు సంబంధించి భారత్ అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉన్నారు. వడ్డీరేట్ల అంశాన్ని ఈ గణాంకాలుప్రభావితంచేస్తాయి. అమె రికా రష్యా మధ్య ఈనెల 15న జరగనున్న చర్చలపైనా ఇన్వెస్టర్లుఫోకస్ పెంచారు.



ఉక్రెయిన్ యుద్ధంపై ఇరువురు దేశాధినేతల భేటీలో ఎలాంటినిర్ణయం వెలువడుతుందన్న ఆసక్తికూడా పెరిగింది. సెన్సెక్స్ ఉదయం 80,.508.51 పాయింటల్వద ప్రారంభం అయింది. కాసేపటికే లాభాల్లోకి వచ్చిన సూచీ 80,997.67 పాయింట్లవద్ద గరిష్టాన్ని తాకింది. కాసేపటికే మళ్లీ నష్టాల్లోకివెళ్లింది. ఇంట్రాడేలో ఒడిదొడుకులు ఎదుర్కొన్న సూచీలు చివరిలో అమ్మకాల ఒతిత్డఇతో 368.49 పాయింట్ల నష్టంతో 80,235.59వద్ద ముగిసింది. నిఫ్టీ97.65 పాయింట్లనష్టంతో 24,487.40 పాయింట్లవద్దస్థిరపడింది. డాలరుతోరూపాయి మారకంవిలువ 87.71 గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలు బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, హిందూస్థాన్ యూనిలీవర్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎటర్న ల్‌షేర్లు నష్టపోయాయి.మారుతిసుజుకి, టెక్‌మహీంద్ర, మహీంద్ర అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ, టాటాస్టీల్ కంపెనీలషేర్లు లాభాల్లోముగిసాయి. అంతర్జాతీయ మారెనకట్‌లో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 64 డాలర్లుగాట్రేడ్ అయితే బంగారం ఔన్స్ ఒక్కింటికి 3349 డాలర్లవద్ద కొనసాగింది.

## ప్రత్యక్ష పన్నువసూళ్లు 6.64 లక్షలకోట్లు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** దేశంలో ప్రత్యక్షపన్నుల నికరరాబడులు ఈ ఆర్థికసంవత్సరంలో ఇప్పటివరకూ 6.64 లక్షలకోట్లరూపాయలు వసూళ్లు అయ్యాయి. గత ఏడాదితోపోలిస్తే 3.95శాతం తగ్గినట్లు తేలింది. ఎక్కువగా రీఫండ్‌లు వెళ్లడం వల్లనే పనన్నురాబడుల్లో తగ్గుదల ఉందని ప్రభుత్వం మంగళవారం డేటా విడుదలచేసింది. కంపెనీలు, వ్యక్తులు, వృత్తినిపుణులు, ఇతర సంస్థలు చెల్లించినపన్నులు ప్రత్యక్ష పన్నుల పరిధిలోకి వస్తాయి. నికర కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు రూ.2.29 లక్షలకోట్లుగా ఉంది. నాన్‌కార్పొరేట్ ట్యాక్స్ రూ.4.12 లక్షలకోట్లుగా ఉన్నట్లు వెల్లడి అయింది. సెక్యూరిటీస్ లావాదేవీలపన్ను 22,362 కోట్లవరకూ ఉన్నట్లు తేలింది. ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి ఆగస్టు 11 వరకూ చూస్తే కొంతమేర తగ్గుదలనమోదయింది.




మొత్తంగా నికర వసూళ్లు రూ.6.64 లక్షలకోట్లుగా ఉన్నాయి గత ఏడాది ఇదేకాలంలో 6.91 లక్షలకోట్లు వసూళ్లుకాగా ఈఏడాది తగ్గుదల నమోదయింది. ఇక రీఫండ్‌ల పరంగాచూస్తే పదిశాతం పెరిగాయి. రూ.1.35 లక్షలకోట్లవరకూ ఉన్నట్లు తేలింది. రీఫండ్‌లకు ముందు స్థూల పన్నువసూళ్లు రూ.7.99 లక్షలకోట్లుగా ఉన్నాయి. 1.87శాతం తగ్గి 8.14 లక్షలకోట్లుగా ఉంది. స్థూల పన్నులవసూళ్లలోకూడా రీఫండ్‌లకారణంగానే తగ్గుదల ఉన్నట్లు తేలింది. ప్రభుత్వం ప్రత్యక్షపన్నుల వసూళ్లు ఈ ఏడాది రూ.25.20 లక్షలకోట్లుగా ఉంటాయని అంచనా వేస్తోంది. గత ఏడాదికంటే 12.7శాతంపెరుగుతాయని చెపుతోంది. ఎస్‌టిటిద్వారా రూ.78వేల కోట్లు రాబట్టాలన్న టార్గెట్ విధించింది.

## మైక్రోఫైనాన్స్‌రంగానికి 220 బిలియన్ డాలర్ల క్రెడిట్ గ్యారంటీ అవసరం!

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** భారత్‌లోని సూక్ష్మఫైనాన్స్ రంగం కేంద్ర ప్రభుత్వంనుంచి 220 బిలియన్ డాలర్ల క్రెడిట్‌గ్యారంటీ మద్దతుఅవసరం అవుతుందని ఈ రంగ నిపుణులు అంచనావేస్తున్నారు. దీనివల్ల మైక్రోఫైనాన్స్ రంగంలో రుణాల వృద్ధిపెరుగుతుందని అంచనావేస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌లో బ్యాంకులనుంచి తీసుకున్న రుణాల్లో 75శాతం డిఫాల్ట్ గ్యారంటీ కవరేజ్ కేంద్రం ఇస్తే కొంతమేర కోలుకుంటుందని, మైక్రోఫైనాన్స్ సంస్థ సిఇఒ అలోక్‌మిశ్రా వెల్లడించారు. మైక్రోఫైనాన్స్ రుణపరపతి మార్చి 2024లో అత్యంత గరిష్టానికి వెళ్లింది. 4.3 లక్షలకోట్లరూపాయలు రుణపరపతినిచ్చినట్లు తేలింది. ఈ రంగంలో మొత్తం బకాయిలు రూ.3.5 లక్షలకోట్లుగా ఉన్నాయి. 2024 జూన్‌తోపోలిస్తే 16.7శాతం తగ్గినట్లు మైక్రోఫైనాన్స్ నెట్‌వర్క్ చెపుతోంది. ఎలాంటి హామీలేని రుణాలకు మైక్రోఫైనాన్స్ పెట్టిందిపేరు. రుణగ్రహీతలకు రెండువేల డాలర్లకు తగ్గకుండా రుణపరపతి కల్పిస్తుంది. అందువల్లనే అల్పాదాయ రంగాల



కుటుంబాలు మైక్రోఫైనాన్స్‌పై ఎక్కువ ఆధారపడుతున్నాయి. మైక్రోఫైనాన్స్ నెట్‌వర్క్ చీఫ్ వినీత్ ఛాత్రీ మాట్లాడుతూ ఈ స్కీం వల్ల బ్యాంకులకు రిస్కుతగ్గుతుందని, తక్కువ వడ్డీలకు మైక్రోఫైనాన్స్‌లకు రుణాలివ్వడం, రికవరీ కూడా సులువవుతున్నందున మైక్రోఫైనాన్స్‌కు క్రెడిట్ గ్యారంటీకి కూడా ప్రభుత్వం మద్దతిస్తున్నదని చెపుతున్నారు.

కరోనా కాలంలోకూడా మైక్రోఫైనాన్స్ ఇండస్ట్రీని సంరక్షించేందుకుగాను కేంద్రం 750 కోట్లరూపాయలు క్రెడిట్ సపోర్టు ఇచ్చింది. ప్రస్తుతం ఈ రంగానికి అధిక వడ్డీరేట్ల సమస్య ఎక్కువగా ఉంది. ఇందుకోసం రుణపరపతిల్లో సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని ఆర్థికరంగ నిపుణులు సైతం చెపుతున్నారు.




## 312 బ్రోకరేజి సంస్థలపై సెబీ తనిఖీలు!

**ముంబయి, ఆగస్టు 12:** స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ 2025లో తనిఖీలు ముమ్మరంచేసింది. స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్ల సొమ్ముకు భద్రత కల్పించడంలో విఫలం అయిన బ్రోకరేజి సంస్థలపై నిఘా పెంచింది. ఈ ఏడాది ఇప్పటివరకూ 312 బ్రోకరేజి సంస్థలను తనిఖీచేసింది. గత ఏడాది ఇదేకాలంలో 146 సంస్థలను పరిశీలించింది. మొత్తం రీసెర్చి అనలిస్టులపైనా 149 ఇన్‌స్పెక్షన్లు నిర్వహించింది. 2024లో కేవలం 15 తనిఖీలుమాత్రమేచేసిన సెబీ ఇన్వెస్ట్‌మెంట్ సలహాదారులపైనా 207 మందిపై తనిఖీలునిర్వహించింది. గత ఏడాది 21 మందిపైనే తనిఖీచేసింది. ఇక మ్యూచువల్‌ఫండ్ ఇన్‌స్పెక్షన్స్‌పరంగా చూస్తే స్థిరంగా ఉన్నాయి.

24 ఫండ్ సంస్థలపై తనిఖీలుచేసినట్లు సెబీవార్షిక నివేదికలో వెల్లడించింది. ఇక ఎన్‌ఫోర్స్‌మెంట్‌పరంగా సెబీ 287 విచారణలుచేసింది. ఇన్‌సైడర్‌ట్రేడింగ్‌కేసులపై ఎక్కువ ఫోకస్‌పెంచి వీటిపైనే విచారణచేసింది. ఇక ధరల రిగ్గింగ్‌కేసులపరంగాచూస్తే గత ఏడాది 77 వరకూ ఉంటే సెబీ నిఘా వల్లనోఏమోకాని 61కి తగ్గాయి. ఇక స్టాక్‌ట్రేడింగ్‌లో సహేతకమైన విధానాలు అనుసరించకపోవడం నిబంధనలు ఉల్లంఘించడం వంటి వాటిపై 106 దర్యాప్తులుచేసింది. అదే గత ఏడాది 160 వరకూ చేసింది. స్టాక్ మార్కెట్లపై తరచూ ఇన్‌సైడర్‌ట్రేడింగ్, స్టాక్ ధరలను అనూహ్యంగాపెంచి రికార్డుల్లో చూపించడం, సంస్థల విలువలనుకూడా వాస్తవానికి భిన్నంగా చూపించడం వంటివి ఎక్కువ కొనసాగుతుంటాయి. వీటిని ఆసరాగాచూసుకుని స్టాక్‌బ్రోకరేజి సంస్థలు ఇన్వెస్టర్లను ఊరించడం ఆపై ఇన్వెస్టర్లు మోసపోవడం వంటివిజరుగుతున్నాయి. వీటిని అరికట్టేందుకే సెబీ ప్రతిఏటా తన జూలు విదిలిస్తోంది.



## జులై రిటైల్ ద్రవ్యోల్బణం 2.1%

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** భారత్‌రిటైల్‌ద్రవ్యోల్బణం జులై నెలలో 1.55శాతంగా నమోదయింది. జూన్‌లో 2.1శాతం ఉన్న రిటైల్‌ద్రవ్యోల్బణం జులైలో గణనీయంగా తగ్గింది. దీనితో వరుసగా తొమ్మిదోనెలలోకూడా ధరల సవరణకు మార్గం ఏర్పడింది. రిజర్వుబ్యాంకు వేసిన అంచనాలు 2-6 మధ్యలో ఉంటుందన్న అంచనాలకు కూడా తగ్గి నమోదుకావడం మంచిపరిణామంగా ఆర్థికనిపుణులు చెపుతున్నారు. 2017 జూన్‌తర్వాత మొదటిసారిగా అతితక్కువ ద్రవ్యోల్బణం నమోదయింది. పప్పుదినుసులు, రవాణా, కమ్యూనికేషన్, వెజిటబుల్స్, తృణధాన్యాలు, విద్య, కోడిగుడ్లు, చక్కెర వంటి వాటిధరలు తగ్గడమే ఇందుకుకారణం. అలాగే ఆహార ఉత్పత్తుల ధరలు మాత్రం ప్రతికూలంగా ఉన్నాయి. వినియోగరంగ ఆహార ఉత్పత్తులధరలసూచీ సిఎఫ్‌పిఐ పరంగాచూస్తే మైనస్ 1.76శాతంగా జులైలో నమోదయింది. అంతకుముందునెలలో మైనస్ 1.01గా ఉన్న ఈ ద్రవ్యోల్బణం మరింతగాపెరిగింది. గ్రామీణ, పట్టణ ధరలపరంగా ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో జులైనెలకుగాను 1.72నుంచి 1.18శాతానికి దిగివచ్చింది. అలాగే పట్టణప్రాంతాల్లో రిటైల్‌ద్రవ్యోల్బణం 2.56 శాతంనుంచి 2.05శాతానికి దిగివచ్చింది. గ్రామీణప్రాంతాల్లో ఆహార ఉత్పత్తులదరలు మరింత క్షీణించాయి. మైనస్1.76గా ఉన్నాయని అంచనావేసింది. ఇక హెల్త్‌కేర్ వ్యయాలు కొద్దిగాపెరిగాయి. 4.57శాతంగా ఉంది. ఇంధనం, విదునయత్ వంటి కూడా కొంతమేర ఎగువకు నమోదయ్యాయి. 2.55శాతంనుంచి 2.67శాతంగా ఉన్నాయి. ఇక విద్య, రవాణా వ్యయాలు సరళం అయ్యాయి. విద్యరంగపరంగా 4.37శాతంనుంచి 4శాతం, రవాణాపరంగా 3.90శాతంనుంచి 2.12శాతానికి దిగివచ్చాయి. హౌసింగ్ వ్యయాలు స్థిరంగా ఉన్నాయి. 3.17శాతంవద్దనే నమోదయినట్లు తేలింది. ఇక కేరళలో అయితే అత్యధికద్రవ్యోల్బణం జులైలో 8.89శాతంగా నమోదయింద.ఇ జమ్ముకాశ్మీర్‌లో అతితక్కువ అంటే 3.77శాతం, పంజాబ్‌లో 3.53శాతంగా రిటైల్‌ద్రవ్యోల్బణం నమోదయింది. ఇందుకు అనుగుణంగా అస్సాం, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలు ప్రతికూల ద్రవ్యోల్బణం నమోదుచేసాయి.

## కుటుంబ వ్యాపారాల్లో గుప్తా, అగర్వాల్‌లే అధికం!

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** భారత్‌లోని టాప్ కుటుంబ వ్యాపార సంస్థల్లో అగర్‌వాల్, గుప్తా ఇంటిపేర్లే అధికంగా ఉన్నట్లు బార్‌క్లేస్‌ప్రైవేట్‌క్లయింట్స్, హురూన్ ఇండియా సంస్థలు వెల్లడించాయి. 2025 ప్రైవేట్‌క్లైయిట్స్ జాబితాలో ఎక్కువశాతం అగర్వాల్, గుప్తా కుటుంబాలే ఉన్నాయి. ఈ ఇంటిపేర్లతో చెరొక 12 కుటుంబాలున్నాయి. అనిల్ అగర్వాల్ హిందూస్థాన్ జింక్ 2.6 లక్షలకోట్లు ఉంటే అనిల్‌రాయ్‌గుప్తా హ్యావెల్స్ ఇండియా 97,400 కోట్లు విలువైన కంపెనీగా ఉంది. ఇక పటేల్ ఇంటిపేరుతో కూడా పదికుటుంబాలున్నాయి. పంకజ్‌పటేల్ జైడస్‌లైఫ్‌సైన్సెస్ రూ.1.1 లక్షలకోట్ల విలువైన సంస్థగా నడుస్తోంది. ఇక జైన్‌కుటుంబాలుకూడా తొమ్మిది బిజినెస్ సంస్థలున్నాయి. వివేక్‌జైన్స్ ఐనాక్స్ జిఎఫ్‌ఎల్‌గ్రూప్ విలువలు రూ.57,600 కోట్లవరకూ ఉన్నట్లు అంచనా. కుటుంబ వ్యాపారాల్లో అగర్వాల్, గుప్తా, పటేల్ ఈ మూడుకుటుంబాలే ఎక్కువ ఉన్నాయి. కొన్ని తరాలుగా ఈ కుటుంబాలు బిజినెస్‌లో నిమగ్నం అయ్యాయి. ఆ తర్వాత మెహతా, గోయంకా, షా కుటుంబాలు కూడా ఐదేసి సంస్థలచొప్పున నడుపుతున్నాయి. టొరెంట్‌ఫార్మా, ఫస్ట్‌సోర్స్ సొల్యూషన్స్, ఫైన్ ఆర్గానిక్ ఇండస్ట్రీస్ వంటివి ఉన్నాయి. ఇతరత్రా సింగ్; రావ్, దోషి ఇలాంటిపేర్లు కూడా ఉన్నాయి. రాజీవ్‌సింగ్ డిఎల్‌ఎఫ్ ఇపుడు రూ.2.1 లక్షలకోట్లతో ఉంది. విహెచ్‌పిఎల్ రాంవ్ కుటుంబంనుంచే వచ్చింది. ఎక్‌జై ఇండస్ట్రీస్ దోషి కుటుంబంనుంచి నడుపుతున్నారు. వచ్చే ఐదేళ్లలో ఈ వానయపారసంస్థలు 130 లక్షలకోట్ల సంపదను భావితరాలకు బదలీచేయనున్నట్లు అంచనా. మొత్తం 71 కుటుంబాలు ఇప్పటికీ కుటుంబ వ్యాపారసంస్థలు నిర్వహిస్తున్నారుని బార్లేక్స్ ప్రైవేట్ బ్యాంక్ హెడ్ నితిన్‌సింగ్ చెప్పారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.